



రాజకీయం పూర్తిగా మారింది. ఈ ఏడాదిలో పాలకులే కాదు పాలన తీరుతెన్నులు కూడా మారిపోయాయి. నేతల్లో కొందరికి చేదు అనుభవాలు ఎదురైతే మరికొందరికి రాజసం దక్కింది. ఇంకొందరిని అదృష్టదేవత వరించింది. తద్వారా ఉమ్మడి ప్రకాశం జిల్లా రాజకీయ పుటల్లో 2024 ప్రత్యేక స్థానాన్ని పొందగలిగింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ఏడాది ఆరంభం (వైసీపీ పాలన చివర్లో) ప్రజలను భయకంపితులను చేసిన భూఆక్రమణలు, రాజకీయ పైరవీలు, అక్రమ కేసులు, రౌడీయిజం లాంటివి కనుమరుగై సహజసిద్ధమైన పాలన వచ్చింది. వ్యవస్థలన్నీ గాడిలో పడ్డాయి. ఇందుకు పోలీసు శాఖ నిదర్శనం. తారుమారైన రాజకీయ నాయకుల చరిత్రలు, అంతకుమించి పాలక పక్షంలో జిల్లాకు అత్యధిక పదవులు దక్కడం ముఖ్యమైన రాజకీయ ఘట్టాలుగా చెప్పుకోవచ్చు.

2024 భలే మార్పు

తారుమారైన రాజకీయం



మార్కాపురంలో ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు, పక్కన మాగుంట, కందుల (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లా ఏర్పాటు అనంతరం పరిశీలిస్తే ఈ ఏడాది రాజకీయంగా చాలా ప్రత్యేకమైంది. రమారమి రెండు దశాబ్దాల అనంతరం ఉమ్మడి జిల్లాలో తెలుగుదేశం పార్టీకి పూర్తి ఆధిక్యం లభించగా ఒంగోలు లోక్‌సభ లాంటి స్థానంలో 25 ఏళ్ల అనంతరం ఆపార్టీ జెండా ఎగిరింది. అదేసమయంలో అనూహ్య పరాజయాలతో వైసీపీ పునాదులు కూడా కదిలిపోయాయి. 1983-85, 94నాటి విజయాల కన్నా ఈ ఏడాదిలో ఉమ్మడి జిల్లాలో టీడీపీకి లభించిన గెలుపు ఘనమైనదంటే అతిశయోక్తి కాదు. అలాగే పులివెందుల తరహా పటిష్టమైనదిగా భావించిన ఒంగోలు లోక్‌సభ స్థానంలో, గత ఎన్నికల్లో 80వేలకు పైన ఆధిక్యం సాధించిన గిద్దలూరు అసెంబ్లీలో వైసీపీ కలలో కూడా ఊహించని చేదు అనుభవాలను ఎదుర్కొంది. నాయకులుగా చాలామందికి ఈ ఏడాది కలిసిరాగా.. కరణం బలరాం, బాలినేనిలాంటి కీలక నేతలు పరాజయం పాలయ్యా

- అనూహ్య విజయాలు కూటమి సొంతం
- టీడీపీకి పూర్తి ఆధిక్యం
- వైసీపీకి ఊహించని ఎదురుదెబ్బ
- పట్టు కోల్పోయిన ఆ పార్టీ నేతలు
- కీలక నాయకులకు కలసిరాని కాలం
- మారిన పాలన తీరుతెన్నులు
- గాడిలో అన్ని వ్యవస్థలు
- పదవుల్లోనూ జిల్లాకు ప్రాధాన్యం

పదవుల్లో జిల్లాకు ప్రాధాన్యం

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది పాలక పదవులు ఉమ్మడి జిల్లాకు అధికంగా దక్కాయి. ఉమ్మడి జిల్లాలో ఇద్దరికీ అందునా కీలకమైన టీడీపీ నుంచే మంత్రి పదవులు దక్కడమే విశేషంగా భావించారు. ఆ తర్వాత నామినేటెడ్ పోస్టుల భర్తీలో తొలి జాబితాలోనే నాలుగు కీలకమైన కార్పొరేషన్లు లభించాయి. దామచర్ల సత్య, లంకా దినకర్ లాంటి వారు తొలిసారిగా ప్రభుత్వ పదవులను అలంకరించగలిగారు.





రు. జిల్లాతో విడదీయరాని అనుబంధం ఏర్పరుచుకున్న మాగుంట కుటుంబ వారసుల్లో ఒకరైన మాజీ ఎంపీ పార్వతమ్మ కన్నుమూయడం విషాదం. అదే కుటుంబానికి చెందిన శ్రీనివాసులరెడ్డికి అదృష్టం కలిసొచ్చి మళ్లీ పార్లమెంట్‌కు వెళ్లగలిగారు. దామచర్ల సత్య, బాలాజీ, దినకర్, మర్రెడ్డి, విజయ్‌కుమార్‌లాంటి ఎందరో అధికార అందలం ఎక్కగలిగారు. గొట్టిపాటి రవి, స్వామిలు అమాత్యులుగా, జిల్లాలో కీలక నాయకులుగా మారారు. కొత్తగా శాసనసభలో అడుగుపెట్టాలని తహతహలాడిన ఒకరిద్దరిని అదృష్టం వరించగా కొందరిని దురదృష్టం వెంటాడింది

మారిన పరిస్థితులు

ఒంగోలు, మార్కాపురం, కనిగిరి డివిజన్ ప్రాంతాల్లో భూఆక్రమణలు.. వాటిపై సిట్ ఏర్పాటు, వేధింపులు, గ్రానైట్ రంగంలో కడప నుంచి జిల్లాకు దిగుమతి అయిన జగన్ గ్యాంగ్ ఆగడాలు, ప్రజాప్రతినిధుల హంగూ ఆర్భాటాలు ఈ ఏడాది ప్రారంభంలో కనిపించిన దృశ్యాలు. ఈ ఏడాది మేలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మార్పుతో ఆ పరిస్థితులన్నీ తారుమారయ్యాయి. అక్రమ కేసులు లేవు. హత్యలు లేవు. రాజకీయ వేధింపులు లేవు. భూఆక్రమణలు కనిపించడం లేదు. వెరసి రాజకీయ వేధింపుల నుంచి విముక్తితో ప్రజలు, ఉద్యోగులకు ప్రశాంత జీవితం ప్రారంభమైంది. గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం మోపారు. గతప్రభుత్వ వేధింపులతో ఇబ్బందుల్లో ఉన్న గొట్టిపాటి రవికుమార్, స్వామి మళ్లీ ఎమ్మెల్యేలుగా గెలవడమే కాక ప్రాధాన్యం కలిగిన శాఖలకు మంత్రులయ్యారు. ముఖ్యమంత్రికి నమ్మకస్థులుగా మనగలుగుతున్నారు.

మాగుంటను వరించిన అదృష్టం

అప్పట్లో కాంగ్రెస్‌కు, ప్రస్తుతం వైసీపీకి పులివెందుల తర్వాత ఆస్థాయిలో ఒంగోలు లోక్‌సభ స్థానం బలమైనదిగా పేరుంది. అందునా మాగుంట కుటుంబం నుంచి శ్రీనివాసులరెడ్డి ఎంపీగా ఉండటం

మిగతా 6వ పేజీలో

గెలిచినా కలిసిరాని కాలం

ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకించి టీడీపీలో గెలిచినా పర్చూరు, ఒంగోలు ఎమ్మెల్యేలకు కాలం కలిసిరాలేదు. ముఖ్యంగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ విజయం సాధించడంతోపాటు గడిచిన ఐదేళ్ల బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా పార్టీ బండిని ముందుకు లాగారు. కానీ ఆయన ఎమ్మెల్యేగానే మిగిలారు. ఆ జిల్లా నుంచి ఇద్దరు మంత్రులయ్యారు. ప్రకాశం జిల్లాలో క్లిష్ట సమయంలో పార్టీ బాధ్యతలు మోసిన దామచర్ల జనార్దన్ ఒంగోలు ఎమ్మెల్యేగా మంచి విజయం సాధించినా ఇతర పదవులు దక్కలేదు.

ఉగ్ర, అశోక్‌లకు గుర్తింపు

తెలుగుదేశం పక్షాన కనిగిరి, గిద్దలూరు ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, అశోక్‌రెడ్డిల గెలుపులకు మంచి గుర్తింపు లభించింది. నిజానికి ఆ ఇద్దరు పోటీ చేసిన స్థానాలు వైసీపీకి బలమైనవైనప్పటికీ టీడీపీ గెలుపులో కూటమి పార్టీల అనుకూల వాతావరణంతోపాటు ఆ ఇద్దరు నాయకుల వ్యక్తిగత కృషి దాగుందనే విషయాన్ని అధిష్ఠానం గుర్తించి ప్రోత్సహించింది.

వాగు భూమి హాంఫట్!

- గుట్టుగా ఆక్రమించిన వైసీపీ నేత
- ముందు బంకులు ఏర్పాటు చేసిన వైనం
- మార్కెట్ ప్రకారం దాని విలువ రూ.10 కోట్లు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



జాతీయ రహదారిని ఆనుకుని వాగుభూమిలో వెలిసిన బంకులు

మార్కాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అది పెద్దారవీడు మండలంలోనే అత్యంత విలువైన ప్రాంతం. నిత్యం వేలాది మంది ప్రయాణాలు సాగించే వ్యాపార కూడలి. అక్కడ అడుగు స్థలం ధర రూ.వేలలో పలుకుతోంది. అంతటి విలువైన ప్రాంతంలో మార్కాపురం పట్టణానికి చెందిన వైసీపీ సానుభూతిపరుడైన ఓ వ్యాపారవేత్తకు పలు వ్యాపారాలు ఉన్నాయి. డివిజన్ మొత్తం మీద భూఅక్రమాల్లో ఆరితేరిన వ్యక్తి ఆయన. తాజాగా ఆయనకు సంబంధించిన ఓ పెట్రోల్ బంకు పక్కన రూ.10 కోట్లకుపైగానే విలువైన వాగు భూమిపై కన్నేశాడు. అనుకున్నదే తడవుగా ప్రస్తుతం బడ్డీ బంకులు ఏర్పాటు చేయించాడు. వాటి మాటున ఆక్రమణ పర్వానికి తెరలేపాడు. ఈ విషయాన్ని గుర్తించి కొందరు చుట్టుపక్కల గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణలను తొలగించి వాగు భూమిని పరిరక్షించాలని కోరారు. అయితే ఆర్థికంగా ఎంతో బలవంతుడైన ఆ వ్యాపారవేత్త వ్యవహారంలో వేలుపెట్టేందుకు రెవెన్యూ యంత్రాంగం కూడా వెనుకాడుతోంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగిన భూఆక్రమణదారుల భరతంపట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రస్తుతం గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. అయితే వైసీపీ సానుభూతిపరుడైన ఆ వ్యాపారవేత్త అక్రమాలపై మాత్రం యంత్రాంగం చర్యలు తీసుకునేందుకు మీనమేషాలు లెక్కిస్తోంది.

బంకుల మాటున ఆక్రమణలు

పెద్దారవీడు మండలంలోని హనుమాన్ జంక్షన్ కుంట ప్రాంతం వ్యాపార కూడలిగా ఉంది. పేరుకు ఓ గ్రామంలాంటిదే అయినా కుంట చుట్టూ ఉండే ఓబులక్కపల్లి, తోకపల్లి, బోడిరెడ్డిపల్లి రెవెన్యూ గ్రామాల భూములున్నాయి. చుట్టూ సుమారు 15 గ్రామాల నుంచి రైతులు, సామాన్య ప్రజలు వివిధ అవసరాలపై ఆ కూడలికి

మిగతా 6వ పేజీలో



ఒంగోలు పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన పరుగు పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

అలుపులేని పరుగు.. గెలుపుచేరే వరకు..

- కానిస్టేబుళ్ల ఎంపికకు 235 మంది హాజరు
- డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా
- ప్రక్రియను ప్రారంభించిన ఎస్పీ దామోదర్

7



నాకు పుట్టలేదు... నిన్నెట్టా బతకనిస్తా..

- తొమ్మిది నెలల చిన్నారి నోట్లో యాసిడ్ పోసిన తండ్రి
- చావుబతుకుల మధ్య పాప
- పరిస్థితి విషమం.. గుంటూరుకు తరలింపు

వివరాలు మెయిన్‌లో..

వృద్ధురాళ్లే టార్గెట్



కమ్మపాలెంలో బాధిత వృద్ధురాలిని విచారిస్తున్న పోలీసులు (ఫైల్)

- ఒంటరిగా ఉన్న వారికి మత్తు ఇచ్చి దోపిడీకి పాల్పడుతున్న దొంగలు
- వరుస ఘటనలతో ఆందోళన
- తాజాగా సమతానగర్‌లో మరో ఉదంతం

ఒంగోలు (క్రైం), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాళ్లే లక్ష్యంగా దోపిడీల పరంపర కొనసాగుతోంది. ఇద్దరు వృద్ధులు దొంగల చేతిలో హత్యకు గురికాగా, మరో ఇద్దరు చావు అంచుల వరకూ వెళ్లి బయటపడ్డారు. ఇలాంటి వరుస ఘటనలతో జిల్లా ప్రజానీకం ఆందోళనకు గురవుతోంది. ఎనిమిది నెలల వ్యవధిలో జిల్లాలో చోటుచేసుకున్న ఘటనలు మిస్టరీగా మిగిలాయి. ముఖ్యంగా ఒంగోలుతోపాటు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న ఈ తరహా దోపిడీలు పోలీసులకు సవాల్‌గా మారాయి. ఎలాంటి క్లూ దొరక్కపోవడంతో

మిగతా 6వ పేజీలో



చవటపాలెం గ్రామం వ్యూ

7

దటీజ్ చవటపాలెం

- గ్రామ జనాభా వెయ్యి మంది
- దురలవాట్లకు అందరూ దూరం
- పూర్వం నుంచీ ఇదే సంప్రదాయం
- పెద్దల ఆదర్శాన్ని పాటిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్న నేటి తరం

పొగ తాగరు.. మద్యం ముట్టరు.. జూదం జోలికెళ్లరు

భలే మార్పు

(5వ పేజీ తరువాయి)

కూడా కలిసొచ్చింది. కానీ జగన్ చేసిన పొరపాటో, మాగుంట అదృష్టమో గాని వైసీపీ టికెట్ నిరాకరణతో ఆయన టీడీపీలో చేరారు. కూటమి పార్టీల వేవ్‌లో రెండున్నర దశాబ్దాల అనంతరం టీడీపీ తరఫున ఆయన గెలవడం విశేషం.

బాలినేని, కరణం, ఆదిమూలపులకు కలిసిరాలేదు

బాలినేని, కరణం, ఆదిమూలంకు కలిసిరాని కాలంగా చెప్పవచ్చు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు మంత్రిగా పనిచేసిన ఆదిమూలపు సురేష్‌కు శాసనసభకు ఎన్నికయ్యే అవకాశం కూడా దక్కలేదు. వివిధ రకాలుగా ఆయా సందర్భాల్లో జిల్లా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన మాజీ మంత్రి బాలినేని ఈ ఏడాది ఆరంభానికి ఎమ్మెల్యేలుగా ఉన్న కరణం బలరాంలు మాజీలయ్యారు. మాజీ మంత్రి మహీదర్‌రెడ్డికి తాను అంటిపెట్టుకున్న వైసీపీలో పోటీచేసే అవకాశమే దక్కలేదు. గతంలో రాష్ట్రంలో రెండో ఘనవిజయం సాధించిన అన్నా రాంబాబుకు చేదు అనుభవం ఎదురైంది. ఎక్కడ నుంచో వచ్చి ఒంగోలు లోక్‌సభకు పోటీచేసిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి పరాజయం పాలయ్యారు. అనూహ్యంగా టికెట్ దక్కించుకున్న చంద్రశేఖర్‌కు ఎర్రగొండపాలెం ఎమ్మెల్యేగా గెలుపొందటం అదృష్టమే. గతంలో పలు చేదు అనుభవాలను ఎదుర్కొన్న ఎంఎం కొండయ్య యాదవ్ చీరాల ఎమ్మెల్యే అయ్యారు. చివర్లో టికెట్ దక్కించుకున్న ఇంటూరు నాగేశ్వరరావు కందుకూరు నుంచి ఎమ్మెల్యే కాగలిగారు. క్లిష్టమైన నియోజకవర్గంలో అదృష్టాన్ని పరీక్షించుకున్న యువనాయకులు ఎరిక్షన్‌బాబు, కుటుంబ నేపథ్యంతో రంగంలోకి వచ్చిన గొట్టిపాటి లక్ష్మిలకు అదృష్టం కలిసికాక ఓటమిపాలయ్యారు.

అస్తమించిన పార్వతమ్మ

జిల్లాలో ప్రత్యేకించి ఒంగోలు లోక్‌సభలో తమదైన ముద్ర వేసుకున్న మాగుంట కుటుంబ తొలి వారసురాలు దివంగత ఎంపీ సుబ్బరామరెడ్డి సతీమణి పార్వతమ్మ ఈఏడాదిలోనే అస్తమించారు.

వాగు భూమి హాంఫట్!

(5వ పేజీ తరువాయి)



వాగు ఆక్రమణపై రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

వస్తుంటారు. అక్కడ గొర్రెల మండి, ఫెస్టిసైడ్ దుకాణాలు, హోటళ్లు, లాడ్జీలు ఇలా మండల కేంద్రంకంటే ఎక్కువ ఆదాయం కుంటలోనే ఉంటుంది. అంతేకాక కుంట పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం ఎకరం భూమి రూ.20 కోట్లకు పైనే పలుకుతోంది. మార్కాపురం పట్టణం తర్వాత అంతటిస్థాయిలో భూముల విలువలు ఉన్నది కుంటలోనే. ఇక్కడ ఎర్రగొండపాలెం, దోర్నాల, మార్కాపురానికి చెందిన చాలామంది వ్యాపారులు భూములు కొని వ్యాపారాలు చేస్తున్నారు. కుంట గ్రామం మధ్యలో నుంచే అనంతపురం- అమరావతి 544(ఎఫ్) జాతీయ రహదారి వెళ్తోంది. ఆ రహదారికి ఆనుకుని ఉన్న భూముల విలువ ప్రస్తుతం గజం రూ.లక్షల్లో ఉంది. ఇంతటి విలువైన ప్రాంతంలో జాతీయ రహదారికి ఆనుకుని పట్టణానికి చెందిన ఓ వ్యాపారవేత్తకు పెట్రోల్ బంకు ఉంది. దాని పక్కనే ఓబులక్కపల్లె రెవెన్యూ గ్రామ ఇలాకాకు చెందిన సర్వే నెంబర్ 37/4లో 1.48 ఎకరాల వాగు భూమి ఉంది. ఆ భూమిపై కన్నేసిన వ్యాపారవేత్త ముందుగా బంకుల మాటున ఆక్రమణలకు తెరలేపాడు. రహదారి వెంట బంకులు నిర్మించి రూ.వేలల్లో అద్దెలకు ఇస్తున్నాడు. ప్రస్తుతం 8 వరకు బంకులు ఏర్పాటయ్యాయి. మరో 5 బంకులు ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యాడు. బంకులతోపాటు వెనుకవైపువున్న వాగుభూమిని సుమారు అర ఎకరం మేర చదును చేశాడు. ఇంతా జరుగుతున్నా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటంలేదు.

ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

హనుమాన్ జంక్షన్ కుంటలో జరుగుతున్న వాగు భూమి ఆక్రమణ విషయాన్ని బోడిరెడ్డిపల్లికి చెందిన కొందరు తోకపల్లె రెవెన్యూ సదస్సులో అధికారులకు వారంరోజుల క్రితం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గ్రామసభ ముగిసిన వెంటనే సాయంత్రం తహసీల్దార్ శైలేంద్రకుమార్, సర్వేయర్ గోపాల్‌రెడ్డిలు వాగుభూమి వద్దకు వెళ్లి పరిశీలించారు. అది వాగు భూమిగా సర్వేయర్ నిర్ధారించారు. వెంటనే ఆక్రమంగా ఏర్పాటు చేసిన బంకులు తొలగిస్తామని ఫిర్యాదుదారులకు హామీ ఇచ్చారు. ఏమైందో ఏమో ఇప్పటి వరకు రెవెన్యూ సిబ్బంది ఎవరూ అక్కడకు వెళ్లిన దాఖలాలులేవు. డివిజన్‌లోని మిగిలిన మండలాల్లో రెవెన్యూ సదస్సుల్లో అందే ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటున్నారు. ఒకవైపు వైసీపీకి చెందిన వ్యాపారవేత్త ఆక్రమణకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందినా ఆక్రమణల తొలగింపునకు అధికారులు మొగ్గు చూపడం లేదు. దీని ఆంతర్యమేమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. పెద్దమొత్తంలో వ్యాపారవేత్త నుంచి ముడుపులు అందడంతోనే ఆగిపోయారా..? ఎవరైనా అధికార పార్టీ నాయకుడు ఒత్తిడి చేశారా..? అని కుంట చుట్టుపక్కల గ్రామాల ప్రజల్లో చర్చ నడుస్తోంది.

ఎర్రజెండా ఎగిరేది ప్రజా సమస్యల పరిష్కారం కోసమే

● ప్రభుత్వాలు మారుతున్నా పేదల బతుకులు మారడంలేదు ● సీపీఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభలో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

చీరాలటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఎర్రజెండా ఎగురుతూనే ఉంటోందని, ప్రభుత్వాలు మారుతున్నా పేదల బతుకులు మారడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చెప్పారు. సోమవారం చీరాల పట్టణంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభ బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల శామ్యేల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ పదేళ్లుగా అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం పేదరికం, నిరుద్యోగ సమస్య పరిష్కారంవైపు కన్నెత్తి చూడలేదని ఆరోపించారు. రైతన్నలు కూడా సమస్యలతో కుమిలిపోతూ ఆవేదన చెందుతున్నట్లు చెప్పారు. బాలికలు, స్త్రీలపై దాడులు పేట్రేగిపోతున్నట్లు పేర్కొన్నారు. దేశమంతా పర్యటిస్తున్న ప్రధాని మోదీకు మణిపూర్ గోడు కానరాలేదా అని ప్రశ్నించారు. సాక్షాత్తు పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానిస్తే అధికార పార్టీ లేక ప్రతిపక్ష నేతలు ఎవరూ కూడా పన్నెత్తి మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. జగన్ పాపాలు శాపాలుగా మారి స్మార్ట్ మీటర్లు ఏర్పడినట్లు చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. వెంటనే స్మార్ట్ మీటర్లు నిరోధించాలని డిమాండ్ చేశారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను పరిష్కరించాలని కోరారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ జనవరి 2 నుంచి 10వ తేదీ వరకు అర్జీలు స్వీకరించి



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నట్లు చెప్పారు. స్థానిక వైద్యులు గుంటుపల్లి సుబ్బారావు మాట్లాడుతూ శ్రామికుల శ్రమను గుర్తించిన పార్టీ సీపీఐ అని చెప్పారు. ఇటీవల జాతీయస్థాయిలో అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన అడిగోపుల సాంబశివరావును సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెంకట సుబ్బయ్య, జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, మేడా వెంకటరావు, ఊటుకూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

30 శాతం రక్తం ప్రభుత్వానికి ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రైవేటు బ్లడ్ బ్యాంక్‌లు శిబిరాలు నిర్వహించిన సమయంలో వచ్చే బ్లడ్‌లో 30శాతం తప్పని సరిగా ప్రభుత్వానికి అప్పగించాల్సిందేనని జిల్లావైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో చాంబర్‌లో సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు బ్లడ్ బ్యాంకు వైద్యాధికారులు, ల్యాబ్ టెక్నీషియన్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు బ్లడ్ బ్యాంకు క్యాంపులు ఎక్కువగా నిర్వహించి రక్తనిల్వలు పెంచే విధంగా చూడాలన్నారు. ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు నెలవారీగా నిర్వహించే క్యాంపు తేదీలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి తప్పని సరిగా తెలియజేయాలన్నారు. ఇకనుంచి ప్రతినెలా ప్రభుత్వ, ప్రైవేటు బ్లడ్ బ్యాంకుల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. రక్తదానం చేసేవారి పూర్తి చిరునామా, మొబైల్ నెంబరును కూడా తీసుకోవాలని ఆదేశించారు. ప్రైవేటు బ్లడ్ బ్యాంకు క్యాంపులు నిర్వహించే ప్రదేశాలలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కార్యాలయం నుంచి అధికారి వచ్చి పర్యవేక్షిస్తారన్నారు.

సాగర్ నీటిని పొదుపుగా వినియోగించాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సాగర్ కుడికాలువ ద్వారా వచ్చే నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని లింగంగుంట పర్యవేక్షక ఇంజనీర్ కృష్ణమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. నాగార్జున సాగర్ ఈ ఏడాది నిండటంతో కాలువ కింద ఆయకట్టుకు సరిపడా నీటిని విడుదల చేశామన్నారు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి నీటిని సరఫరా చేస్తున్నామని, కృష్ణానది యాజమాన్యబోర్డు కుడికాలువకు 132 టీఎంసీల నీటిని కేటాయించగా ఇప్పటికే అధికంగా వినియోగించామన్నారు. కేవలం ఐదోవంతు నీరు మాత్రమే వాటా నీరు ఉందన్నారు. ఈ నీటిని వచ్చే ఏడాది మే వరకు సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. నాగార్జున సాగర్‌లో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టినందున నీటిని వృథాచేయకుండా రైతులు తగు జాగ్రత్తలతో వినియోగించుకోవాలన్నారు. రానున్నవేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందుగానే అవసరం మేరకు నీటిని నిల్వ చేసుకోవాలని ఆయన కోరారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ఒంగోలు(క్రైం), డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): మద్యం తాగించి వ్యక్తిని హత్య చేసి అతని వద్ద ఉన్న బంగారం ఆభరణాలను అపహరించుకెళ్ళిన కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయాధికారి డి.రాములు జీవిత ఖైదు తోపాటు రూ. 6,000 లు జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు. సోమవారం స్థానిక సెషన్స్ కోర్టులో న్యాయాధికారి ఈ మేరకు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెంనకు చెందిన కొక్కిలగడ్డ పిచ్చయ్యను 2022 జనవరి 14 న అదే గ్రామానికి చెందిన కోటిలింగం తన వెంట ఆటోలో తీసుకెళ్లాడు. ఈతముక్కల పొలాల్లో పేరంటాళ్లకుంట వద్ద పూటుగా మద్యం తాగించి పిచ్చయ్య తలపై కోటిలింగం మద్యం సీసాతో కొట్టాడు. అనంతరం పిచ్చయ్య మొలతాడు తెంపి గొంతుకు బిగించి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశాడు. అతని వద్ద ఉన్న బంగారం ఆభరణాలు తీసుకొని పరారయ్యాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కొత్తపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును దర్యాప్తు చేసిన సీఐ రాఘవరావు అభియోగ పత్రం కోర్టులో దాఖలు చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రశాంత కుమారి ప్రాసిక్యూషన్ తరుపున వాదనలు వినిపించారు. నిందితుడు కోటిలింగంపై నేరం రుజువు కావడంతో న్యాయాధికారి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు నిచ్చారు. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసిన అప్పటి కొత్తపట్నం ఎస్సై ఫాతిమా ఫిరోజ్,సీఐలు ఎన్. రాఘవరావు , మేడా శ్రీనివాసరావు , ప్రస్తుత ఎస్సై వేముల సుధాకర్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ప్రతిఒక్కరికీ ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

● 6వ అదనపు జిల్లా న్యాయాధికారి శుభవాణి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న న్యాయాధికారి శుభవాణి

మార్కాపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధపెట్టాలని జిల్లా 6వ అదనపు న్యాయాధికారి ఎం.శుభవాణి అన్నారు. మార్కాపురంలోని న్యాయస్థానం కూడలిలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలుకు చెందిన స్మార్ట్ విజన్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులకు కళ్లు, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న న్యాయాధికారి శుభవాణి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చేతుల మీదుగా న్యాయవాదులకు డైరీలు, క్యాలెండర్‌లు అందజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తి బి.దేవేంద్రరెడ్డి, జె.కిషోర్‌కుమార్, ఎమ్.బాలాజీ, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూపని కాశయ్య, వై.అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులు ఉమ్మడి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

వృద్ధురాళ్లే టార్గెట్

(5వ పేజీ తరువాయి)

పోలీసులు తలలు పట్టుకున్నారు. ఒంటరిగా జీవిస్తున్న పండుటాకులు, కన్నబిడ్డలకు సైతం దూరంగా ఉంటున్న వారిని దొంగలు టార్గెట్ చేస్తున్నారు. వృద్ధులకు మత్తుమందు ఇచ్చి వారి వద్ద ఉన్న బంగారు ఆభరాణాలు అపహరించుకెళుతున్నారు. అనుమానం వస్తే దాడులకు పాల్పడుతున్నారు. అదేసమయంలో వృద్ధులు మత్తుమందు ఘాటుకు తట్టుకోలేక మృత్యవాతపడుతున్నారు. పదిరోజుల క్రితం ఒంగోలులోని సమతానగర్‌లో జరిగిన దోపిడీ ఘటనతో మహిళలే ఈ పనికి పాల్పడుతున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఇటీవల జరిగిన వరుస ఘటనలు...

ఒంగోలు అంబేడ్కర్ భవన్ సమీపంలో నివాసముంటున్న తిరుమలశెట్టి పార్వతమ్మ ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. మే 24న ఆమె శరీరంపై పెద్దగా గాయాలు ఏమి లేవు. మామిడికాయ తింటూ ఇంట్లో మృతిచెందింది. ఆమె వద్ద ఉన్న బంగారం ఆభరాణాలు దోపిడీ దొంగలు అపహరించుకెళ్లారు. అదేసమయంలో ఇంట్లో ఉన్న బీరువాను పెకలించారు. దీంతో ఇరుగుపొరుగు వారు గుర్తించి ఆసుపత్రిలో చేర్చగా ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది.

అదే తరహాలో జూన్ 18న ఒంగోలు రూరల్ మండలం ఉలిచిలో ఓ వృద్ధురాలు రాత్రివేళ వరండాలో నిద్రిస్తుండగా దొంగలు మత్తు మందును ఇచ్చి ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు అపహరించుకు వెళ్లారు. తెల్లవారిన తర్వాత చుట్టుపక్కల వారు వచ్చి చూస్తే అప్పటికే వృద్ధురాలు మృతిచెంది ఉంది.

కొత్తపట్నం మండలం మడనూరులో జూన్ 26న పట్టపగలు ఆళ్ల కృష్ణవేణమ్మ అనే వృద్ధురాలు ఇంట్లో ఒంటరిగా ఉండగా గుర్తుతెలియని మహిళ ఇంట్లో ఉన్న నిమ్మచెట్టు కాయలు కావాలని వచ్చింది. అక్కడ ఏమి జరిగిందో గాని కొద్దిసేపటికి వృద్ధురాలు స్పృహ కోల్పోయింది. ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. అక్కడ కూడా ఒంగోలు అంబేడ్కర్ భవనం వద్ద జరిగినట్లు బీరువా పగలకొట్టి ఉంది. అయితే కృష్ణవేణమ్మను ఆమె బంధువులు గుర్తించి ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం కోలుకుంది.

ఒంగోలులోని కమ్మపాలెంలో పొన్నం సీతారావమ్మ (80) అనే ఒంటరి మహిళ రాత్రి సమయంలో బాత్‌రూంకు వెళ్లింది. ఆ సమయంలో ఇద్దరు దొంగలు ఇంట్లోకి ప్రవేశించారు. ఆమె లోపలికి వచ్చిన తర్వాత దాడి చేశారు. ఇంట్లో ఉన్న రూ.లక్ష నగదు, ఆమె వంటిపై ఉన్న బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. అనంతరం సీతారావమ్మ ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకొని ఇంటికి వచ్చింది. రెండు రోజుల అనంతరం మృతి చెందింది. ఈ ఘటన సెప్టెంబరు 25న చోటుచేసుకుంది.

వృద్ధురాలికి మత్తు మందు ఇచ్చి దోపిడీ

తాజాగా పదిరోజుల క్రితం ఒంగోలులో మరో ఘటన చోటుచేసుకుంది. ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చిన ఓ మహిళ.. వృద్ధురాలికి మత్తు మందు ఇచ్చి ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దోచుకెళ్లింది. స్థానిక సమతానగర్‌లో వృద్ధురాలు(65) నివాసం ఉంటుంది. ఆమెకు ఇద్దరు సంతానం. ఆమె ఒక్కరే ఇంట్లో ఉంటుంది. ఇంట్లో మొదటి అంతస్థు ఖాళీగా ఉంది. ఈనెల 19వతేదీన ఓ మహిళ ఇల్లు అద్దెకు కావాలని వృద్ధురాలితో అడిగింది. ఆమె ఒంటరిగా ఉండటం గమనించింది. ఇల్లు చూసుకున్న తరువాత రేపు వస్తానని చెప్పి వెళ్లింది. మరుసటి రోజు తిరిగి వచ్చిన ఆ మహిళ, వృద్ధురాలితో మాటలు కలిపింది. ఆమెకు వేరుశనగ ముద్ద ఇచ్చి తినాలని చెప్పింది. తరువాత కొద్దిసేపటికి వృద్ధురాలు మత్తులోకి జారుకుంది. దీంతో ఆమె వద్ద ఉన్న ఆరు సవర్ల ఆభరణాలు తీసుకుని ఉడాయించింది.

ఆ మహిళ ఎవరు?

మడనూరులో కృష్ణవేణమ్మ ఇంటికి వచ్చిన గుర్తుతెలియని మహిళ ఎవరు అనేది ఇంతవరకు గుర్తించలేకపోయారు. దీనిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిమ్మకాయలు కావాలి అని వచ్చిన మహిళ వృద్ధురాలు స్పృహకోల్పోయిన తర్వాత ఆభరణాలు, నగదు కోసం బీరువా పగలకొట్టిందా అనేది అంతు చిక్కడం లేదు. మహిళతోపాటుగా ఇంకా ఎవరైనా ఉన్నారా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది. కాగా అదే తరహాలో ఒంగోలు సుజాతానగర్‌లోనూ దోపిడీ జరిగింది. ఇందులోనూ మహిళే వచ్చినట్లు వృద్ధురాలు చెబుతున్నారు. మడనూరు కేసులో మాత్రమే కొద్దిపాటి క్లూ పోలీసులకు దొరికింది. ఇలా వరస ఘటనలకు కారణం ఒకే ముఠానా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

3న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

ఒంగోలు విద్య, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయిసైన్స్ ఎగ్జిబిషన్ వచ్చేనెల 3వ తేదీన స్థానికమంగమూరు రోడ్డులోని ఒంగోలు పబ్లిక్ స్కూలులో జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలోతెలిపారు. పాఠశాల స్థాయిలో, మండల స్థాయిలో మంచి ప్రాజెక్టులు తయారు చేసి పాల్గొనాలన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన ప్రాజెక్టులు తప్పని సరిగా జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనాలని తెలిపారు. ప్రతి మండలం నుంచి ఉత్తమమైన మూడు ప్రాజెక్టులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. జిల్లా నుంచి ఆరు గ్రూపు ప్రాజెక్టులు, రెండు వ్యక్తిగత ప్రాజెక్టులు, రెండు టీచర్ ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తామన్నారు.

నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్పీ

ఒంగోలు(క్రైం), డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం రాత్రి ఒంగోలు నగరంతోపాటుగా జిల్లాలోని ముఖ్యమైన పట్నాలు, మండల కేంద్రాలలో మద్యం సేవించి యువకులు రోడ్లపై వాహనచోదన చేయడం నిషేధం అన్నారు. అలాంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీజేలు, లౌడ్ స్పీకర్లు పెట్టి ప్రజల శాంతికి భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. వైన్‌షాపులు, బార్లు, రెస్టారెంట్లు దాబాలు నిర్ధేశిత సమయంలో మూసివేయాలని ఆదేశించారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థి

ఒంగోలు విద్య, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కాకినాడలో జరిగిన ఇన్విటేషన్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో క్విస్‌హైస్కూలు విద్యార్థి సత్తాచాటాడు. ఆరవ తరగతి చదువుతున్న కిడయాల జయంత్ బంగారు పతకాన్ని సాధించాడు. కరాటేలోని కుమిటే విభాగంలో 1,350 మంది విద్యార్థులు పాల్గొనగా పలు రౌండ్లు దాటుకొని మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో క్విస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. సూర్యకళ్యాణ చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్. శ్రీగాయత్రిలు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుపరంగానే కాకుండా క్రీడల్లోనే రాణించాలన్నారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి తోడ్పతాయన్నారు. ఈసందర్భంగా జయంత్‌బాబును అభినందించారు.


చవటపాలెం గ్రామ వ్యూ

కేరాఫ్ చవటపాలెం

ఇక్కడ పొగ తాగరు.. మద్యం ముట్టరు.. జూదం జోలికెళ్లరు

నలుగురు యువకులు కలిశారంటే పిచ్చాపాటీగా మాట్లాడుకుంటూ సిగరెట్ తాగడాన్ని మనం సహజంగా చూస్తుంటాం.

రోజంతా కూలిపనికో, పొలం పనికో వెళ్లి వచ్చినవారు రాత్రికి కాస్త మందు తాగి పడుకుంటే నొప్పులు తెలియకుండా ఉండటానికి కాబోలు అని కుటుంబ సభ్యులు కూడా సర్దుకుపోతుంటారు.

పేకాటో, కోడి పందెమో ఆడేవాళ్లను చూసి, మిగిలిన సమయంలో కష్టపడి పనిచేస్తాడు కదా మనశ్శాంతి కోసం ఆడుతున్నాడేమోలే అని చాలా మంది సరిపెట్టుకుపోతుంటారు.

సమాజంలో ఇప్పుడు జరుగుతున్నదిదే. వ్యసనాన్ని కూడా సహజమే అన్నట్టు చూస్తున్న కాలమిది. మానవ జీవనప్రక్రియలో చెడు అలవాట్లు కూడా ఒక భాగమైన తరుణమిది. ఈ కాలంలోనూ వీటిని తప్పుగా భావించే సమూహం ఉంటే.. సిగరెట్ ముట్టని మనుషులు ఉంటే.. మందు రుచి చూడని ప్రాంతం ఉంటే.. జూదం జోలికెళ్లని పల్లె ఉంటే.. ఊహించుకోవడానికే అద్భుతంగా ఉంది కదూ! దీన్ని ఆచరించి చూపుతున్న ఆదర్శ గ్రామం ఒకటుంది. అదే కొండపి మండలంలోని పెట్లూరు గ్రామ పంచాయతీ శివారునున్న చవటపాలెం.


గ్రామంలోని రామాలయం

గ్రామం చిన్నది... ఆదర్శం పెద్దది

చవటపాలెంలో మొత్తం దాదాపు వెయ్యి మంది ఉంటారు. అందరూ వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. అంతా చిన్న, సన్నకారు రైతులే. గ్రామంలోని యువకులు సాఫ్ట్‌వేర్, ఇతర ప్రైవేటు ఉద్యోగాలు చేస్తుంటారు. వారు ఉద్యోగ రీత్యా ఇతర నగరాల్లో ఉన్నా, తమ పెద్దలు నడిపించిన దారిలోనే సాగుతున్నారు. వారు కూడా వ్యసనాలకు దూరంగా ఉంటున్నారు. గ్రామంలోని మగవారు కోడిపందేలు, జూదం అనేవాటికి చాలా దూరంగా ఉంటున్నారు. అందరూ ఐక్యంగా గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేసుకొన్నారు. రామాలయం నిర్మించుకున్నారు. రాముడి ఆదర్శాలను కొనసాగిస్తున్నారు.

- గ్రామ జనాభా వెయ్యి మంది
- దురలవాట్లకు అందరూ దూరమే
- ఊళ్లో నాలుగు బడ్డీ బంకులు
- వాటిలో సిగరెట్లు, మందు అమ్మరు
- పొరుగూరు నుంచి వచ్చే పచ్చాకు కూలీల కోసం ఆ సీజన్‌లో బీడీల అమ్మకం
- పూర్వం నుంచి ఇదే సంప్రదాయం
- పెద్దల ఆదర్శాన్ని పాటిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్న నేటి తరం

ఆ ఊళ్లో కట్టుబాట్లు ఏమీ లేవు. నియమ నిబంధనలూ లేవు. వెసనపరులకు జరిమానాలూ విధించరు. అయినా ఆ గ్రామస్థులు దురలవాట్లకు దూరంగా ఉండటాన్ని, ఎవరికివారే ఒక నియమంగా పాటిస్తున్నారు. ఊళ్లో ఎవరూ మద్యం తాగరు. చుట్టలు, సిగరెట్లు, బీడీలు కాల్చరు. పేకాట, కోడిపందేలు లాంటి వ్యసనాల జోలికి అస్సలు వెళ్లరు. గ్రామంలో పూర్వీకులు కూడా వీటికి దూరంగా ఉండటంతో క్రమంగా రెండో తరం వారికీ, ఇప్పటి యువతరానికీ అవే ఆదర్శాలు అలవడ్డాయి. గ్రామంలో గతంలో సిగరెట్లు, మద్యం తాగేవారు నలుగురైదుగురున్నా క్రమంగా వారు కూడా వ్యసనాలను వదిలేశారు. ఎలా సాధ్యమైంది అని గ్రామస్థులను అడిగితే పూర్వీకులకు వ్యసనాలు లేవు. క్రమంగా అదే అలవాటు మిగిలిన తరాలకు అలవాటు అయ్యిందని చెబుతున్నారు. ఇపుడు గ్రామంలో నాలుగు చిన్నపాటి బంకులు ఉన్నాయి. గ్రామంలో రెండు, ఎస్సీ కాలనీలో రెండు ఉన్నాయి. వారు టీ, తినుబండారాలు అమ్ముతున్నారు. గ్రామంలో బంకు నిర్వహించే మహిళ దివ్యాంగురాలు. వీటిల్లోనూ ఎక్కడా మద్యం, సిగరెట్లు అమ్మడం లేదు. కారణం కొనేవారు గ్రామంలో లేకపోవడమేనట.

- కొండపి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి)

ఎస్సీ, బీసీ కాలనీల్లో కూడా...

గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీలు ఉన్నాయి. వారు కూడా వ్యసనాలకు దూరంగా ఉంటున్నారు. పొలం పనులు, ఇతర చేతి వృత్తులు చేసుకుంటున్నారు. ఖాళీ సమయాల్లో ఇతరత్రా వ్యాపారాలు చేసుకుంటామే కాని చెడు వ్యసనాల జోలికి వెళ్లబోమని ఎస్సీ కాలనీవాసులు చెబుతున్నారు. గ్రామంలోని రైతులు కూడా తమకు అండగా ఉంటారని, ఆపదకాలంలో ఆదుకుంటుంటారని, ఆర్థిక అసరాలకు చేదోడు, వాదోడుగా ఉంటారని, తమ పట్ల ఎంతో గౌరవంగానే ఉంటారని చెప్పడం ఆ ఊరి ఆదర్శానికి అద్దం పడుతోంది.

మాకు ఎంతో గర్వంగా ఉంది

నాకు 65 ఏళ్లు. మా ముందు తరంలో మద్యం, సిగరెట్ల తాగే అలవాటు ఎవరికీ లేదు. అప్పట్లో ఎవరన్నా సిగరెట్లు తాగితే వారికి నలుగురిలో గౌరవం ఉండేది కాదు. చిన్నతనంగా భావించేవారు. దీంతో ఒకరిద్దరు తాగేవారు కూడా వాటికి దూరం అయ్యారు. ఎవరూ కోడిపందేలు, పేకాటల జోలికెళ్లరు. అదే అలవాటు మా తరువాత తరానికి కూడా వచ్చింది. ఎస్సీ, బీసీ కాలనీల్లో కూడా ఇదే అలవాటు. ఇది మాకు ఎంతో గర్వంగా ఉంది.

- వేముల వెంకటేశ్వర్లు



పొరుగూరు కూలీల కోసమే..

ఇంటి వద్దనే చిన్నపాటి బంకు నిర్వహిస్తున్నాను. చిన్న పిల్లలు తినే తినుబండారాలు, టీ అమ్ముతాను. ఈ సీజన్‌లో పొరుగూరు నుంచి వచ్చే పచ్చాకు కూలీల కోసం బీడీలు, ఒక బ్రాండ్ సిగరెట్లు మాత్రమే అమ్ముతాను. ఈ సీజన్‌లో మాత్రమేతక్కువగా తెచ్చుకుంటాను. మిగతా కాలంలో కొనుగోలు చేసేవారు లేక తేవడం లేదు.

- చేరెడ్డి శోభారాణి, చిరు వ్యాపారి



తినుబండారాలే అమ్ముతాను

నేను బడ్డీకొట్టు నిర్వహిస్తున్నాను. టీ, చాక్లెట్లు, బిస్కెట్లు, ఇతర చిన్నారులకు అవసరమైన చిరుతిండ్లు విక్రయిస్తుంటాను. మా ఊళ్లో మద్యం తాగేవారు లేరు. సిగరెట్లు, బీడీలు, చుట్టలు తాగేవారు లేరు. పండుగలకు, ఇతర సందర్భాల్లో యువకులు గ్రామానికి వచ్చినా, వీటి జోలికెళ్లరు.

- వి.కల్యాణి



కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుపై కృతనిశ్చయంతో ఉన్నా

- ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
- సభలో చర్చించిన సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి
- సర్పంచ్‌లు తాగునీటిపై ప్రత్యేకదృష్టి పెట్టాలి
- రూ. 3 కోట్లతో అభివృద్ధి పనులు

కొమరోలు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొమరోలు మండలంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలనే కృతనిశ్చయంతో ఉన్నానని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కొమరోలు మండలంలోని కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు గతంలోనే రాష్ట్ర క్యాబినేట్ తీర్మానించిందన్నారు. మండలంలో 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొమరోలు ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కొమరోలు మండలానికి రూ.2.5కోట్లతో సిమెంట్ రోడ్లు వేయగా, మరోసారి ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.53లక్షలను మంజూరు చేసి కొమరోలు మండల అభివృద్ధికి కేటాయించిన ఘనత ఎన్‌డీఏ ప్రభుత్వాని దేన్నారు. మండలంలోని సర్పంచులు కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను అత్యవసరానికి మాత్రమే వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను మరలా జరిగే సమావేశం నాటికి పరిష్కరించాలన్నారు. ప్రతి సమస్యను తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో మస్తాన్‌వలిని ఆదేశించారు. కొమరోలు పట్టణంలోని శివాజీనగర్‌లోని ఓవర్‌హెడ్ ట్యాంకుమెట్లును ఎంపీపీ నిధులతో ఏర్పాటుచేయమని చెప్పినా అధికారులు పట్టించుకోవటంలేదని ఎమ్మెల్యే



దృష్టికి ఎంపీపీ అమూల్య తెలిపారు. వెంటనే ఎమ్మెల్యే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి వారం రోజుల్లో సమస్యను పరిష్కరించి తనకు చెప్పాలన్నారు. వేసవి రానుందని జేజేఎం పనులకు వెంటనే టెండర్లు పిలిచి రూ.18.40కోట్లతో 137 తాగునీటి పనులు చేయాలన్నారు. కొమరోలు ప్రాథమిక వైద్యశాలను 30 పడకల వైద్యశాల చేయాలని అసెంబ్లీలో చర్చించామని, వైద్యశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గతంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కొమరోలులో అదనంగా రెండు రేషన్ దుకాణాలు కావాలని కలెక్టర్‌కు వివరించగా కొమరోలు పట్టణంలో ఉన్న రెండు రేషన్ దుకాణాలకు అదనంగా మరో రెండు రేషన్ దుకాణాలు మంజూరయ్యాయన్నారు. వాటిని జనవరిలో ప్రారంభిస్తామని తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. కొమరోలు మండలంలోని అన్ని వసతి గృహాలు అద్దెభవనాల్లో ఉన్నాయని వాటికి సొంత భవనాలు కావాలని ఎంపీపీ కోరగా వెంటనే ఎమ్మెల్యే అల్లీనగరం హైస్కూల్లో గదులు ఉన్నాయని వాటిని తాత్కాలికంగా అల్లీనగరం వసతి గృహాన్ని వెంటనే మార్చాలని ఎంఈవోను ఆదేశించారు.

పాకలలో ఫిష్ ఇన్ ల్యాండ్ సెంటర్లు

- పాలేరు, ముసి, రొంపేరులలో పూడిక తీత
- సిద్ధమవుతున్న ప్రతిపాదనలు
- మారిటైం బోర్డు సమావేశంలో చర్చ

కొండపి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ మండలం పాకలలో ఫిష్ ఇన్ ల్యాండ్ సెంటర్‌లు ఏర్పాటు కానున్నాయి. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. పాలేరు, ముసి, రొంపేరుల్లో పూడిక తీత పనులకు కూడా అధికారులు అంచనాలు తయారు చేస్తున్నారు. మంగళగిరిలో సోమవారం మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యన్నారాయణ అధ్యక్షత జరిగిన బోర్డు సమావేశంలో వీటితోపాలు వివిధ అంశాలపై చర్చించారు. పోర్టుల అభివృద్ధి, పెట్టుబడుల కోసం కొత్త ప్రాంతాలను అన్వేషించడంపై దాదాపు మూడు గంటలపాటు సమీక్షించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు ఛైర్మన్ సత్య పలు సూచనలు చేశారు. మోటుపల్లిలో నౌకాశ్రయం ఏర్పాటు, పెద్దగంజాంలో నౌకా నిర్మాణ పరిశ్రమ అభివృద్ధికి సాధ్యాసాధ్యాల నివేదికలను సిద్ధం చేయాలని నిర్ణయించారు. మారిటైం బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య, మారిటైం బోర్డు, పలు పోర్టుల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ సత్య, సీఈవో ప్రవీణ్ ఆదిత్య

2 నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

కొండపి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని వచ్చే నెల 2 నుంచి కొండపిలో నియోజకవర్గ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎన్ఆర్‌కే యూత్ అధ్యక్షుడు నేతి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయని తెలిపారు. విజేతగా నిలిచిన జట్టుకు రూ.50,000, రన్నర్‌కు రూ.30,000, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15,000 నగదు బహుమతి ఉంటుందన్నారు. వివరాలకు సెల్‌నంబర్లు : 84999 07863, 63047 71466, 80080 50734, 98661 70781ను సంప్రదించాలని సూచించారు.

సిగరెట్ తాగడానికెళ్లి మృతి



జీడిమెట్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు భవనం పై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. జీడిమెట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా, కొనకనమిట్ల మండలం, సిద్ధవరం గ్రామానికి చెందిన ఓరిగంటి చెంచురమణయ్య(45) జీడిమెట్ల ప్రాంతంలోని ఎస్ఆర్‌నాయక్‌నగర్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ఫ్యాబ్రికేషన్ పనిచేస్తున్న చెంచురమణయ్యకు సిగరెట్ తాగే అలవాటు ఉంది. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో సిగరెట్ తాగటానికి బయటకు వెళ్తున్నానని భార్య విజయలక్ష్మికి చెప్పి పెంట్‌హౌస్ పైకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు భవనం పై నుంచి జారి కిందడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామా చేయాలి

వామపక్ష నాయకుల డిమాండ్

ఒంగోలుకలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్‌ను దూషించిన కేంద్రహోంశాఖమంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలుచేసిన అమిత్‌షా తీరును ఎండగట్టారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన నిరసన కార్యక్రమానికి సీపీఐ, సీపీఎం నగర నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు, ఎం. రమేష్‌లు అధ్యక్షత వహించారు. ధర్నాలో సీపీఐ జిల్లాకార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చేస్తాం, పునఃసమీక్ష చేస్తామని బీజేపీ ఏదైతే చెప్పిందో అందులో భాగంగానే అంబేడ్కర్‌పై ఉద్దేశపూర్వకంగా అమిత్‌షా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు పాతర వేస్తుందని ఆరోపించారు. ఒక నియంతృత్వ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు జమిలి ఎన్నికల పేరుతో ఆర్ఎస్ఎస్ తీవ్ర ప్రయత్నం చేస్తున్నదన్నారు. అందులో భాగంగానే అంబేడ్కర్‌ను అవమానిస్తూ మత ఎజెండాను ముందుకు తీసుకువచ్చిందని విమర్శించారు. సీపీఐ ఎంఎల్ నాయకురాలు లలితకుమారి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్‌వంటి మనువాద పార్టీలు దేశంలో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమిత్‌షా ఆర్ఎస్ఎస్ మనస్తత్వానికి అనుగుణంగా అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు పాల్గొన్నారు.







అలుపులేని పరుగు గెలుపు చేరే వరకు!

- కానిస్టేబుళ్ల ఎంపికకు 235 మంది హాజరు
- డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా

'ఒకటే గమనం.. ఒకటే గమ్యం..' అంటూ ఓ చిత్రంలోని సాగిన పాటను గుర్తుచేసింది సోమవారం స్థానిక పోలీస్ పెరేడ్‌లో కనిపించిన సన్నివేశం. ఎలాగైనా కానిస్టేబుల్ పోస్టు కొట్టాలనే కసితో అభ్యర్థులు పోరాట పటిమ కనబరిచారు. దేహదారుఢ్య పరీక్షకు హాజరై తమ ప్రతిభను కనబరిచారు. కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియను ఎస్పీ ఏఆర్.దామోదర్ ప్రారంభించారు. అనంతరం 1600 మీటర్లు, 100 మీటర్లు పరుగు, లాంగ్ జంప్ ఈవెంట్స్ నిర్వహించారు. ప్రతి ఈవెంట్‌లోనూ అభ్యర్థుల్లో విజయ దాహం కనిపించింది. తొలుత ఎస్పీ మాట్లాడుతూ డ్రోన్ కెమెరాల నిఘాతో ఎంపిక జరుగుతుందన్నారు. మొదటి రోజు 600 మంది అభ్యర్థులకుగాను 235 మంది హాజరయ్యారని చెప్పారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన తరువాత, ఎత్తు, చాతి కొలతలు, కాళ్ల క్యూఆర్ కోడ్ తీసుకుంటారన్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు. - ఒంగోలు (క్రైం), ఆంధ్రజ్యోతి



అవీ..ఇవీ



డీఈవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు విద్య, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఉపాధ్యాయుల సామూహిక, వ్యక్తిగత సమస్యలను జనవరి 10లోపు పరిష్కరించాలని, లేనిపక్షంలో డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని ఏపీటీఎఫ్ నాయకులు హెచ్చరించారు. ఈమేరకు సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్‌నుకలిసి వినతిపత్రం అందజేశారు. 1996, 2002, 2014 డీఎస్సీలో ఎస్‌జీటీల అప్రూవ్డ్ సీనియారిటీ జాబితాలు , 2008 డీఎస్సీ లాంగ్వేజ్ పండిట్ సీనియారిటి జాబితా జిరాక్స్‌లు ఇవ్వాలన్నారు. అలాగే ఉపాధ్యాయుల వ్యక్తిగత సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో డీఈవోను కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్‌మంజుల, జిల్లాఅధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి. జనార్దన్‌రెడ్డి, డి. శ్రీనివాసులు, బి. రఘుబాబు, బి.శేషారావు, లేవి ప్రసాద్, పి. హనుమంతరావు, కే రవి, ఎస్‌కే ఖాదర్‌బాషా, మౌలాలి, ఈమని శ్రీను, పరిటాల సుబ్బారావు, అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.



పాటను ఆవిష్కరిస్తున్న రెవ.అజయ్‌పాల్

ఘనంగా క్రైస్తవ గీతావిష్కరణ

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):క్రిస్మస్ సందర్భంగా రూపొందించిన క్రైస్తవ వీడియో గీతావిష్కరణ సోమవారం స్థానిక అన్నవరప్పాడులోని టైనీబెల్స్ స్కూల్‌లో ఘనంగా జరిగింది. స్థానిక జేఎంబీ చర్చికి చెందిన రెవ.అజయ్‌పాల్ ముఖ్య అతిథిగా పాల్గొని వీడియో గీతాన్ని ఆవిష్కరించారు. స్కూల్ నిర్వాహకురాలు సుజితా శేఖర్ ఈ వీడియో గీతాన్ని రచించి, దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా అజయ్‌పాల్ మాట్లాడుతూ చిన్నతనం నుంచి ప్రభువుపై భక్తిభావాన్ని పిల్లలలో పెంపొందించాలని, దానికి ఇటువంటి వీడి యో గీతాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. సుజితా శేఖర్ ప్రసంగిస్తూ ఈ వీడియో గీతంలో చిన్నారులు ఎంతో చక్కగా నటించారని వారిని ప్రోత్సహిస్తున్న స్కూలు సిబ్బంది, తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. టి.శేఖర్, స్కూలు సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోకు అభినందనలు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ టి. వెంకటేశ్వర్లును సోమవారం ఆయన కార్యాలయంలో పలువురు కలిసి శాలువతో సత్కరించి బొకేలు ఇచ్చి అభినందించారు. అద్దంకి అజయ్, యశ్వంత్, సాయి తేజ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ చెన్నుపల్లి శ్రీనివాసాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సుతారం శ్రీను, పొన్నపల్లి బ్రహ్మానందం, ఫణిదపు సుధాకర్, సుతారం సుధ ఉన్నారు.

ప్రతి అర్జీని సీరియస్‌గా తీసుకొని పరిష్కరించాలి

జేసీ గోపాలకృష్ణ ఆదేశం



మీ కోసంలో అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజలనుంచి వచ్చిన ప్రతి అర్జీని సీరియస్‌గా తీసుకొని సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు రకాల సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ మీకోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జిల్లాలో అర్జీలను పరిష్కరిస్తున్న తీరును ముఖ్యమంత్రి కార్యాలయంనుంచి అధికారులు పర్యవేక్షిస్తున్నారన్నారు. అందువల్ల అర్జీలను మొక్కుబడి సమాధానాలతో ఎండార్స్‌మెంట్ ఇచ్చేసి సమస్యను పరిష్కరించినట్లు రికార్డుల్లో చూపితే సహించేది లేదని హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో సమస్య పరిష్కారం కావాల్సిందేనని, సమస్య పరిష్కరించలేని పక్షంలో అందుకు కారణాలను కూడా అర్జీదారులకు వివరించాలన్నారు. కేవలం అర్జీల పరిష్కారంలోనే కాదని, మీ కోసం కార్యక్రమానికి హాజరు విషయంలోనూ సమయ పాలన పాటించాలని జేసీ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేషు, డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, పార్థసారధితో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.

● తమ భూమిని ఇతరులకు ఎలాంటి ఆధారాలు లేకపోయినా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకాలు, టైటిల్ డీడ్‌లు జారీ చేశారని విజయవాడకు చెందిన టి.కృష్ణ ఫిర్యాదు చేశారు. వెలిగండ్ల మండలం మరమడుగు గ్రామ రెవెన్యూ పరిధిలో మా కోడలు తేలు సువర్లక్ష్మికి 108/4, 108/5, 109/1 సర్వే నెంబర్లలో 3.32 ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఆ భూమికి పట్టాదారుపాసుపుస్తకం, టైటిల్ డీడ్ పొందామన్నారు. 108/3 సర్వేనెంబరులో 66 సెంట్లభూమిని ఏ విధమైన ఆధారాలు లేకపోయినా రెవెన్యూ అధికారులు ఇతరులకు ఆన్‌లైన్ చేశారని ఫిర్యాదు చేశారు. ఈవిషయంపై అనేక సార్లు ఉన్నతాధికారులను కలిసి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. తమకు న్యాయంచేసి ఆదుకోవాలని కోరారు.

● ఒంగోలు మండలం మామిడిపాలెం 122/12 అసైన్‌మెంట్‌భూమిని స్థానిక దళితులకు అప్పగించే విధంగా చర్యలు తీసుకోవాలని దళిత రైతు భూపోరాట కమిటీ కన్వీనర్ దాసరి సీతారాములు కోరారు. ఈ భూవివాదం అనేక సంవత్సరాల నుంచి జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కొంత మంది ఆ భూమిని ఆక్రమించి నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని జేసీకి ఫిర్యాదు చేశారు.

పాస్టర్లకు దుస్తుల పంపిణీ



పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక మోరియా ప్రార్థనా మందిరంలో సోమవారం ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో తన గెలుపుకోసం కృషిచేసిన నియోజకవర్గంలోని దాదాపు 200 మంది పాస్టర్లకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ స్వచ్ఛందంగా దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యేను పాస్టర్లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.వి జయ, సర్పంచ్ డి.నాగమణి, నాలుగు మండలాల పాస్టర్లు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ప్రచార యాత్రను విజయవంతం చేయాలి

ఒంగోలు విద్య, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా జరుగుతున్న ప్రచారయాత్రను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి. వీరాంజనేయులులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈనెల 31న కనిగిరిలో ప్రారంభమయ్యే ప్రచారయాత్ర ఉదయం 10.30 గంటలకు బేస్తవారిపేట, మధ్యాహ్నం 12.30 గంటలకు మార్కాపురం, 1.30 గంటలకు పొదిలి, సాయంత్రం నాలుగున్నర గంటలకు ఒంగోలు చేరుకుంటుందని తెలిపారు. ఆయా సెంటర్లలో యూటీఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు కందులూరులో రెవెన్యూ సదస్సు

టంగుటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందులూరులో మంగళవారం రెవెన్యూ సదస్సు జరుగుతుందని తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. వచ్చేనెల 2వతేదీన మర్లపాడు, 3న ఎం.నిడమలూరు, చివరి రెవెన్యూ సదస్సు 7న టంగుటూరులో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలంతా వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కొరమేను చేపల పెంపకంపై నేడు అవగాహన సదస్సు

ఒంగోలు నగరం,డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కొరమేను చేపల పెంపకంపై ఈ నెల 31వ తేదీన అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు జిల్లా వెలుగు, గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ తేళ్ళ రవికుమార్ తెలిపారు. మంగళవారం వెలుగు శిక్షణా కేంద్రం టీటీడీసీలో జరిగే ఈ అవగాహన సదస్సులో అన్ని వివరాలను ఉదయ్ ఆక్వా ఎండీఉదయ్ తెలియజేస్తారని ఆయన తెలిపారు. -సెర్ప్ ఉదయ్ ఆక్వాతో ఎంవోయూ కుదుర్చుకుందని ఆయన తెలిపారు. ఉదయ్ ఆక్వా ద్వారా కొరమేను చేపల పెంపకం యూనిట్లను ఏర్పాటు చేసుకునే వారికి సీడ్,ఫీడ్, మార్కెటింగ్, బ్యాంకుల నుంచి రుణం కోసం దరఖాస్తుల ప్రక్రియ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని ఆయన తెలిపారు.

నేటితో ముగియనున్న పరీక్ష ఫీజు చెల్లింపు గడువు

ఒంగోలు విద్య, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఇంటర్మీడియేట్ జనరల్, ఒకేషనల్ కోర్సుల పరీక్షలకు హాజరయ్యే ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తత్కాల్ పథకంకింద రూ. 3వేల అపరాధ రుసుంతో ఫీజు చెల్లింపు గడువు మంగళవారంతో ముగుస్తుందని ఇంటర్మీడియేట్ విద్యా కార్యదర్శి కవితా శుక్లా ఉత్తర్వులు జారీచేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో కోరారు. ఫీజుచెల్లింపు గడువు మళ్లీ పొడిగించేది లేదని ఆమె స్పష్టంచేశారు.

బీసీ హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

మద్దిపాడు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):మద్దిపాడు బీసీ వసతిగృహం విద్యార్థులకు మద్దిపాడు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆనంద్ మోహన్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. 30 మంది విద్యార్థులు పరీక్షలు చేయించుకున్నారు.. అనంతరం ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాము, హెల్త్ సూపర్వైజర్ బాలకోటయ్య, హెల్త్ అసిస్టెంట్ దరియా సురేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సింహాల ధాటికి ప్రజల బెంబేలు

మద్దిపాడులో కుక్కలు సోమవారం స్వైర విహారం చేశాయి. మద్దిపాడు పైపాలెంలో కుక్కలు కరవడంతో నలుగురికి గాయాలయ్యాయి. స్థానిక గడియపూడి కాలనీలో ఇద్దర్ని కుక్కలు కరిచాయి. ఎక్కడ చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా ఉండటంతో ప్రజలు భయభ్రాంతులవుతున్నారు.

మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడిగా పబ్బిశెట్టి

సంతనూతలపాడు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పేర్నమిట్టకు చెందిన పబ్బిశెట్టి శ్రీనివాసరావును ఆదివారం రాత్రి జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా గ్రంధిశరత్, సెక్రటరీగా వీవీ మల్లికార్జునరావు, వైస్ ప్రెసిడెంట్‌గా సీహెచ్ సత్యనారాయణ, ట్రెజరర్‌గా మారుతీరావులను ఎంపిక చేశారు. వాసవిక్లబ్, మహిళాక్లబ్‌లకు నూతనకమిటీలను ఎన్నుకున్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై పోరు

మద్దిపాడు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై నిరంతం పోరాటం చేస్తామని రెవెన్యూ అసోసియేషన్ మండల అధ్యక్షురాలు ఎస్.కె.ఆరిఫా అన్నారు. సోమవారం రెవెన్యూ అసోసియేషన్ మండల అధ్యక్షురాలుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులకు ఏ సమస్య ఉత్పన్నమైనా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వీఆర్వో సంఘ నాయకుడు ఆదిరెడ్డి అధ్యక్షతన జరిగిన మండల కమిటీ ఎన్నికలో ఉపాధ్యక్షులుగా సీహెచ్ దీపక్, ప్రధాన కార్యదర్శిగా కొప్పోలు అంకమ్మరావు, కోశాధికారి సీహెచ్ రమేష్, సహాయ కార్యదర్శిగా ఎస్కే మీరావలి, సుధాకర్, ఈ. పూజితలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మాదిగ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం (ఎంఈఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ సోమవారం ఆవిష్కరించారు. గుంటూరులో జరిగిన మాదిగ ఉద్యోగుల సంఘం జాతీయ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మందకృష్ణ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.



వాకర్లను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

గాంధీ పార్కు అభివృద్ధికి చర్యలు

● కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజల ఆహ్లాదం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా గాంధీ పార్కులో మరిన్ని వసతులు కల్పించి, అందంగా తీర్చిదిద్దుతామని నగర కమిషనరు డాక్టర్ కే. వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఉదయం గాంధీ పార్కులో పర్యటించిన కమిషనరు అక్కడి సమస్యలను వాకర్స్ నుంచి అడిగి తెలుసుకున్నారు. వాకింగ్ ట్రాక్ అభివృద్ధి, పిల్లల పార్కులో ఆట వస్తువులు, అలాగే బోట్ క్లబ్, అందమైన వాతావరణం కోసం మొక్కలు పెంచాలని వాకర్స్ కమిషనరు దృష్టికి తీసుకొచ్చారు. అలాగే పార్కులో, వాకర్స్‌కు తాగునీటి సమస్య లేకుండా చూడాలని, అలాగే విశ్రాంతి తీసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఓపెన్ జిమ్‌తో పాటు, ఇతర సమస్యలను కమిషనరుకు వారు వివరించారు. దీనిపై స్పందించిన కమిషనరు మాట్లాడుతూ నగర సుందరీకరణ కోసం ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రత్యేకించి ఎన్‌క్యాప్ నిధులతో నగరంలో సెంటర్ డివైడర్‌లు, పార్కులు, పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గాంధీ పార్కులో సమస్యలన్నింటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు పింఛన్ల పంపిణీ

● 6,766 మంది లబ్ధిదారులకు రూ.2.87 కోట్ల నగదు పంపిణీ

సంతనూతలపాడు, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పింఛన్ సొమ్ముతో పాటు ప్రతి నెలా ఒకటో తేదీనే అందరికి నూరుశాతం పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటోంది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జనవరి 1వ తేదీకి ఒక రోజు ముందుగానే మంగళవారం 31న ఎన్టీఆర్ భరోసా పింఛన్‌సొమ్ము అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో మండలపరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. సచివాలయం వారీగా 30వ తేదీనే బ్యాంకులకు వెళ్లి ఉద్యోగులంతా నగదును తెచ్చుకున్నారు.

ఒక్కరోజులోనే అందరికీ అందేలా చర్యలు

ఒక్కరోజులోనే వందశాతం పింఛన్‌లు అందించేలా సచివాలయ ఉద్యోగులు, ఇతర విభాగాల సిబ్బందికి బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. మండలంలో 6,766 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం విడుదల చేసిన రూ.2కోట్ల 87లక్షల6వేలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 6గంటలలోపే పంపిణీ ప్రారంభించి, అదేరోజు తమకు కేటాయించిన లబ్ధిదారులకు అందజేసేలా ప్రణాళికను రూపొందించారు. ఒక్కో కార్యదర్శికి గరిష్ఠంగా 50 మంది లబ్ధిదారులను కేటాయించారు.

భర్తచనిపోయిన వారికి..

ఈసారి కుటుంబంలో పింఛన్ తీసుకుంటూ భర్త చనిపోయిన వారికి స్పౌజ్ పింఛన్ మంజూరు చేశారు. నవంబరు 1వతేదీ నుంచి ఈనెల 15వ తేదీ వరకు మృతులను పరిగణనలోకి తీసుకుని వితంత పింఛన్ మంజూరు చేశారు. వీరికి నాలుగువేల చొప్పున అందివ్వనున్నారు.

మినుము పంట నష్టం రూ.1.56 కోట్లు

● వ్యవసాయాధికారుల అంచనా



దెబ్బతిన్న మినుము పంటను పరిశీలిస్తున్న ఏవో, వ్యవసాయ సిబ్బంది

టంగుటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలు మండలంలోని మినుము రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. రూ.1.56 కోట్ల మేర నష్టం వాటిల్లింది. ఈమేరకు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. మండలంలోని కందులూరు, మర్లపాడు, కొణిజేడు, వల్లూరు, వెలగపూడి గ్రామాల్లో వ్యవసాయాధికారి స్వర్ణలత నేతృత్వంలో సిబ్బంది పర్యటించి ఈమేరకు తేల్చారు.

పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలి

కొండపి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసుల విచారణను వేగవంతం చేయాలని సీఐ జి.సోమశేఖర్ ఎస్సై ప్రేమ్‌కుమార్‌ను ఆదేశించారు. సోమవారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎస్సైకు పలు సూచనలు చేశారు. దొంగతనాలు జరగకుండా రాత్రుళ్లు పెట్రోలింగ్ పెంచాలన్నారు. న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే వారిపట్ల మర్యాదగా ప్రవర్తించాలని, నిష్పక్షపాతంగా కేసులను విచారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై అంకారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని మహిళ మృతి

● భర్తకు తీవ్రగాయాలు

సంతనూతలపాడు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.తక్కెళ్లపాడు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. ఎం.వేములపాడుకు చెందిన రాయిని వేణు, అతని భార్య శ్రీలత(37) సోమవారం ఉదయం ఒంగోలు నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఈక్రమంలో పి.తక్కెళ్లపాడు సమీపంలో రోడ్డు మార్జిన్ దెబ్బతిని ఉండటంతో శ్రీలత, వేణులు ప్రయాణం చేస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. ఇదేసమయంలో అటుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. ఈప్రమాదంలో శ్రీలత, వేణులకు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు ఒంగోలు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా శ్రీలత అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శ్రీలత భర్త వేణు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శ్రీలత మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించగా, అక్కడ నుంచి వచ్చిన నివేదిక మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవీ..ఇవీ

మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గిద్దలూరుటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు అన్నారు. సోమవారం పట్టణంలోని దీప్తి కళాశాలలో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ జయరావ్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్ లాంటి పదార్థాలు లేని సమాజం కోసం అందరం పని చేయాలన్నారు. మత్తు పదార్థాలు మానవ నాడీవ్యవస్థ, గుండె, కాలేయం వంటి అంతర్గత అవయవాల పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో జింకా వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన బస్సు

మార్కాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు అదుపుతప్పి నీటి సరఫరాకు సంబంధించిన ఇనుప గ్రిల్‌ను ఢీకొంది. ఈ ఘటన సోమవారం ఉదయం చెరువుకట్టపై చోటు చేసుకుంది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. మార్కాపురం నుంచి ఒంగోలు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తోన్న ఆటోను తప్పించబోయి చెరువుకట్టపై ఉన్న పైప్‌లైన్‌కు సంబందంచిన ఐరన్ గ్రిల్‌ను ఢీకొట్టింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి బ్రేక్ వేయడంతో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. బస్సు ముందు భాగం కొంతమేర దెబ్బతినగా, ప్రయాణి కులు ఎక్కే మెట్లభాగం ఊడి కిందపడింది. వెంటనే ప్రయాణికులను ఆర్టీసీ బస్టాండ్‌కు తరలించి వేరొక బస్సులో ఒంగోలు పంపించారు.

భూకబ్జాదారుల భరతం పడతాం

- ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ధ్వజం
- పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులకు హాజరు
- సమస్యలపై అర్జీలు ఇచ్చిన రైతులు


రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న నారాయణరెడ్డి

తర్లుపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో భూకబ్జాలకు పాల్పడిన వారి భరతం పడతామని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని సీతానాగులవరం, సూరెపల్లిలో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. సీతానాగులవరం రెవెన్యూ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల భూములు అడ్డగోలుగా కొట్టేసిన వారి భరతం పట్టేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టును త్వరలో పూర్తి చేసి ప్రజలకు సాగు, తాగు నీరు అందించేందుకు సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలో భాగంగా మార్కాపురం జిల్లా త్వరలో చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మార్కాపురం జిల్లా అయితే సీతానాగులవరం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా సీతానాగులవరంలో పలు సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. ఎన్టీఆర్ కాలనీ రహదారికి వైసీపీ నాయకులు అడ్డుపడుతున్నారని, సచివాలయం వెనుకున్న రహదారికి కంచె వేశారని, కొందరు భూములు ఆన్‌లైన్‌లో తక్కువగా ఉన్నాయని పలు సమస్యలపై అర్జీలు ఇచ్చారు. వెంటనే సచివాలయం వెనుకునున్న కంచెను తొలగించాలని ఆదేశాలు ఇచ్చారు. ఆదేశాల ప్రకారం తహ సీల్దార్, ఎంపీడీవో పలువురు సర్వేయర్లు సచివాలయం వెనుకున్న రహదారికి ఉన్న కంచెను తొలగించారు. దీంతో సమస్యను పరిష్కరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సీతానాగులవరంలో వివిధ సమస్యలపై 25, సూరెపల్లిలో 10 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ విజయభాస్కర్ పేర్కొన్నారు. అర్జీలకు రసీదులు ఇచ్చి 45 రోజుల్లోపు పరిష్కరించనున్నట్లు తహసీ ల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, మండల సర్వేయర్ సురేష్, ఈవోఆర్‌డీ సుకుమార్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : ప్రజల భూముల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు ఎమ్మె ల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని నికరంపల్లి గ్రామంలో సోమవారం తహసీల్దార్ అధ్వ ర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎమ్మెల్యే నారాయణరెడ్డి హాజరై మాట్లాడుతూ, కబ్జా దారులపై చర్యలు తీసుకునేందుకు కూటమి ప్రభుత్వం ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్ట పరమైన కఠినచర్యలు తీసుకుంటున్నామన్నారు. మా ర్కాపురం వైసీపీ నాయకులు చివరకు చెన్నకేశవ స్వా మి ఆలయ భూములను కూడా వదల్లేదని త్వరలోనే ఆలయ భూములను దేవదాయశాఖ స్వాధీనం చేసు కొని దేవస్థానానికి అప్పగిస్తుందన్నారు. మార్కాపురం జిల్లా త్వరలోనే సాకారం అవుతుందని తద్వారా రైతుల భూములకు మంచిధరలు వస్తాయన్నారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీచెన్నవేశవ స్వామి ఆలయ ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి, టీడీపీ గ్రామ నాయకులు సుబ్బారెడ్డి, టీడీపీ పట్టణ నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 8 అర్జీలు

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని కొలుకుల గ్రామంలో డీటీ నలగాటి మల్లికార్జుననాయుడు అధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మొత్తం 8 అర్జీలు వచ్చాయి. మ్యూటెషన్ కోసం 7, పొజిషన్ సర్టిఫికెట్ కోసం 1 దరఖాస్తులు వచ్చాయి. ముటేషన్ ధ్రువీకరణ పత్రాలు అక్కడిక్కడే అందేజేశామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు బాలేశ్వర్, చెన్నయ్య, ఖాదర్‌వలి, సర్వేయర్లు సాయికృష్ణ, వెంకటేశ్వరరెడ్డి సీవో రత్నం సిబ్బంది పాల్గొన్నారు.

నేర పరిశోధనకు సీసీ కెమెరాలు ఉపయుక్తం

మార్కాపురం డీఎస్పీ నాగరాజు


స్టేషన్ ఆవరణలో మొక్కను నాటుతున్న డీఎస్పీ నాగరాజు

పుల్లలచెరువు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): దుకాణాలతో పాటు ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఏదైనా నేరం జరిగినప్పుడు త్వరగా గుర్తించవచ్చని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు అన్నారు. సోమవారం వార్షిక తనిఖీల్లో భాగంగా పుల్లలచెరువు పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. ముందుగా దాతల సహకారంతో ఏర్పాటు చేసిన 45 సీసీ కెమెరాలను ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో కేసుల దర్యాప్తు వేగవంతం అవుతుందని అన్నారు. దుకాణదారులు, వ్యాపార సంస్థల్లో కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలను కొంత వరకు అరికట్టవచ్చునని అన్నారు. యాక్సిడెంట్ కేసులను కూడా త్వరగా గుర్తించవచ్చునని అన్నారు. దాతలు, సర్పంచుల సహకారంతో మండలంలోని పుల్లలచెరువు, యండ్రపల్లి, కొత్తూరు, ఐటివరం, మల్లాపాలెం, ఆర్.ఉమ్మడివరం, అక్కపాలెం, మర్రివేముల, ముటుకుల గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలను దాతల సహాయంతో ఏర్పాటు చేయించడంపై ఎస్ఐ సంపత్‌కుమార్‌ను అభినందించారు. పోలీసులు ప్రజలతో కలిసి స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో వైపాలెం సీపీ ప్రభాకర్‌రావు, ఎస్ఐ సంపత్ కుమార్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాస పూజలు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నెహ్రూబజారు షిరిడిసాయిబాబా మందిరంలో ధనుర్మాసం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు మందిర అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, గోపాలుని హరిహరరావులు సోమవారం తెలిపారు. మంగళవారం నుంచి జనవరి 11వ తేదీ వరకు భక్తులతో సామూహిక విష్ణుసహస్ర నామపారాయణం, 11న లక్ష్మీ నారాయణ హోమం, అన్నదానం నిర్వహిస్తామన్నారు. 11 రోజుల పాటు విష్ణు సహస్ర పారాయణం చేసిన వారిలో అత్యధికంగా పారాయణం చేసిన మొదటి ముగ్గురికి బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

టీడీపీ సభ్యత్వం నమోదు చేసుకోవాలి


టీడీపీ సభ్యత్వం అందిస్తున్న నాయకులు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుతో ప్రమాదబీమా రూ.5లక్షల వరకు వస్తుందని కావున ప్రతి ఒక్కరు సభ్యత్వ నమోదు చేసుకోవలని ఏపీ ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ సెక్రటరీ, ఎన్‌టీఆర్ కళాపరిషత్ ఛైర్మన్ చీదెళ్ల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక బస్టాండ్ సమీపంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ఆదేశాలతో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు 31 చివరి తేదీ అన్నారు. పలువురికి సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో ఎస్టీ కార్పొరేషన్ డైరక్టర్ చెవుల అంజయ్య, పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, మాజీ సర్పంచ్ కంచర్ల సత్యనారాయణ గౌడ్, వేగినాటి శ్రీను, చేదూరి కిషోర్, ఆతుకూరి కృష్ణయ్య, నాయకులు పాల్గొన్నారు.



తుపాను నష్టంపై ప్రభుత్వానికి నివేదిక

గిద్దలూరు టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పుశనగ, మినుము పైర్లు 1531 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని ఏవో విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల కురిసిన ఫెంగల్ తుపానుతో ఈ నష్టం సంభవించినట్లు పేర్కొన్నారు. శనగ సాగు చేసిన 1854 మంది రైతులకు గాను 1508 హెక్టార్లు, 53 మంది రైతులు సాగు చేసిన మినుము పై 23 హెక్టార్లు తుఫాన్ కారణంగా నష్టపోయినట్లు తెలిపారు. నష్టపరిహారం కోసం జిల్లా అధికారులకు నివేదికలు పంపినట్లు తెలిపారు.

కొమరోలు : కొమరోలు మండలంలోని అన్ని గ్రామాల్లో రబీ సీజన్‌లో ఫెంగల్ తుఫాన్ వలన నష్టపోయిన 2957 మంది శనగ రైతులకు 5553 ఎకరాల్లో రూ.2,22,09,700లు నష్టం జరిగిందని ఏవో రాజశ్రీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కొమరోలు మండలంలోని సూరవారిపల్లి సచివాలయ ప్రారంభ సమావేశంలో మండలంలో నష్టపోయిన శనగ పంటరైతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి పంపాలని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు శనగ పంట వేసి నష్టపోయిన రైతుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపామని తెలిపారు. అదేవిదంగా 124మంది మినుము వేసిన రైతులకు రూ.6,46,800లు నష్టపోయాలరని నివేదికను జిల్లా అధికారులకు పంపామన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : రైతు సేవ కేంద్రం నుండి గత ఏడాది గ్రూపులకు సబ్సిడిపై ఇచ్చిన ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను వ్యవసాయ పరిశీలిన అధికారి వ్యవసాయ సంచాలకులు కె బాలజీనాయక్, జిల్లా టెక్నికల్ ఏఓ బి శ్రీనివాసనాయక్‌లు తనిఖీ చేశారు. ప్రభుత్వ సాయాన్ని రైతులు సద్వినియోగం చేసకవాలన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరణ

మార్కాపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ పోల్‌మేనేజిమెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాధిక్, పట్టణ మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ షాకీర్‌హుసేన్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు మొఘల్ జాబీర్‌హుస్సేన్‌బేగ్, గౌరవాధ్యక్షులు షేక్ తాజ్‌హుస్సేన్, షేక్ ఖాశీంబాష, జాయింట్ సెక్రటరీ షేక్ జిలాని, నాయబ్, కరిముల్లా, తౌఫిక్, జాకీర్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక భద్రతపై అవగాహన

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక భద్రత, సైబర్ నేరాలపై విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గుంటూరు టీజేపీఎస్ పీజీ కళాశాల ఆచార్యులు డా. ఎస్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో బీకామ్, బీఎస్సీ విద్యార్థులకు సోమవారం 'స్మార్ట్ ఇన్వెస్టర్'పై సోమవారం ప్రత్యేక అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మొబైల్ ఫోన్ సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా వినియోగిస్తున్న ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెద్ద స్థాయిలో ప్రజల నుంచి పెట్టుబడులు స్వీకరిస్తు ప్రజలను భాగస్వాములు చేసుకుంటూ వారి ఆర్థిక వృద్ధికి సహకరిస్తున్న పలు ప్రఖ్యాతి గాంచిన సంస్థల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. కప్పగంతుల మధుసూదన్, వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ కుమార్, సమన్వయకర్త పవన్ కుమార్, డా. ఎం.శేషుకుమార్, కళాశాల ఇన్‌ఛార్జ్ డా. వీఆర్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్ల ఆవిష్కరణ


బ్యానర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

గిద్దలూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం బ్యానర్లను, జెండాలను, టోపీలను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ఆవిష్కరించారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం పేరిట నిర్వ హించే భారీ బహిరంగ సభలో ప్రతి హిందువులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, ముప్పూరి శ్రీనివాసులు, బూజుమేకల రాజు, హిందూ దేవాలయాల కమిటీ అధ్యక్షులు యర్రారెడ్డిపాల్గొన్నారు.

బాలికలకు చదువే ముద్దు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బాలికలు చక్కగా చదువుకొని అన్నిరంగాల్లో రాణించాలని వారిలో ఉన్న ప్రతిభ చదువుతోనే వెలుగులోకి వస్తుందని ఎంపీడీవో బండారు శ్రీనివాసులు అన్నారు. సోమ వారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'కిషోరి వికాసం'లో భాగంగా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తల్లిదండ్రుల్లో అవగాహన లేక చిన్నవయస్సులోనే బాలికలకు వివాహాలు చేస్తున్నారన్నారు. అలాంటి తల్లిదండ్రులకు బాలికలే అవగాహన కల్పించి వివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు. సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు గ్రామాల్లో బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంఈఓ పి.ఆంజనేయులు, వైద్యులు కోటా నాయక్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఏ పద్మజ, కేవీ. సుబ్బమ్మ, సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గాయత్రి యజ్ఞం


గాయత్రి యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

గిద్దలూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాయత్రి మాత దేవాలయంలో గాయత్రి మహాయజ్ఞం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై సామూహికంగా గాయత్రి యజ్ఞంలో పాల్గొన్నారు. గాయత్రి మంత్రం నిరంతరం ఉచ్ఛరించడం ద్వారా మంచి శక్తి పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాయత్రి పరివార్ సభ్యులు హనుమంతరెడ్డి, వంగల ప్రసన్న, బచ్చు వెంకటేశ్వర్లు, రామచంద్రరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో సరస్వతిదేవి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో వెలసిన జ్ఞానసరస్వతి అమ్మవారికి సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రకాశ్, మూల నక్షత్రం సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌ను విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

గిద్దలూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు గిద్దలూరు మండలంలోని చాలా గ్రామాల పరిధిలో పంట పొలాలకు నష్టం వాటిల్లిందని, నష్టపోయిన రైతులందరికీ ఎకరాకు రూ.25వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం నాయకులు టి.ఆవులయ్య డిమాండ్ చేశారు. మండలంలోని నరవ, బయనపల్లి, ముండ్లపాడు గ్రామాలలో సీపీఎం నాయకులు పర్యటించి పంట నష్టపోయిన రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆవులయ్య మాట్లాడుతూ అక్టోబరు నుంచి డిసెంబరు వరకు కురిసిన వర్షాలలో పప్పుశనగ, పొగాకు, కంది, మిరప రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎకరాకు 25వేల చొప్పున నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నరసింహులు, థామస్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా వెంకట్రామిరెడ్డి

కొమరోలు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొమరోలు మండల బీజేపీ అధ్యక్షునిగా వడ్డీ వెంకట్రామిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆపార్టీ ఆర్వో మారుతిప్రసాదు తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం మండల బీజేపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ బాడీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. పార్టీ కార్యాకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉండి సేవచేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్తానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యాదర్శి పాతకోట బ్రహ్మరెడ్డి, జాలాది సాయి, దుర్గారావు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేళ పోలీసుల సూచనలు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం వేడుకలకు సంబంధించి పోలీస్‌శాఖ పలు సూచనలు చేసింది. సోమవారం సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు, ఎస్సై పి.చౌడయ్య మాట్లాడుతూ 31 రాత్రి బహిరంగ ప్రదేశాల్లో రహదారులపై వేడుకలు నిర్వహించరాదన్నారు. ఆ రోజు రాత్రి పోలీస్ సిబ్బంది గస్తీ తిరుగుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ప్రమాదాలు జరగకుండా వాహనాలు తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. మద్యం తాగి, సైలెన్సర్‌లు లేకుండా వాహనాలు నడపకూడదని అన్నారు. ర్యాష్ డ్రైవింగ్ ట్రిపుల్ రైడింగ్ పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు గుంపులు గుంపులుగా తిరగరాదన్నారు. మైకులు, డీజేలు పెట్టి ప్రజా శాంతికి భంగం కలిగించరాదని అన్నారు. నూతన సంవత్సరం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని సరికొత్త విజయాలను అందుకొని అందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ సర్కిల్ ప్రజలకు పోలీస్ శాఖ తరుపున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

సోలార్ విద్యుత్‌తో ప్రయోజనాలు

» ఈఈ శ్రీనివాసులు


మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసులు

తాళ్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మధ్య తరగతి విద్యుత్ వినియోగదారుల ప్రయోజనం కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ ముఫ్తబిజ్లీ యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని ఈఈ పాలగిరి శ్రీనివాసులు తెలిపారు. ఈ పథకం ప్రయోజనాలపై సోమవారం నాగంబొట్లపాలెం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఈఈ శ్రీనివాసులు మాట్లాడుతూ మధ్యతరగతి విద్యుత్ వినియోగదారులకు మూడు కేటగిరిలుగా విభజించి రాయితీ ఇస్తుందన్నారు. 0-150 యూనిట్లు 1-2 కిలో వాట్లు వాడుకునే వినియోగదారులకు రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు సబ్సిడీ ఉంటుందని చెప్పారు. 150-300 యూనిట్లు 2-3 కిలోవాట్లు వాడుకునే వినియోగదారులు రూ.68 వేల నుంచి రూ.78 వేల సబ్సిడీ, 300 యూనిట్లు మూడు కిలోవాట్లు వాడుకునే వినియోగదారులకు రూ.78 వేల సబ్సిడీ ఇస్తున్నట్టు చెప్పారు. దరఖాస్తు చేసుకునే వినియోగదారులు ఆరు నెలలకు తక్కువకాకుండా విద్యుత్ బిల్లులు జమచేయాలన్నారు. సోలార్ విద్యుత్‌ను తక్కువ ఖర్చుతో వినియోగించుకోవచ్చునని చెప్పారు. 1కేవీ సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్ నెలకు దాదాపు 125యూనిట్లు ఉత్పత్తి చేస్తుందన్నారు. వినియోగదారులకు 5నుండి 6సంవత్సరాల్లో మూల ధన వ్యయాన్ని తిరిగి పొందవచ్చునన్నారు. సోలార్ విద్యుత్ వల్ల జరిగే ప్రయోజనాలను ఈఈ వివరించారు. మధ్య తరగతి విద్యుత్ వినియోగదారులు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దర్శి ఇన్‌చార్జ్ డీఈఈ డీవీ కృష్ణారెడ్డి, ఏఈ వి.శ్రీనివాసరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ వీవీఎస్ కాంతారావు, లైన్‌మన్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రుచికరంగా భోజనం తయారుచేయాలి

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం రుచికరంగా తయారు చేయాలని ఎంఈవో రాజాల కొండారెడ్డి పేర్కొన్నారు. సోమవారం సీఎస్‌పురం మండలంలోని సి.నాగులారం ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే, చింతపూడి, కోమటిగుంట్ల, నాగులారం పాఠశాలల్లోనూ భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శ్రీనివాసరాజు, కుమారి, కిరణ్‌కుమార్, రవీంద్ర పాల్గొన్నారు. కాగా మండలస్థాయి శిక్షణ కార్యక్రమం జనవరి 2న సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో తెలిపారు.

చెరువు అలుగులు ఆక్రమిస్తే కఠినచర్యలు

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


చెరువు విస్తీర్ణం రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

కనిగిరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చెరువుల అలుగు, వాగులను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని కనిగిరి పెద్దచెరువు అలుగు ఆక్రమణలను సోమవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నెలలో భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలన్నీ ముంపునకు గురయ్యాయన్నారు. కొండవాగులు, వంకలు నుంచి వచ్చే మార్గాలను ఆక్రమించడంతో ఇలాంటి సంఘటనలు పదేపదే జరుగుతున్నాయన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే అధికారులు ప్రభుత్వ పోరంబోకు, అలుగు, వాగు, వంకలకు చెందిన స్థలాలను కాపాడాలని సూచించారు. ఈసందర్భంగా అలుగు వాగు సర్వే చేసి రికార్డుల మేరకు ఆక్రమణలను తొలగించి స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. అప్పటివరకు అలుగు, వాగు పోరంబోకు స్థలాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని సూచించారు. అనంతరం హైవే పనులను పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జోసఫ్ డానియేలు, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఇరిగేషన్ అధికారి రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే
రెవెన్యూ సదస్సులు

» తహసీల్దార్ కె.సంజీవరావు


తాళ్లూరు: రెవెన్యూ సదస్సులో అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్ సంజీవరావు

తాళ్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎంతో కాలంగా పరిష్కారంకాని సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ కె.సంజీవరావు అన్నారు. సోమవారం బొద్దికూరపాడులో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. రికార్డుల్లో లేకుండా పాస్ పుస్తకాలు ఉండటం, తప్పులతడకగా రికార్డులు ఉండటం వంటి సమస్యల వల్ల భూహక్కుదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమవద్ద ఉన్న రికార్డుల జిరాక్సులతో అర్జీలు పెట్టుకుంటే పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు.

ఈసందర్భంగా బొద్దికూరపాడులో 37 అర్జీలు, శంకరనారాయణపురంలో మూడు, సూరాయపాలెంలో ఒక అర్జీ వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మందా శ్యాంసన్, ఉపసర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, పోలంరెడ్డి రమణారెడ్డి, వీఆర్‌వో చెన్న కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. వివాదాస్పదంగా ఉన్న సర్వే నంబర్ 100 స్థలాన్ని తహసీల్దార్ పరిశీలించారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా సమస్యల పరిష్కారం

పామూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. మండలంలోని దాదిరెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ బద్దినూడి శారమ్మ అధ్యక్షతన సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను గడువులోపు పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు. అనంతరం వివిధ సమస్యలపై రైతులు అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు యారవ శ్రీనివాసులు, కేవీ రమణయ్య, బద్దిపూడి మార్క్, డీటీ బ్రహ్మయ్య, బి.మల్లికార్జున, వీఆర్వో రసూల్, మండల సర్వేయర్ స్నేహ, తదితరులు పాల్గొన్నారు.

ముఖాముఖి
పంటల బీమాతో ప్రయోజనం

ఎన్.లక్ష్మీనారాయణ, ఏవో, దొనకొండ



ప్రశ్న: పంటల బీమాను రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారా ?

జవాబు: మండలంలో మినుము, పప్పు శనగ, వరి, మిర్చి సాగుచేసిన 145 మంది రైతులు ఇప్పటికే బీమా పథకంలో సభ్యులుగా చేరారు.

ప్ర: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారా ?

జ: మండలంలోని చందవరం గ్రామంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలో ఇప్పటికీ 48 టన్నులు ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి మిల్లులకు పంపాం. సంక్రాంతి వరకు రైతుల నుంచి కొనుగోలు చేస్తాం.

ప్ర: ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టం జరిగిందా ?

జ: మండలంలో పంట నష్టం పెద్దగా లేదు. చందవరం ప్రాంతంలో 15 ఎకరాల వరి నేలకొరిగి మొలకలు వచ్చాయి.

ప్ర: ఎరువుల దుకాణాల్లో నాణ్యమైన ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయా ?

జ: మండలంలోని ఎరువుల దుకాణాల్లో విక్రయించే ఎరువులు, పురుగు మందులను శ్యాంపిల్స్ తీసి ప్రయోగశాలకు పంపగా నాణ్యమైనవిగా తేలాయి. రైతులు ఎటువంటి ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినా రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలి. దుకాణాల వారు రసీదులు ఇవ్వకుంటే 8331057119 నెంబరుకు ఫోన్ చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

తాళ్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుగంగవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని 8,9,10వ తరగతి విద్యార్థులకు లక్ష్య జాబ్ అకాడమి, యునిసెఫ్, నీట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిజిటల్ ప్రొడక్టివిటీ కోర్సుపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఒకేషనల్ ట్రైనర్ వై.అంజిబాబు మాట్లాడుతూ ఇప్పటికే లక్ష్య జాబ్ అకాడమి ఆధ్వర్యంలో 3500 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. హైస్కూల్ హెచ్‌ఎం సీహెచ్ అరుణకుమారి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులకు నైపుణ్యంపై ఉచితంగా శిక్షణ ఇచ్చిన అకాడమికి అభినందనలు తెలిపారు. ఎంఈవో-2 ఎల్.సుధాకర్‌రావు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగిరెడ్డి, పవన్, విజయ్‌కుమార్, అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డును పరిశీలించిన అధికారులు

ముండ్లమూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు నుంచి జమ్మలమడక వరకు నిర్మించిన ఆర్‌అండ్‌బీ రోడ్డును క్వాలిటీ కంట్రోల్ ఈఈ శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా రోడ్డుకు వాడిన మెటీరియల్‌ను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డీఈ నాగేంద్రబాబు, జేఈ సుబ్రహ్మణ్యం, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

పీసీపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతినెలా ఒకటో తేదీన పంపిణీ చేసే సామాజిక భద్రతా పింఛన్లను ఒకరోజు ముందుగానే డిసెంబరు 31న పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో ప్రభాకరశర్మ తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాలతో లబ్ధిదారులందరికీ వారి ఇళ్లవద్దే మంగళవారం ఉదయం 5.30 గంటల నుంచి పింఛన్ నగదును అందజేస్తామన్నారు. మండలంలో వివిధ రకాల పింఛన్లకు సంబంధించి 4747మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

దొనకొండ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం మండలంలోని పెద్దగుడిపాడు వద్ద చోటుచేసుకుంది. గన్నెపల్లి ఆనందరావు దర్శి వైపు నుంచి స్వగ్రామమైన పెద్దగుడిపాడుకు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఈక్రమంలో దొనకొండ వైపు నుండి వస్తున్న ఆటో ఢీకొనటంతో తీవ్రగాయాలపాలై సొమ్మసిల్లిపడిపోయాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసి దర్శి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ నుంచిమెరుగైన వైద్యం నిమిత్తం నర్సరావుపేట వైద్యశాలకు తరలించినట్లు సమాచారం.

రోడ్డు మార్జిన్‌లను గ్రావెల్‌తో సరిచేయాలి

పామూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉపాధి నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులను పంచాయతీ రాజ్ డీఈ శ్రీధర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. సీసీ రోడ్ల మార్జిన్‌లలో నాణ్యమైన గ్రావెల్ తోలాలని సూచించారు. రోడ్డుపై కటింగ్‌లు చేయించి తారు వేయాలన్నారు. ఈ పనులు పూర్తికాగానే క్వాలిటి కంట్రోల్ అధికారులు నాణ్యతను పరిశీలిస్తారని తెలిపారు. త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ షేక్ మస్తాన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వాలు తీసుకొన్న పామూరు నేతలు


ఉగ్ర చేతుల మీదుగా టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకొంటున్న నాయకులు

పామూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పామూరుకు చెందిన పలువురు టీడీపీ నాయకులు ఎమ్మెల్యే ఉగ్ర సమక్షంలో శాశ్వత సభ్యత్వాలను స్వీకరించారు. కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, పారిశ్రామికవేత్త తిరివీధి జనార్దనరావులు ఉగ్ర చేతుల మీదుగా సభ్యత్వాలు స్వీకరించారు.

అలాగే, టీడీపీ సీఎస్‌పురం మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు బొయిళ్ల నారాయణరెడ్డి శాశ్వత సభ్యత్వం తీసుకొన్నారు. శాశ్వత సభ్యాత్వాలు స్వీకరించిన పామూరు, సీఎస్‌పురం మండల నాయకులను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర అభినందించారు.

టీడీపీ నాయకుడికి నివాళి

దర్శి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఓర్సు రమణయ్య మృతి బాధాకరమని దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో ఆయన మృతిచెందారు. రమణయ్య మృతదేహానికి నివాళులర్పించారు.

నివాళులర్పించిన వారిలో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, గొర్రె సుబ్బారెడ్డి, మాగం సుబ్బారావు, పత్తిపాటి ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

నేడు పసుపుగల్లుకు గొట్టిపాటి లక్ష్మి రాక

ముండ్లమూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లులో మంగళవారం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి హాజరవుతున్నట్టు ఎంపీడీవో ఆర్.జనార్దన్ తెలిపారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌లు పంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గంధ మహోత్సవం

పామూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆకులవీధిలో వెలసియున్న శ్రీ హజరత్ మహబూబ్ సుభాని స్వామి వారి దర్గా 49వ గంధ మహోత్సవ వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా మాజీ సర్పంచ్ ఉప్పలపాటి ఆంజనేయులు ఇంటివద్ద నుంచి గంధంను, దర్గా వద్ద నుంచి స్వామి జండాను మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు గంధం, ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం దాతల సహకారంతో ఏర్పాటుచేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అభివృద్ధి పనుల అమలుపై సమీక్ష


కౌన్సిల్ సమావేశంలో ఎజెండాను పరిశీలిస్తున్న చైర్మన్ పిచ్చయ్య

దర్శి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సూచించారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. దర్శి పట్టణంలోని అన్నీప్రాం తాల్లో సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలు చేపట్టినట్టు చెప్పారు. బీసీ హాస్టల్ మ రమ్మతులకు రూ.15 లక్షల నిధులను కేటా యించారు. శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు, ఏఈ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ తలారి కోటయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఫసల్ బీమా గడువు

పీసీపల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా నమోదు గడువు మంగళవారంతో ముగుస్తుందని మండల వ్యవసాయ అధికారి కె.ప్రకాశరావు తెలిపారు. రబీ సీజన్‌లో వరి, శనగ, మొక్కజొన్న, మిర్చి పంటలను సాగుచేసిన రైతుల్లో ఇప్పటివరకు బీమా చేయించుకోనివారు ఈనెల 31వతేదీ సాయంత్రంలోగా బీమా చేయించుకోవాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు బీమా వర్తించాలంటే ఈపంట నమోదు చేయించుకోవడంతో పాటు ప్రతిరైతు తప్పనిసరిగా ఫసల్ బీమా కూడా నమోదు చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు నిర్మాణ పనుల నాణ్యత పరిశీలన


రోడ్డు నిర్మాణ నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

తాళ్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మించిన తాళ్లూరు- తూర్పుగంగవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతా ప్రమాణాలను ఈఈ శ్రీనివాసరావు, డీఈ గోపీకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. ఇటీవల తాళ్లూరు- తూర్పుగంగవరం ఆర్‌అండ్‌బీ మార్గంలో 5 కిలోమీటర్ల మేర నూతనంగా తారు రోడ్డు నిర్మించారు. రోడ్డు నాణ్యతా ప్రమాణాలను అక్కడక్కడ గుంతలు తీసి సాంకేతికత ఆధారంగా పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ నాగేంద్రబాబు, ఏఈలు సుబ్రమణ్యం, షేక్ రఫీ, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు. రోడ్డు పనులు పూర్తయిన ప్రాంతంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మార్జిన్‌లో మట్టితో చదును చేయాలని కాంట్రాక్టర్‌కు అధికారులు సూచించారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ముండ్లమూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం మండల విద్యాశాఖ అధికారులు ఎం. సుబ్బారావు, కె.వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఎంఈవో కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో క్యాలెండర్‌తో పాటు యూనియన్ డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమ స్యల పరిష్కారంలో యూనియన్ నాయకులు ముందుండి పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ .లేవీప్రసాద్ మండల అధ్యక్షుడు తిప్పిశెట్టి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఎలిషా, కమిటీ సభ్యులు ఎస్‌కే మస్తాన్‌వలి, పద్మావతి, రుద్రయ్య, కె.శ్రీనివాసులు, ఏ.శ్రీనివాసులు, గోపాళం శ్రీనివాసులు, మాగులూరి శ్రీనివాసులు, బేతా వెంకటేశ్వర్లు, విజయ్, ఆంజనేయ స్వామి, దార్ల శ్రీనివాసులు, కంఠా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయ కవులలో శ్రీశ్రీ ప్రముఖులు

బాపట్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భావకవిత్వం, చందస్సు సహిత పద్యకవిత్వం మాత్రమే సాహిత్యంగా విశ్వసించే రోజుల్లో వచన కవిత్వం కూడా గొప్ప సాహిత్యమేనని, జనాదరణ పొందగలదని నిరూపించిన అభ్యుదయ కవులలో శ్రీశ్రీ ప్రముఖులని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. బాపట్ల మండలం వెదుళ్ళపల్లి వివేక సర్వీస్ సొసైటీ ఆవరణలో నెలనెల నందివర్ధనం తరతరాల తెలుగుపలుకు 96వ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివేక సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ, జాతీయ స్థాయిలో వెల్లివిరిసిన అభ్యుదయభావాలను స్వాగతించిన శ్రీశ్రీ వాడుకలో ఉన్న తెలుగు పదాలను గొప్పకూర్పు అల్లికతో తన కవిత్వాన్ని జనసామాన్యం దరికి చేర్చారన్నారు.



సీఎం చంద్రబాబు పాల్గొనే సభా వేదిక

- యలమందలలో పింఛన్ల పంపిణీ
- గ్రామస్థులతో ముఖాముఖి
- కోటప్పకొండలో పూజలు



హెలిపాడ్ వద్ద చంద్రబాబు కోసం ఏర్పాట్లు

నేడు పల్నాడులో..

సీఎం పర్యటన

నరసరావుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా పల్నాడు జిల్లా పర్యటనకు వస్తున్నారు. నరసరావుపేట నియోజకవర్గం, యలమందల గ్రామంలో నేడు జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఆయన పర్యటనకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. గ్రామంలో బీసీ వర్గానికి చెందిన ఉల్లంగుల ఏడుకొండలు, ఎస్సీ కాలనీకి చెందిన తలారి శారమ్మకు, సీఎం వారి ఇళ్లకు వెళ్లి పింఛన్‌లు పంపిణీ చేస్తారు. ఆయా కుటుంబాల యోగక్షేమాలను ఆయన తెలుసుకుంటారు. వారి ఇళ్లలో తేనీటి విందు చంద్రబాబు స్వీకరించనున్నారు. ఆయా ప్రాంతాల్లో రహదారులకు అధికారులు మరమ్మతులు నిర్వహించారు. పింఛన్‌ల పంపిణీ అనంతరం గ్రామంలోని రామాలయాన్ని సందర్శించి పూజలు చేస్తారు. ఆలయం ఎదుట గ్రామస్థులతో ముచ్చటిస్తారు. ఇందు కోసం వేదిక ఏర్పాటు చేశారు. ఇక్కడికి 1200 నుంచి 1500 మందిని మాత్రమే అనుమతిస్తున్నారు. వేదికపై కూడా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీని మాత్రమే అనుమతించనున్నారు. భారీ బహిరంగ సభలు.. జనసమీకరణలు లేవు. ఆర్భాటాలు లేకుండా వేదిక నిర్వహిస్తున్నారు. ప్రజలతో ముచ్చటించిన అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడతారు. జిల్లా అభివృద్ధిపై దిశా నిర్దేశం చేస్తారు. ఈ కార్యక్రమం అనంతరం రోడ్డు మార్గాన కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధికి చేరుకుంటారు. శ్రీ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. అనంతరం కోటప్పకొండ నుంచి రోడ్డు మార్గాన యలమందల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకొని ఉండవల్లిలోని నివాసానికి చంద్రబాబు చేరుకుంటారు.

భారీ బందోబస్తు

చంద్రబాబు పర్యటనకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తు ఏర్పాట్లపై ఐజీ త్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు పోలీసు అధికారులతో సమీక్షించారు. సీఎం భద్రత కోసం రూపొందించిన బందోబస్తు ప్రణాళికను సిబ్బందికి తెలియజేశారు. సెక్టార్ల వారీగా బాధ్యతలను అధికారులు, సిబ్బందికి అప్పగించారు. హెలిప్యాడ్, పింఛన్ దారుల నివాసాలు, కోదండరామ స్వామి దేవాలయం, సభాస్థలి, కోటప్పకొండలో అన్ని చోట్ల విధులకు సిబ్బందిని కేటాయించారు. రోప్ పార్టీలు, రూట్ బందోబస్తు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పార్కింగ్ సెక్టార్లలో పర్యవేక్షణకు అధికారులను నియమించారు. సీఎం పర్యటించే ప్రాంతాలలో డ్రోన్‌తో నిఘా ఉంచారు. సీఎం కాన్వాయ్ రిహార్సల్ నిర్వహించారు. డ్రోన్‌ల ద్వారా ఏర్పాట్లను ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జేసీ సూరజ్ ఏర్పాట్లను పరిశీలించారు.



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ త్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు

ఆనందంగా ఉంది



ఏడుకొండలు

తమ ఇంటికి చంద్రబాబు వచ్చి పింఛన్ ఇస్తున్నారనే సమాచారం తెలుసుకున్న శారమ్మ, ఏడుకొండలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఉల్లంగుల ఏడుకొండలు. ఇతనికి 68 ఏళ్లు. బీసీ వర్గానికి చెందిన వ్యక్తి. ఆయనకు కుమారుడు, కోడలు.. ఇరువురు కవలలైన మనుమలు ఉన్నారు. ఏడు కొండలు ఇంటికి చంద్రబాబు వెళ్లి రూ.4 వేలు వృద్ధాప్య పింఛన్ అందించనున్నారు. నా ఇంటికి చంద్రబాబు వస్తుండటం పట్టలేనంత సంతోషంగా ఉందని ఏడుకొండలు అన్నారు.

లారీ డ్రైవర్‌గా పనిచేసే శారమ్మ భర్త, 2021లో కరోనా రెండో విడతలో మృతి చెందాడు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. 2023లో ఆమెకు వితంతు పింఛన్ మంజూరైంది. చంద్రబాబు తన ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తారని అధికారులు వచ్చి చెబితే నమ్మలేకపోయాను. విలేకరులు వచ్చి వివ రాలు అడుగుతుంటే ఇప్పుడు నమ్ముతున్నాను. నిజంగానే చంద్రబాబు నా ఇంటికి వస్తున్నారు. చెప్పలేనంత ఆనందంగా ఉంది. ఆయన మా ఇంటికి రావడం మా అదృష్టమని శారమ్మ సంతోషాన్ని వ్యక్తం చేసింది.



తలారి శారమ్మ

ఎస్సీల స్థితిగతులపై అధ్యయనం

- ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా
- గుంటూరులో వినతుల స్వీకరణ

గుంటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా షెడ్యూల్ కులాలకు చెందిన ప్రజల జీవన స్థితిగతులపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాత ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. జిల్లాల పర్యటనలో భాగంగా ఆయన సోమవారం గుంటూరు జిల్లా కలెక్టరేట్‌కు వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండి అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అలానే వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఎస్సీలలోని ఉపకులాల వారీగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా స్థితిగతులపై ప్రభుత్వ శాఖల వారీగా సమగ్ర వివరాలతో కచ్చితమైన గణంకాలను సేకరిస్తున్నామని చైర్మన్ మిశ్రా తెలిపారు. అలానే ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని పరిశ్రమలు ఏర్పాటు చేసి లబ్ధి పొందిన వారి వివరాలు కూడా సమగ్రంగా సేకరిస్తున్నామని చెప్పారు. అధికారులు అందించే వివరాలను పూర్తిగా అధ్యయనం చేసి రిమార్కులతో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు.



ఎస్సీ కులాల వర్గీకరణకు ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా నిర్వహించిన సమావేశానికి హాజరైన కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ ఇతర అధికారులు

జిల్లాలో ఎస్సీల్లోని ఉప కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా స్థితిగతులపై శాఖల వారీగా అధికారులు సమగ్ర వివరాలను కచ్చితమైన అంకెలతో అందించాలని రంజన్ మిశ్రా అధికారులను ఆదేశించారు. తొలుత కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, జియంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హాతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్సీల్లోని ఉపకులాల వారీగా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలలోని ఉద్యోగులు, పాఠశాల, కళాశాల, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారు, వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘాల్లో, ప్రభుత్వ పథకాల ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేసిన వారు, వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన వారి వివరాలు సమగ్రంగా అందించాలన్నారు. అధికారులు అందించిన వివరాల ప్రకారం పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించడం జరుగుతుందన్నారు. షెడ్యూల్ కులాలలో అతి తక్కువ శాతం ఉన్న ఇతర ఉప కులాల వారికి షెడ్యూల్ కుల ధ్రువీకరణ పత్రాల జారీకి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతిబసు, డీపీఓ సాయికుమార్,డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి డీఈఓ రేణుక, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ జయలక్ష్మి, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి తదితరులు వారి శాఖల వివరాలను మిశ్రాకు వివరించారు. సమావేశం అనంతరం ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణపై ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలు, కుల సంఘాల నాయకుల నుండి అభిప్రాయాలు, వినతులు స్వీకరించారు. తాడికొండ శాసన సభ్యుడు తెనాలి శ్రావణ్ కుమార్, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ, జాతీయ, రాష్ట్ర స్థాయి, ఉమ్మడి గుంటూరు జిల్లాల షెడ్యూల్ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు షెడ్యూల్ కులాల వర్గీకరణ అంశంపై ఏక సభ్య కమిషన్ చైర్మన్‌కు అర్జీలు అందించి, అభిప్రాయాలను తెలిపారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ అంశంపై అర్జీ అందించటానికి వచ్చిన విభిన్న ప్రతిభావంతుల వద్దకే ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా వెళ్లి అర్జీలు స్వీకరించారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ అంశానికి సంబంధించి మొత్తం 124 అర్జీలను అందించారు. ఈ సమావేశంలో గుంటూరు, బాపట్ల జిల్లాల రెవెన్యూ అధికారులు ఎన్ షేక్ ఖాజావలి, గంగాధరగౌడ్, ఆర్‌డీవో కే శ్రీనివాస రావు, డీడీ సోషల్ వెల్ఫేర్ మధు సూదన రావు, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ టి ప్రేమ కుమారి, ప్రజలు, కుల సంఘాల నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



- బహిరంగ మద్యపానం ఉపేక్షించం
- ఇతరులకు ఇబ్బంది కలిగించకూడదు
- ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల ,డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణలో జరుపుకోవాలని ఎస్పీ తుషార్ డూడి ఆకాంక్షించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపిన, బహిరంగప్రదేశాలలో మద్యం సేవించిన ఉపేక్షించబోమన్నారు. అల్లర్లు సృష్టించిన, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైలెన్సర్‌లు లేకుండా తీవ్రమైన ధ్వనులు సృష్టిస్తూ ద్విచక్రవాహనాలు నడిపితే వాహనం సీజ్ చేస్తామన్నారు. ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్ చేయవద్దు అని యువతకు సూచించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించరాదన్నారు. గుంపులు/గుంపులుగా తిరుగుతూ ఇతరులకు ఇబ్బంది కలిగించరాదన్నారు. ఈవ్‌టీజింగ్ చేస్తే చర్యలు తప్పవన్నారు. బహిరంగపార్టీలు నిర్వహించటం, నృత్యాలు చేయటం, బాణా సంచా కాలుస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమయానికి మించి మద్యం విక్రయిస్తే దుకాణాలు, బార్లపై చర్యలు తీసుకుంటానన్నారు. పోలీసులు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తానన్నారు. ముఖ్యమైన కూడలిలలో పికెట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసు ఆదేశాలను పెడచెవిన పెడితే ఉపేక్షించేదిలేదన్నారు. యువతపై కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగాలలో చేరాలంటే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. కావున ప్రజలంతా పోలీసులకు సహకరించి ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలని ఎస్పీ కోరారు.

మద్యం.. విడి విక్రయాల జోరు

- బెల్ట్ షాపుల నిర్వహణకు వేలం
- సీసాకు రూ.30 అదనపు వసూళ్లు
- సమయపాలన పాటించని వైన్ షాపులు, బార్లు
- ఆధిపత్యం కోసం సిండికేట్ల మధ్య పోరు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

చీరాల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపులు పెట్టకూడదు. అధిక ధరలకు మద్యం విక్రయాలు జరపకూడదని సాక్షాత్తూ సీఎం చంద్రబాబు చెబుతున్నా, ఆ మాటలు చీరాల, పర్చూరు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలోని లైసెన్సీలు తమకు వర్తించదన్నట్లు వ్యవహరిస్తున్నారు. విచ్చలవిడిగా బెల్టు షాపులు నిర్వహిస్తూ మద్య రేట్లు పెంచి అమ్ముతున్నారు. అంతే కాకుండా ఈ బెల్టు వ్యవహారంలో తమ మాటే చెల్లాలంటూ ఆధిపత్య పోరుకు తెగబడుతున్నారు. ఈ వ్యవహారంలో చీరాల నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా మద్యం వ్యాపారంలో ఉన్న ఇద్దరు అన్నదమ్ముల మధ్య ప్రత్యక్షంగా పోరుకు తెరలేచినట్లు తెలుస్తోంది. ఇద్దరు అన్నదమ్ములు సుదీర్ఘకాలంగా మద్యం వ్యాపారంలో చక్రం తిప్పుతున్నారు. ఈ నేపధ్యంలో వారిని లిక్కర్ వ్యాపారంలో టక్కరోళ్లు అంటూ ముద్దుగా సంబోధిస్తుంటారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఇందులో చేరిన ఒక సోదరుడు, తన మాట వింటేనే వ్యాపారం సజావుగా సాగుతుందంటూ, పట్టు కోసం పాకులాడుతున్నాడు. అయితే ఈ వ్యాపారుల్లో మూడు పార్టీలకు చెందిన వారు ఉండడంతో, ఒకరిపై ఒకరు ఆధిపత్య పోరుకు సిద్ధమవుతున్నారు.

బెల్ట్ షాపుల నిర్వహణకు వేలం పాటలు

తీరప్రాంతం, మైదాన ప్రాంతం అనే తేడాలేకుండా బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఇక తీరప్రాంతంలో అయితే ఏకంగా బెల్ట్ షాపుల నిర్వహణకు వేలం పాటలు నిర్వహించి బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అందులో చీరాల మండలం విజయలక్ష్మీపురంలో రూ.3 లక్షలకు, వేటపాలెం మండలం కఠారివారిపాలెంలో రూ.5 లక్షలకు బెల్ట్ షాపుల నిర్వహణకు పాటలు ద్వారా కేటాయించినట్లు విశ్వసనీయ సమాచారం. డిపాజిట్ లేకుండా పట్టణ, రూరల్ అని భేదం లేకుండా బెల్ట్ షాపుల నిర్వహణ జరుగుతోంది.


అదనపు వసూళ్లు

పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ఎక్కడెక్కడయితే బెల్ట్ షాపులు ఉన్నాయో అక్కడ బాటిల్‌కు రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రధానంగా తీరప్రాంతంలో, పట్టణాల్లో కూడా దొరకని క్లాస్ బ్రాండ్‌ల మద్యం తీర ప్రాంతంలోని బెల్ట్ దుకాణాల్లో దొరుకుతోంది. రిసార్టులకు వచ్చేవారు అక్కడ కొనుగోలు చేస్తుండటంతో విక్రయదారులు అందుకు అనుగుణంగా పెద్ద పెద్ద బ్రాండ్లను అందుబాటులో ఉంచుతున్నారు. కొన్ని సందర్భాల్లో విక్రయదారులు, కొనుగోలుదారుల మధ్య ధరల విషయంలో గొడవలు జరిగిన సందర్భాలు ఉన్నాయి.

ఎవరినీ ఉపేక్షించం :

నాగేశ్వరరావు, సీఐ, చీరాల ఎక్సైజ్ సర్కిల్

బెల్ట్ షాపులు అనేవాటికి ఎలాంటి అనుమతులు ఉండవు. అనధికారికంగా మద్యం విక్రయించే వారిని ఎవరినైనా ఉపేక్షించం. తీరప్రాంతమైనా, మైదాన ప్రాంతమైనా ఒక్కటే. ఇప్పటికే పలు సందర్భాల్లో కేసులు నమోదు చేశాం. మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్‌ల నిర్వాహకులు కచ్చితంగా సమయపాలన పాటించాలి. లేదంటే తగిన చర్యలు చేపడతాం.



పీఎం కిసాన్‌లో... 33,889 మంది

అనర్హులు

- లెక్కతేల్చిన వ్యవసాయ శాఖ
- ఐదేళ్లలో రూ.100 కోట్లు వారి ఖాతాల్లో జమ
- యాజమాన్య హక్కులు లేకున్నా లబ్ధిపొందిన వారు కోకొల్లలు
- ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన వారూ లబ్ధిదారులే

గుంటూరు సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా పీఎం కిసాన్ పథకం కింద లబ్ధి పొందుతున్న అనర్హుల లెక్క తేలిపోయింది. గుంటూరు జిల్లాలో 33889 మంది అనర్హులు ఉన్నట్లు వ్యవసాయ శాఖ లెక్క తేల్చింది. దాంతో 2019 నుంచి మొత్తం 1,21,898 మంది పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందుతుండగా, తాజా సర్వేతో అర్హులైన లబ్ధిదారుల సంఖ్య 85,460 కి పరిమితం అయ్యింది. రైతులకు పెట్టుబడి సాయం కింద ఆర్థికంగా చేయూత నిచ్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరి లో పీఎం కిసాన్ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ పథకంలో ఒక్కో రైతుకు రూ.6 వేల వరకు కేంద్రం చెల్లిస్తుంది. ఏడాదిలో మూడు విడతలుగా నేరుగా రైతు ఖాతాలోనే పీఎం కిసాన్ సొమ్మును జమ చేస్తున్నారు. అయితే అప్పట్లో రెవెన్యూ కార్యాలయంలో ఉన్న సమాచారం ఆధారంగా ఈ నగదు బదిలీ జరుగుతూ వచ్చింది. ఫలితంగా కొందరు అనర్హులు పీఎం కిసాన్ లబ్ధి పొందుతుండగా, చాలా మంది అనర్హులు ఈ పథకానికి దూరంగా ఉన్నారు. గడచిన ఐదేళ్ల కాలంలో అనర్హులైన వారు పీఎం కిసాన్ పథకం తమకు రావటం లేదని ప్రభుత్వానికి వేల కొద్దీ అర్జీలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వం సర్వే కూడా ససేమిరా అంటూ వచ్చింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ పీఎం కిసాన్ లోని అనర్హుల లెక్క తేల్చింది.



ఎన్నారైలూ లబ్ధిదారులే...

గత ఐదేళ్ల కాలంలో విదేశాల్లో నివసిస్తున్న (ఎన్నారై)లు కూడా పీఎం కిసాన్ కింద లబ్ధి పొందినట్లు వ్యవసాయ శాఖ సర్వే లో తేలింది. జిల్లాలో 465 మంది ఎన్నారైలకు ఈ పథకం కింద నగదు జమ అయ్యింది. ఒకే ఇంటి లో ఒకరికి మాత్రమే పథకం వర్తింప చేయాలని నిబంధన ఉండగా, 3799 మంది ఒకరికంటే ఎక్కువ మంది లబ్ధి పొందారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు, ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన 477 మంది ఇప్పటివరకు పథకాన్ని వినియోగించుకున్నారు. 2019 నాటికే పొలం అమ్ముకొని కూడా ఇప్పటివరకు 5866 మంది పీఎం కిసాన్ పథకం నగదును పొందుతూ వచ్చారు. స్థిరమైన భూ యాజమాన్య హక్కులు లేకుండా ఇప్పటివరకు 12747 మంది పథకాన్ని వాడుకు న్నారు. 7247 మంది గుర్తు తెలియని, అడ్రెస్ లేని వ్యక్తులు కూడా ఇప్పటివరకు పీఎం కిసాన్ నగదును పొందారు. వీరు కాక ఆదాయపు పన్ను చెల్లిస్తూ ఈ పథకం కింద లబ్ధి పొందిన వారు 2325 మంది ఉన్నట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. అనర్హులను ఈ ఏడాది పీఎం కిసాన్ జాబితా నుండి తొలగించారు.

ఐదేళ్లలో....

గడచిన ఐదేళ్ల కాలంలో అనర్హులైన వారి ఖాతాలో రూ. 100 కోట్ల వరకు జమ అయ్యినట్లు తేలుతోంది. ప్రభుత్వ రికార్డులు సరిగా లేకపోవడంతో ఇంత సొమ్ము అనర్హులు అందినట్లు స్పష్టం అవుతోంది. ఇప్పటివరకు అనర్హుల ఖాతాలో జమ అయిన సొమ్మును వెనక్కి తెచ్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏమి చేస్తుందో వేచి చూడాల్సిందే.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

- ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని ఎస్పీ తుషార్‌డూడి పోలీసు అధికారులను హెచ్చరించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. భూవివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థికలావాదేవీల మోసాలు వంటివి పలుసమస్యలపై 40మంది తమ అర్జీలను అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకొని వాటిపై చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, పీజీఆర్ఎస్‌సెల్ ఎస్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్‌డూడి

ఒంటరి వృద్ధురాళ్లే.. టార్గెట్

వరస ఘటనలతో ఆందోళన

మత్తు ఇచ్చి దోపిడీకి పాల్పడుతున్న దుండగులు

తాజాగా సమతానగర్‌లో ఘటన

ఒంగోలు(క్రైం), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాళ్లే లక్ష్యంగా దోపిడీల పరంపర కొనసాగుతోంది. ఇద్దరు వృద్ధులు దోపిడీ దొంగల బారిన పడి హత్యకు గురికాగా, ఇద్దరు చావు అంచుల వరకు వెళ్లి బయటపడ్డారు. ఇలాంటి వరస సంఘటనలతో జిల్లా ప్రజానీకం ఆందోళనకు గురవుతున్నారు. ఎనిమిది నెలల వ్యవధిలో జిల్లాలో వరుసగా చోటుచేసుకున్న సంఘటనలు మిస్టరీగా తయారయ్యాయి. ముఖ్యంగా ఒంగోలుతోపాటు పరిసర ప్రాంతాలలో ఈ రకం దోపిడీలు జరగడం పోలీసులకు సవాల్‌గా మారాయి. ఇప్పటికి జరిగిన ఘటనలలో ఎలాంటి క్లూ దొరకకపోవడంతో పోలీసులు తలలు పట్టుకున్నారు. ఒంటరిగా జీవిస్తున్న పండుటాకులు, కన్నబిడ్డలకు సైతం దూరంగా ఉంటున్న వారిని టార్గెట్‌గా చేసుకొని దోపిడీ దొంగలు స్వైరవిహారం చేస్తున్నారు. వృద్ధులకు మత్తుమందు ఇచ్చి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు అపహరించుకెళుతున్నారు. అనుమానం వస్తే దాడులకు పాల్పడుతున్నారు. అదేసమయంలో వృద్ధులు మత్తుమందు ఘాటుకు తట్టుకోలేక మృత్యువాతపడుతున్నారు. కాగా పదిరోజులు కిందట ఒంగోలులోని సమతానగర్‌లో జరిగిన దోపిడీ ఘటనతో మహిళలే ఈ దోపిడీలను పాల్పడుతున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఇటీవల జరిగిన వరస ఘటనలు...

- ఒంగోలు అంబేడ్కర్ భవన్ సమీపంలో నివాసముంటున్న తిరుమలశెట్టి పార్వతమ్మ ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. మే 24న ఆమె శరీరంపై పెద్దగా గాయాలు ఏమి లేవు. మామిడికాయ తింటూ ఇంట్లో మృతిచెందింది. ఆమె వద్ద ఉన్న బంగారం ఆభరణాలు దోపిడీ దొంగలు అపహరించుకెళ్లారు. అదేసమయంలో ఇంట్లో ఉన్న బీరువాను పెకలించారు. దీంతో ఇరుగుపొరుగు వారు గుర్తించి ఆసుపత్రిలో చేర్పగా ఆమె చికిత్సపొందుతూ మృతిచెందింది.

-అదే తరహాలో జూన్ 18న ఒంగోలు రూరల్ మండలం ఉలిచిలో ఓ వృద్ధురాలు రాత్రివేళ వరండాలో నిద్రిస్తుండగా దొంగలు మత్తు మందును ఇచ్చి ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు అపహరించుకు వెళ్లారు. తెల్లవారిన తర్వాత చుట్టుపక్కల వారు వచ్చి చూస్తే అప్పటికే వృద్ధురాలు మృతిచెంది ఉంది.

-కొత్తపట్నం మండలం మడనూరులో జూన్ 26న పట్టపగలు ఆళ్ల కృష్ణవేణమ్మ అనే వృద్ధురాలు ఇంట్లో ఒంటరిగా ఉండగా గుర్తుతెలియని మహిళ ఇంట్లో ఉన్న నిమ్మచెట్టు కాయలు కావాలని వచ్చింది. అక్కడ ఏమి జరిగిందో గాని కొద్దిసేపటికి వృద్ధురాలు స్పృహ కోల్పోయింది. ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. అక్కడ కూడా ఒంగోలు అంబేడ్కర్ భవనం వద్ద జరిగినట్లు బీరువా పగలకొట్టి ఉంది. అయితే కృష్ణవేణమ్మను ఆమె బంధువులు గుర్తించి ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం కోలుకుంది.

వృద్ధురాలికి మత్తు మందు ఇచ్చి దోపిడీ

తాజాగా పదిరోజుల క్రితం ఒంగోలులో మరో ఘటన చోటుచేసుకుంది. ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చిన ఓ మహిళ.. వృద్ధురాలికి మత్తు మందు ఇచ్చి ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దోచుకెళ్లింది. స్థానిక సమతానగర్‌లో వృద్ధురాలు(65) నివాసం ఉంటుంది. ఆమెకు ఇద్దరు సంతానం. ఆమె ఒక్కరే ఇంట్లో ఉంటుంది. ఇంట్లో మొదటి అంతస్థు ఖాళీగా ఉంది. ఈనెల 19వతేదీన ఓ మహిళ ఇల్లు అద్దెకు కావాలని వృద్ధురాలితో అడిగింది. ఆమె ఒంటరిగా ఉండటం గమనించింది. ఇల్లు చూసుకున్న తరువాత రేపు వస్తానని చెప్పి వెళ్లింది. మరుసటి రోజు తిరిగి వచ్చిన ఆ మహిళ, వృద్ధురాలితో మాటలు కలిపింది. ఆమెకు వేరుశనగ ముద్ద ఇచ్చి తినాలని చెప్పింది. తరువాత కొద్దిసేపటికి వృద్ధురాలు మత్తులోకి జారుకుంది. దీంతో ఆమె వద్ద ఉన్న ఆరు సవర్ల ఆభరణాలు తీసుకుని ఉడాయించింది. ఆరోజు సాయంత్రం వృద్ధురాలి ఇంట్లో లైట్లు వెలగకపోవడాన్ని ఇరుగు పొరుగు వారు గుర్తించి వెళ్లిచూడగా మత్తుగా పడుకొని ఉంది. ఈమేరకు సమాచారం ఇవ్వగా ఆమె కుమారుడు వచ్చి ఆసుపత్రికి తరలించారు. ఐదు రోజుల తరువాత స్పృహలోకి వచ్చిన వృద్ధురాలు జరిగిన విషయం చెప్పడంతో తాలూకా పోలీసులకు ఆమె కుమారుడు ఫిర్యాదుచేశాడు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీలను సేకరిస్తున్నారు.

ఆ మహిళ ఎవరు?

మడనూరులో కృష్ణవేణమ్మ ఇంటికి వచ్చిన గుర్తుతెలియని మహిళ ఎవరు అనేది ఇంతవరకు గుర్తించలేకపోయారు. దీనిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిమ్మకాయలు కావాలి అని వచ్చిన మహిళ వృద్ధురాలు స్పృహకోల్పోయిన తర్వాత ఆభరణాలు, నగదు కోసం బీరువా పగలకొట్టిందా అనేది అంతు చిక్కడం లేదు. మహిళతోపాటుగా ఇంకా ఎవరైనా ఉన్నారా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది. కాగా అదే తరహాలో ఒంగోలు సుజాతానగర్‌లోనూ దోపిడీ జరిగింది. ఇందులోనూ మహిళే వచ్చినట్లు వృద్ధురాలు చెబుతున్నారు. మడనూరు కేసులో మాత్రమే కొద్దిపాటి క్లూ పోలీసులకు దొరికింది. ఇలా వరస ఘటనలకు కారణం ఒకే ముఠానా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రజెండా.. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే..

ప్రభుత్వాలు మారుతున్నా పేదల బతుకులు మారడంలేదు

సీపీఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభలో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

చీరాలటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఎర్రజెండా ఎగురుతూనే ఉంటోందని, ప్రభుత్వాలు మారుతున్నా పేదల బతుకులు మారడంలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చెప్పారు. సోమవారం చీరాల పట్టణంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభ బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల శామ్యేల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ పదేళ్లుగా అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం పేదరికం, నిరుద్యోగ సమస్య పరిష్కారంవైపు కన్నెత్తి చూడలేదని ఆరోపించారు. రైతన్నలు కూడా సమస్యలతో కుమిలిపోతూ ఆవేదన చెందుతున్నట్లు చెప్పారు. బాలికలు, స్త్రీలపై దాడులు పేట్రేగిపోతున్నట్లు పేర్కొన్నారు. దేశమంతా పర్యటిస్తున్న ప్రధాని మోదీకు మణిపూర్ గోడు కానరాలేదా అని ప్రశ్నించారు. సాక్షాత్తు పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానిస్తే అధికార పార్టీ లేక ప్రతిపక్ష నేతలు ఎవరూ కూడా పన్నెత్తి మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. జగన్ పాపాలు శాపాలుగా మారి స్మార్ట్ మీటర్లు ఏర్పడినట్లు చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. వెంటనే స్మార్ట్ మీటర్లు నిరోధించాలని డిమాండ్ చేశారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను పరిష్కరించాలని కోరారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ జనవరి 2 నుంచి 10వ తేదీ వరకు అర్జీలు స్వీకరించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నట్లు చెప్పారు. స్థానిక వైద్యులు గుంటుపల్లి సుబ్బారావు మాట్లాడుతూ శ్రామికుల శ్రమను గుర్తించిన పార్టీ సీపీఐ అని చెప్పారు. ఇటీవల జాతీయస్థాయిలో అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన అడిగోపుల సాంబశివరావును సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెంకట సుబ్బయ్య, జిల్లా కార్యదర్శి తస్నీరు సింగరకొండ, మేడా వెంకటరావు, ఊటుకూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అమిత్‌షా రాజీనామా చేయాలంటూ వామపక్షాలు ర్యాలీ

మార్టూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించారంటూ సోమవారం మార్టూరులో వామపక్షాలు నిరసన ర్యాలీ నిర్వహించారు. వామపక్షాల మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో అమిత్‌షా రాజీనామా చేయాలి, క్షమాపణలు చెప్పాలని అంటూ నినాదాలిచ్చారు. ఈ కార్యక్రమంలో కందిమళ్ల రామకోటేశ్వరరావు, బత్తుల హనుమంతరావు, బోడెంపూడి సూరిబాబు, ఎనికపాటి రాంబాబు, మొఘల్ ఇబ్రహీం, మురుగుల చిన్నా, సుజాత పాల్గొన్నారు.

చినగంజాంలో...

చినగంజాం అంబేడ్కర్ సెంటర్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఎం నేత జి.ప్రతాప్‌కుమార్, రిక్షా కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.అనిల్, జి.పుల్లారావు, కె.రమేష్, జి.యాకోబు, ప్రకాష్, రవితేజ, జెస్సీబాబు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు



అంజన్నకు కదళీఫలార్చన సేవ

అద్దంకి, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా సోమవారం దశ సహస్ర కదళీఫలార్చన పూజ నిర్వహించారు. సోమవారం ఉదయం సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం పూజలు చేశారు. అనంతరం వేద పండితులు, అర్చకులు 11 ఆ వృత్తాలుగా 10 వేల అరటిపండ్లతో పూజ చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజలలో పాల్గొన్నారు.

2024.. భలే మార్పు

రాజకీయం పూర్తిగా మారిపోయింది. ఈ ఏడాదిలో పాలకులు మారటమే కాదు పాలన తీరుతెన్నులు మారిపోయాయి. నేతల్లో కొందరికి చేదు అనుభవాలు ఎదురైతే మరికొందరికి రాజసం దక్కింది. ఇంకొందరిని అదృష్టదేవత వరించింది. తద్వారా ఉమ్మడి ప్రకాశం జిల్లా రాజకీయ పుటల్లో 2024 ఒక ప్రత్యేక స్థానాన్ని పొందగలిగింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ఏడాది ఆరంభంలో ప్రజలను భయకంపితులను చేసిన భూఆక్రమణలు, రాజకీయ పైరవీలు, అక్రమకేసులు, రాజకీయ రౌడీయిజం లాంటి ఘటనలు కరుమరుగై సహజసిద్ధమైన పాలన వచ్చింది. వ్యవస్థలన్నీ గాడిలో పడ్డాయి. ఇందుకు పోలీసు శాఖనే నిదర్శనం. తారుమారైన రాజకీయ నాయకుల చరిత్రలు అంతకుమించి పాలక పక్షంలో జిల్లాకు అత్యధిక పదవులు దక్కటం ముఖ్యమైన రాజకీయ ఘట్టంగా చెప్పుకోవచ్చు.

- తారుమారైన రాజకీయం
- అనూహ్య విజయాలు కూటమి సొంతం
- జిల్లాలో టీడీపీకి పూర్తి ఆధిక్యత
- వైసీపీకి ఊహించని ఎదురుదెబ్బ
- పట్టు కోల్పోయిన ఆ పార్టీ నేతలు
- కీలక నాయకులకు కలసిరాని కాలం
- మారిన పాలన తీరుతెన్నులు
- గాడిలో పడిన అన్ని వ్యవస్థలు
- పదవులలోనూ జిల్లా ప్రాధాన్యం
- చాలా ప్రత్యేకమైన ఏడాది ఇది

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లా ఏర్పాటు అనంతరం పరిశీలిస్తే ఈ ఏడాది రాజకీయంగా చాలా ప్రత్యేకమైంది. రమారమీ రెండు దశాబ్దాల అనంతరం ఉమ్మడి జిల్లాలో తెలుగుదేశం పార్టీకి పూర్తి ఆధిక్యత లభించగా ఒంగోలు లోక్‌సభ లాంటి స్థానంలో 25 ఏళ్ల అనంతరం ఆ పార్టీ జెండా ఎగరటం విశేషం. అదేసమయంలో అనూహ్య పరాజయాలతో వైసీపీ పునాదులు కూడా కదిలిపోయాయి. 1983-85, 94నాటి విజయాల కన్నా ఈ ఏడాదిలో ఉమ్మడి జిల్లాలో టీడీపీకి లభించిన విజయం ఘనమైనదంటే అతిశయోక్తి కాదు. అలాగే పులివెందుల తరహా పటిష్ట స్థానంగా భావించిన ఒంగోలు లోక్‌సభ స్థానంలో, గత ఎన్నికల్లో 80వేలకు పైబడిన ఆధిక్యత సాధించిన గిద్దలూరు అసెంబ్లీలో వైసీపీ కలలో కూడా ఊహించని చేదు అనుభవాలను ఎదుర్కొంది. నాయకులుగా చాలామందికి ఈ ఏడాది కలిసిరాగా కరణం బలరాం, బాలినేనిలాంటి కీలక నేతలు పరాజయం పాలయ్యారు. జిల్లాతో విడదీయరాని అనుబంధం ఏర్పర్చుకున్న మాగుంట కుటుంబ వారసురాల్లో ఒకరైన మాజీ ఎంపీ పార్వతమ్మ కన్నుమూయటం విషాదం. అదే కుటుంబానికి చెందిన శ్రీనివాసులరెడికి అదృష్టం కలిసొచ్చి మళ్లీ పార్లమెంట్‌కు వెళ్లగలిగారు. దామచర్ల సత్య, బాలాజీ, దినకర్, మర్రెడ్డి, విజయ్‌కుమార్‌లాంటి ఎందరో అధికార అందలం ఎక్కగలిగారు. గొట్టిపాటి రవి, స్వామిలు అమాత్యులుగా జిల్లాలో కీలక నాయకులుగా మారగా కొత్తగా శాసనసభలో అడుగుపెట్టాలని తహతహలాడిన ఒకరిద్దరిని అదృష్టం వరించగా ఒకరిద్దరిని దురదృష్టం వెంటాడింది

మారిన పరిస్థితులు

ఒంగోలు, మార్కాపురం, కనిగిరి డివిజన్ ప్రాంతాల్లో భూఆక్రమణలు వాటిపై సిట్ ఏర్పాటు, వేధింపులు, గ్రానైట్ రంగంలో కడప నుంచి జిల్లాకు దిగుమతి అయిన జగన్ గ్యాంగ్ ఆగడాలు, ప్రజాప్రతినిధుల హంగూ ఆర్భాటాలు ఈ ఏడాది ప్రారంభంలో కనిపించిన దృశ్యాలు. ఈ ఏడాది మే నెలలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మార్పుతో ఆ పరిస్థితులన్నీ తారుమారై అక్రమ కేసులు లేవు. హత్యలు లేవు. రాజకీయ వేధింపులు లేవు. భూఆక్రమణలు కనిపించటం లేదు. జూదాలు బదులు గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం, వెరసి రాజకీయ వేధింపుల విముక్తితో ప్రజలు, ఉద్యోగులకు ప్రశాంత జీవితం ప్రారంభమైంది.

రవికుమార్, స్వామిలకు అందలం

ఈ ఏడాది ప్రారంభంలో ఎమ్మెల్యేలుగా ఉన్నప్పటికీ ప్రభుత్వ వేధింపులతో ఇబ్బందుల్లో ఉన్న గొట్టిపాటి రవికుమార్, స్వాములు మళ్లీ గెలవటమే కాక ప్రాధాన్యత కలిగిన శాఖలకు మంత్రులయ్యారు. అంతేకాక ముఖ్యమంత్రికి నమ్మకస్తులైన మంత్రులుగా మనగలగటం విశేషం.

గెలిచినా కలిసిరాని కాలం

ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకించి టీడీపీలో గెలిచినా పర్చూరు, ఒంగోలు ఎమ్మెల్యేలకు కాలం కలిసిరాలేదు. ముఖ్యంగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ విజయం సాధించటంతోపాటు గడిచిన ఐదేళ్లు బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా పార్టీ బండిని ముందుకు లాగారు. కానీ ఆయన ఎమ్మెల్యేగానే మిగిలారు. ఆ జిల్లా నుంచి ఇద్దరు మంత్రులయ్యారు. ప్రకాశం జిల్లాలో క్లిష్ట సమయంలో పార్టీ బాధ్యతలు మోసిన దామచర్ల జనార్దన్ ఒంగోలు ఎమ్మెల్యేగా మంచి విజయం సాధించినా అదనపు పదవులు దక్కలేదు.

ఉగ్ర, అశోక్‌లకు గుర్తింపు

తెలుగుదేశం పక్షాన గెలుపొందిన వారిలో కనిగిరి, గిద్దలూరు ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, అశోక్‌రెడ్డిల గెలుపులకు మంచి గుర్తింపు లభించింది. నిజానికి ఆ ఇద్దరు పోటీ చేసిన స్థానాలు వైసీపీకి బలమైన వైనప్పటికీ టీడీపీ గెలుపులో కూటమి పార్టీల అనుకూల వాతావరణంతో పాటు ఆ ఇద్దరు నాయకుల వ్యక్తిగత కృషి దాగుందనే విషయాన్ని అధిష్ఠానం గుర్తించి ప్రోత్సహించటం విశేషం.

మాగుంటను వరించిన అదృష్టం

అప్పట్లో కాంగ్రెస్‌కు ప్రస్తుతం వైసీపీకి పులివెందుల తర్వాత ఆ స్థాయిలో ఒంగోలు లోక్‌సభ స్థానం బలమైందిగా పేరుంది. అందునా మాగుంట కుటుంబం నుంచి శ్రీనివాసులరెడ్డి ఎంపీగా ఉండటం కూడా కలిసొచ్చింది. కానీ జగన్ చేసిన పొరపాటో, మాగుంట అదృష్టమో గాని వైసీపీ టిక్కెట్ నిరాకరణతో టీడీపీలో చేరారు. కూటమి పార్టీల వేవ్‌లో రెండున్నర దశాబ్దాల అనంతరం టీడీపీ తరపున ఆయన గెలవటం విశేషం.

పదవుల ప్రాధాన్యత

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పాలక పదవులు ఉమ్మడి జిల్లాకు అధికంగా దక్కాయి. ఉమ్మడి జిల్లాలో ఇద్దరికీ అందునా కీలకమైన టీడీపీ నుంచే మంత్రి పదవులు దక్కటమే విశేషంగా భావించారు. ఆ తర్వాత నామినేటెడ్ పదవుల భర్తీలో తొలి జాబితాలోనే నాలుగు కీలకమైన కార్పొరేషన్లు దక్కాయి. దామచర్ల సత్యా, లంకా దినకర్ లాంటి వారు తొలిసారిగా ప్రభుత్వ పదవులను అలంకరించగలిగారు.

అస్తమించిన పార్వతమ్మ

జిల్లాలో ప్రత్యేకించి ఒంగోలు లోక్‌సభలో తమదైన ముద్ర వేసుకున్న మాగుంట కుటుంబ తొలి వారసురాలు దివంగత ఎంపీ సుబ్బరామరెడ్డి సతీమణి పార్వతమ్మ ఈఏడాదిలోనే అస్తమించారు.

బాలినేని, కరణం, ఆదిమూలంకు కలిసిరాలేదు

బాలినేని, కరణం, ఆదిమూలంకు కలిసిరాని కాలంగా చెప్పవచ్చు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల మంత్రిగా పనిచేసిన ఆదిమూలపు సురేష్‌కు శాసనసభకు ఎన్నికయ్యే అవకాశం కూడా దక్కలేదు. వివిధ రకాలుగా ఆయా సందర్భాల్లో జిల్లా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన మాజీ మంత్రి బాలినేని ఈ ఏడాది ఆరంభానికి ఎమ్మెల్యేలుగా ఉన్న కరణం బలరాంలు మాజీలయ్యారు. మాజీ మంత్రి మహిదర్‌రెడ్డికి తాను అంటిపెట్టుకున్న వైసీపీలో పోటీచేసే అవకాశమే దక్కలేదు. గతంలో రాష్ట్రంలో రెండవ ఘనవిజయం సాధించిన అన్నా రాంబాబుకు చేదు అనుభవం ఎదురైంది. ఎక్కడ నుంచో వచ్చి ఒంగోలు లోక్‌సభకు పోటీచేసిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. అనుహ్యంగా టిక్కెట్ దక్కించుకున్న చంద్రశేఖర్‌కు ఎర్రగొండపాలెం ఎమ్మెల్యేగా గెలుపొందటం అదృష్టమే. గతంలో పలు చేదు అనుభవాలను ఎదుర్కొన్న ఎంఎం కొండయ్య యాదవ్ చీరాల ఎమ్మెల్యే కాగా చివర్లో టిక్కెట్ దక్కించుకున్న ఇంటూరు నాగేశ్వరరావు కందుకూరు ఎమ్మెల్యే కాగలిగారు. క్లిష్టమైన నియోజకవర్గంలో అదృష్టాన్ని పరీక్షించుకున్న యువ నాయకులు ఎరిక్షన్‌బాబు, కుటుంబ నేపథ్యంతో రంగంలోకి వచ్చిన గొట్టిపాటి లక్ష్మీలకు అదృష్టం కలిసికాక ఓటమిపాలయ్యారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

అద్దంకి, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మణికేశ్వరంలో కృష్ణ మిల్క్ యూనియన్, విజయ డెయిరీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బోనస్ పంపిణీ చేశారు. ఆగస్టు నుంచి నవంబరు వరకు 7 శాతం చొప్పున బోనస్ పంపిణీ చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోఒక కోటి యాభై మూడు లక్షల రూపాయలు పాడి రైతులకు బోనస్ కింద పంపిణీ చేశామని జిల్లా మేనేజర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ తరుణ్, గాలిబ్‌బాషా పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఫసల్ బీమా గడువు

పీసీపల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా నమోదు గడువు మంగళవారంతో ముగుస్తుందని మండల వ్యవసాయ అధికారి కె.ప్రకాశరావు తెలిపారు. రబీ సీజన్‌లో వరి, శనగ, మొక్కజొన్న, మిర్చి పంటలను సాగుచేసిన రైతుల్లో ఇప్పటివరకు బీమా చేయించుకోనివారు ఈనెల 31వతేదీ సాయంత్రంలోగా బీమా చేయించుకోవాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు బీమా వర్తించాలంటే ఈపంట నమోదుతో పాటు ప్రతిరైతు తప్పనిసరిగా ఫసల్ బీమా నమోదు చేయించుకోవాలన్నారు.

26 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం

ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు

చీరాలటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్యం పాలసీను పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు చెప్పారు. సోమవారం దాడులు నిర్వహించి అక్రమ మద్యం రవాణాకు పాల్పడుతున్న వారిలో ఒకరిని చీరాల గడియార స్థంభం కూడలిలో, మరొకరిని పాతచీరాల రైలు గేటు సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. అలాగే ఇరువురి వద్ద 26 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్సై శ్రీహరి పాల్గొన్నారు.



పట్టుబడిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

డ్రోన్‌తో పంటలపై పురుగుమందుల పిచికారీ

సాంకేతిక పరిజ్ఞానం వైపు అన్నదాతల అడుగులు

కూలీల కొరతను అధిగమించే విధంగా చర్యలు

పర్చూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) కూలీల కొరతను అధిగమించే విధంగా అన్నదాతలు సాంకేతిక పరిజ్ఞానం వైపు అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా డ్రోన్ల సహాయంతో క్రిమి సంహారక మందులు పిచికారీ చేయించే విధంగా చర్యలు చేపడుతున్నారు. దీంతో సమయంతోపాటు, కూలీల కొరతను అధిగమించవచ్చని అన్నదాతలు చెబుతున్నారు. ఏదిఏమైనా వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం రైతులకు మరింత ఊరట లభిస్తుంది అనటంలో ఎలాంటి సందేహం లేదు.



పర్చూరులో శనగ పైరులో క్రిమిసంహారక మందును పిచికారీ చేస్తున్న డ్రోన్

అవీఇవీ

భర్త మృతికి కారకులైన వారిని శిక్షించాలంటూ ఎస్పీకి ఫిర్యాదు

బాపట్లరూరల్,డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తన భర్త మృతికి కారకులైన వారిని ఇంత వరకు శిక్షించలేదంటూ వారికి శిక్షపడేలా చూడాలంటూ సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో బల్లికురవ మండలం జమ్ములమడక గ్రామానికి చెందిన చింతల బాలకోటమ్మ అర్జీని ఎస్పీకి అందజేశారు. అనంతరం ఎస్పీ కార్యాలయం ఎదుట విలేకర్లతో మాట్లాడుతూ మన్నెపల్లి వెంకటేశ్వర్లు, మన్నెపల్లి మారుతీరావు, కనపర్తి అర్జున్,పరిమి సుబ్బారావు అనే నలుగురు తన భర్తను వేధింపులకు గురిచేయటంతో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయంపై అద్దంకి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ నేరస్థులను అరెస్ట్ చేయలేదు. కావున నా భర్త మరణానికి కారణమైన వీరిని అరెస్ట్ చేయాలని ఎస్పీకి ఫిర్యాదు ఇవ్వటం జరిగిందని తెలిపారు.

నివాస స్థలంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

బాపట్లరూరల్,డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తన నివసిస్తున్న నివాస స్థలం కొంతమంది బెదిరించి ఆక్రమించాలని చూస్తున్నారంటూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఇంకొల్లు మండలం సూదివారిపాలెంకు చెందిన పి.నాగమల్లేశ్వరి అర్జీని కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో బాధితురాలు విలేకర్లతో మాట్లాడుతూ తమ గ్రామ ఎస్టీకాలనీలో గత 25 సంవత్సరాల క్రితం ప్రభుత్వం తనకు ఇంటి స్థలాన్ని మంజూరు చేశారు. ఆ స్థలంలో ఇల్లుకట్టుకొని ముగ్గురు ఆడపిల్లలతో నివాసం ఉంటున్నానని చెప్పారు. ఇప్పుడు దేవరకొండ ప్రశాంత్, యు.శ్రీను, యు.గోపి, యు.ఆదిశేషు, దేవరకొండ వేణులు వచ్చి నువ్వు నివసిస్తున్న స్థలాన్ని ఐదేళ్ల క్రితం మేము కొన్నాం.. ఖాళీ చేయండి అని బెదిరిస్తున్నారు. సంబంధిత అధికారులు తమ సమస్యకు పరిష్కారం చూపి వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీ ఇచ్చామని తెలిపారు.

సమస్యల పరిష్కారం కోరుతూ రోడ్డెక్కిన లాయర్లు

నేడు పెన్‌డౌన్...




నిరసన చేస్తున్న న్యాయవాదులు

చీరాలటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సమస్యలకు పరిష్కారం కోరుతూ చీరాల న్యాయవాదులు రోడ్డెక్కారు. ఇటీవల కాలంలో అనంతపురం జిల్లాలో పోలీస్ స్టేషన్‌లో న్యాయవాది మృతి, మరో ఘటనలో న్యాయవాది కాలర్‌ను ఓ సీఐ పట్టుకుని లాగిన విషయాలను ఉదహరిస్తూ సోమవారం పట్టణంలో ఆందోళన బాటపట్టారు. బాధితుల పక్షాన నిలిచి న్యాయ పోరాటాలు చేస్తున్న న్యాయవాదులకు రక్షణ కరువైందన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం విధులను బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వేడుకలకు అనుమతులు తప్పనిసరి

చీరాలటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ తెలిపారు. బహిరంగ ప్రదేశాలు, రహదారుల్లో అనుమతులు లేకుండా లౌడ్ స్పీకర్లు, డీజేలు, మ్యూజిక్ సిస్టంలతో పాటు నిర్వహించే కార్యక్రమాలకు అనుమతులు ఉండాలన్నారు.

రాష్ట్ర స్థాయిలో కొప్పెరపాడు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థికి నగదు బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

బల్లికురవ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయిలో కౌశల్ 2024 క్విజ్ పోటీలు సోమవారం విజయవాడలో జరిగాయి. ఈ పోటీల్లో అన్ని జిల్లాల నుంచి 52 టీంలు పాల్గొన్నాయి. వీరిలో బాపట్ల జిల్లా తరపున క్విజ్ పోటీల్లో బల్లికురవ మండలం కొప్పెరపాడు ఉన్నత పాఠశాలకు చెందిన బత్తుల అభిరామ్ ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి కౌశల్ తరపున నిర్వాహకులు రూ.15 వేల నగదుతోపాటు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా అభిరామ్‌ను ఎంఈవో వస్త్రంనాయక్, హెచ్‌ఎం శ్రీనివాసరావు అభినందించారు.

విద్యార్థులు మానసికంగా బలంగా ఉండాలి

మార్టూరు, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే కోరుకున్న స్థాయికి చేరగలరని వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టరు రాజఅనిరుద్ చెప్పారు. మండలంలోని ద్రోణాదుల జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజఅనిరుద్ పలు అంశాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పోతురాజు, నిర్వాహకులు రామాంజనేయులు, పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

యద్దనపూడి/మార్టూరు, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాలను నిరోధించడంతోపాటు వాటిని ఎవరూ ప్రోత్సహించవద్దని పర్చూరు ఐసీడీఎస్ సీడీపీవో సుభద్ర చెప్పారు. యద్దనపూడి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కిషోర్ వికాసం కార్యక్రమానికి ఈవోఆర్‌డీ కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లెక్చరర్ విజయలక్ష్మి, వెలుగు ఏపీవో వెంకటరావు, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి శ్రీహర్ష పాల్గొన్నారు.

15వ తేదీలోపు రేషన్ డీడీలు చెల్లించాలి

పంగులూరు, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా 15వ తేదీలోపు డీడీలు చెల్లించాలని తహసీల్దారు పోపూరి సింగారావు చెప్పారు. సోమవారం మండల తహసీల్దారు కార్యాలయంలో జరిగిన ఎండీయూ ఆపరేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు.

నూతన సంవత్సర వేడుకలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

చినగంజాం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలకు నిర్వాహకులు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్.ఐ శీలం రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లౌడ్ స్పీకర్లు, మ్యూజిక్‌లు ఉపయోగించేందుకు తప్పనిసరిగా పోలీసు అధికారి నుంచి అనుమతి పొందాలని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగడం, పేకాట ఆడవద్దని తెలిపారు. వాహనాల సైలెన్సర్‌లు తీసి వేగంగా నడపడం, హారన్ అదేపనిగా మోగించడం, ర్యాంగ్ రూట్లలో డ్రైవ్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక అక్రమ రవాణాపై పోలీసు యంత్రాంగం అప్రమత్తం



తనిఖీ చేస్తున్న ఎస్సై

ఈపూరుపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో ఇసుకు అక్రమ రవాణా సంఘటనలకు సంబంధించి చీరాల మండలం బోయినవారి పాలెంలో వివాదం తలెత్తింది. ఈనేపధ్యంలో విచారణ జరిపిన జిల్లా కలెక్టర్ వెంకట మురళీ ముగ్గురు అధికారులను సోమవారం సస్పెండ్ చేశారు. ఇదిలా ఉంటే ఉన్నతాధికారుల నుండి అందిన కచ్చితమైన ఆదేశాలతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఈనేపథ్యంలో బోయినవారి పాలెంలో ఇసుక క్వారీల సమీపంలో ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఇసుక రవాణాకు పాల్పడితే కఠినమైన చర్యలు ఉంటాయని ఈసందర్భంగా అధికారులు చెబుతున్నారు.

మోక్షం లభించేనా?







● కొప్పెరపాడు-వెలమవారిపాలెం రోడ్డు పూర్తి అధ్వానస్థితికి చేరింది. ఇటీవల వర్షాలకు మరింత దెబ్బతింది. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్డు మరమ్మతులకు మోక్షం లభించేనా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రోడ్డు మరమ్మతులకు ఒక తట్ట మట్టి కూడా పోయలేదు. అద్దంకి-నార్కెట్‌పల్లి రోడ్డు కొప్పెరపాడు గ్రామకూడలి నుంచి కొత్తూరు, వెలమవారిపాలెంతోపాటు వెంపరాల వరకు ఉన్న తారురోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. అడుగడుగునా మోకాటి లోతు గోతులు ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే ఈ రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. - బల్లికురవ

అద్దంకిలో మూడు గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం

రాజీవ్‌కాలనీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా జరిగే విద్యుత్ లైన్ మరమ్మతులతో నిలిచిన సరఫరా



అద్దంకిలో చీకట్లో నిర్వహిస్తున్న టీ దుకాణాలు

అద్దంకి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో సుమారు 3 గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శింగరకొండ రోడ్డులోని సబ్‌స్టేషన్ వద్ద నుంచి రాజీవ్ కాలనీ సబ్‌స్టేషన్ వద్దకు ఉన్న విద్యుత్ లైన్ సోమవారం వేకువజామున 3 గంటల సమయంలో మరమ్మతులకు గురైంది. రాత్రి సమయం కావటంతో మరమ్మతులకు గురైన ప్రాంతం గుర్తించేసరికి తెల్లవారుజామున 5-45 గంటల సమయమైంది. దీంతో సుమారు 3 గంటల పాటు పట్టణంలోని సగభాగం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అకస్మాత్తుగా 3 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో వినియోగదారులు విద్యుత్‌శాఖ అధికారులకు, విద్యుత్ కార్యాలయానికి ఫోన్లు చేసి కనుక్కున్నారు.



భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి

బల్లికురవ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలు లేకుండా ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేకు రైతులు సహకరించాలని డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ కోరారు. సోమవారం మండలంలోని గుంటుపల్లిలో చేపట్టనున్న రీసర్వేపై రైతులతో గ్రామసభ జరిగింది. ఈసందర్భంగా డీటీ మాట్లాడుతూ రైతులు సర్వే చేసే భూముల వద్దకు తమ వద్దఉన్న హక్కు పత్రాలను తీసుకురావాలన్నారు. అన్ని సర్వే నెంబర్లను వరుస క్రమంలో కొలతలు వేస్తామని చెప్పారు. సభలో సర్వే డీటీ ప్రహర్ష, వీఆర్వో రామకృష్ణ పాల్గొన్నారు.

పర్చూరులో...

పర్చూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణాయపాలెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, ఎంఎస్ బాలాంజనేయులు, ఆర్ఐ బి.ప్రేమ్‌కుమార్, వీఆర్వో అనూష, వియో ఎ.నాయక్, పాల్గొన్నారు.

భూముల రీ సర్వే కోసం దరఖాస్తుచేసుకోండి

మార్టూరు, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు రవికుమార్ చెప్పారు. యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ విష్ణు, మండల సర్వేయరు సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి భాగ్యరాజు, వీఆర్వో వసంతరావు పాల్గొన్నారు. మార్టూరు మండలంలోని జొన్నతాళి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 5 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు ప్రశాంతి చెప్పారు. ఈ కార్యక్రమంలో డీటీ నాగలక్ష్మి, మండల సర్వేయరు ఏడుకొండలు పాల్గొన్నారు.



రమణాయపాలెంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

అమృత్ సరోవర్ నీటి కుంట పనులు ప్రారంభం



ముక్తేశ్వరంలో నీటి కుంట పనులు చేస్తున్న కూలీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బల్లికురవ. డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో గతంలో ఉపాధి హామీ పథకంలో మంజూరైన నిధులతో నీటి కుంట పనులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం అజాదీకా అమృత్ సరోవర్ ద్వారా ప్రజల అవసరార్థం గ్రామాలలో నీటి కుంటల ఏర్పాటుకు నిధులను మంజూరు చేసింది. ఉపాధి హామీ పథకంలో ముక్తేశ్వరానికి రూ.25 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో పనులు మొదలు పెట్టి నిలిపివేశారు. రెండు రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో నీటి కుంట జాడేదీ అనే కథనం ప్రచురితం కావటంతో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పనులు చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉపాధి కూలీలచేత పనులు మొదలుపెట్టారు. ఈ కుంట పనులు పూర్తి అయితే పొలాలకు వెళ్లిన పశువులకు నీటి అవసరాలు తీరుతాయని రైతులు అంటున్నారు.

మేళాను సద్వినియోగం చేసుకోవాలి

అవీఇవీ



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ కె.బీరయ్య

అద్దంకిటౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలను నిరుద్యోగ, యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె. బీరయ్య చెప్పారు. సోమవారం శింగరకొండరోడ్డులోని సాయిబాబా ఐటీఐ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలకు వివిధ కంపెనీలు రాగా 35 నిరుద్యోగులు హాజరయ్యారు. వీరిలో 17 మంది ఉద్యోగాలకు ఎంపిక అయినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి. ప్రణయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి. శ్రీనివాస్, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ గోపీనాథ్, ఈఎస్‌సీ కోఆర్డినేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పది విద్యార్థులకు మోడల్ పేపర్స్, బుక్స్ అందజేత



మోడల్ పేపర్స్ బుక్స్ అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మండలంలోని మైలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్స్ బుక్స్‌ను అందజేశారు. దాత మలాది శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో విద్యార్థులకు మోడల్ పేపర్స్‌ను అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేశ్వరరావు, రోటరీ కార్యదర్శి మురళి సుధాకరరావు, శేషారెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ భీమని కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పర్చూరులో...

పర్చూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని ఆమంచి నరసింహం, వెంకట సుబ్బమ్మ బాలికల పాఠశాలలోని పదో తరగతి విద్యార్థినులకు సోమవారం ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను రొటేరియన్ కోటా శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం అవని, పాఠశాల కరస్పాండెంట్ క్రిష్టంశెట్టి రమేష్ బాబు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి రూ.లక్ష విరాళం



నగదును అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

పర్చూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) దాతల సహకారంతో రూపుదిద్దుకుంటున్న పర్చూరు హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి పర్చూరు రోటరీ క్లబ్ రూ.లక్ష విరాళం అందజేసింది. ఈసందర్భంగా స్థానిక రోటరీ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో క్లబ్ ప్రతినిధులు లక్ష రూపాయలను నగదును శ్మశానవాటిక అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కఠారి సురేంద్రబాబు, ఒగ్గిశెట్టి గోవిందరాజులకు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ మంగళగిరి కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో రోటరీ క్లబ్ చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు కొల్లా నరేంద్రకుమార్, నాగభైరు శ్రీనివాసరావు, కోటా హరిప్రసాద్, తేళ్ల రమేష్‌చంద్ర, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రం, పంబి సదానందరెడ్డి, మహాప్రస్థానం ప్రతినిధులు ఒగ్గిశెట్టి నరసింహారావు, కృష్ణంశెట్టి శ్రీనివాసరావు, తులసి శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మృతిచెందిన సభ్యులకు యూటీఎఫ్ అండ

పంగులూరు, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో మృతిచెందిన యూటీఎఫ్ సభ్యులైన ఉపాధ్యాయ కుటుంబాలకు యూటీఎఫ్ అండగా ఉంటోందని ఆ సంఘ రాష్ట్రగౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు చెప్పారు. ఇటీవల మండల శాఖ అధ్యక్షుడు, టీటర్ తోట నరసింహారావు ఆకస్మికంగా మృతిచెందడంతో సోమవారం మండలంలోని రేణంగివరంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సంతాపసభ నిర్వహించారు. సభకు ప్రధానోపాధ్యాయులు సందిరెడ్డి శ్రీహరి అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ నరసింహారావు కుటుంబానికి యూటీఎఫ్ సంక్షేమనిధి నుంచి రూ.1.50 లక్షల చెక్కును అందచేశామన్నారు. కార్యక్రమంలో పూనాటి హరిబాబు, యు చెంచయ్య, ఎస్ ప్రసాద్, వైద్యులు హనుమంతరావు, తలపనేని రామారావు, జి మల్లారెడ్డి, బి రవిచంద్ర, రంగా శ్రీనివాసరావు, టి వెంకట్రావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి



తీవ్రంగా గాయపడ్డ తిరుపతి నాగరాజు

అద్దంకి,డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు మండలంలోని చక్రాయపాలెంకు చెందిన తిరుపతి నాగరాజు(26) మోటార్‌సైకిల్‌పై సోమవారం రాత్రి శింగరకొండ వైపు నుండి చక్రాయపాలెం వెళ్తుండగా భవనాసి చెరువు కట్ట వద్ద నామ్ రోడ్డులోకి వెళ్లే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పోలీస్‌లు పరిశీలించారు. నాగరాజు చేపలవేట, కూలి పనులకు వెళ్ళి జీవనం సాగిస్తుంటాడు. ఇంకా వివాహం కాలేదు. కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

మేదరమెట్ల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డువానిపాలెం వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బొడ్డువానిపాలెంలో సోమవారం గ్రామానికి చెందిన దుడ్డు గౌతమ్(4) అనే బాలుడు తాత నాగయ్యతో కలిసి ద్విచక్రవాహనంపై బొడ్డురాయి దగ్గరకు వచ్చారు. అదే దారిలో వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో బైక్‌పై ఉన్న తాత మనుమడును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గౌతం తలకు తీవ్ర గాయాలు కావడంతో ఒంగోలు హాస్పిటల్‌కు తరలించారు. బాలుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. తాతనాగయ్య ఫిర్యాదు మేరకు కొరిశపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హమ్మయ్య.. లాగేశారు!

- 'రాళ్లపాడు'లో స్టాప్‌లాక్ గేటు వెలికితీత
- మరమ్మతు చేసి మరలా బిగించనున్న అధికారులు
- మూడు వారాల సందిగ్ధతకు తెర

4 లో..

పారిశ్రామిక విప్లవం తెస్తా

2025వ సంవత్సరం పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి చెందుతుంది అనడానికి బీపీసీఎల్ పరిశ్రమ రావడమే నిదర్శనం. చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో రూ.95వేల కోట్లతో ఆ పరిశ్రమకు అనుసంధానంగా మరో 15 అనుబంధ పరిశ్రమలు రాబోతున్నాయి. ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లాలో పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొని రావడానికి నా వంతు కృషి చేస్తున్నా. ఇప్పటికే పలు కంపెనీలు జిల్లాలో ఏర్పాటుకు అంగీకరించాయి. ఈసీఐఎల్ హాస్పిటల్ ఏర్పాటుకు స్థల సేకరణ పూర్తి అయ్యింది. బిట్రగుంట రైల్వే స్టేషన్ అభివృద్ధికి, అక్కడ రైల్వే అనుబంధ పరిశ్రమలు రావడానికి కేంద్ర మంత్రులతో చర్చిస్తున్నాను. మిథానీ గురించి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకెళ్లాను. ఆయన సానుకూలంగా స్పందించారు. పలు కేంద్ర ప్రాజెక్టులు జిల్లాకు తీసుకురావడానికి కృషి చేస్తున్నాను. కేంద్ర పథకాల ద్వారా జిల్లాకు అదనపు నిధులు తీసుకొచ్చే ప్రయత్నాలు మొదలు పెట్టాను. జిల్లా అభివృద్ధికి కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలను తీసుకురావడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా. అభివృద్ధి ద్వారా నన్ను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటా.



- వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, నెల్లూరు ఎంపీ

నిరుపేద పిల్లలకు అత్యున్నత విద్య

2025లో నా మొదటి ప్రాధాన్యత నిరుపేద విద్యార్థులకు అత్యున్నతమైన విద్య అందించడం. విద్యాసంవత్సరం ఆరంభం నుంచే నెల్లూరు వీఆర్ హైస్కూలు ప్రాంగణంలో 2 వేల మంది పిల్లలకు ఉచిత విద్య, భోజన వసతి కల్పించడం. ఉత్తమ విద్యతోపాటు పిల్లలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, స్కూలు బస్సు సౌకర్యం అన్నీ ఉచితంగానే అందిస్తాం. అంత గొప్పగా ఉండబోతోంది. వ్యక్తిగతంగా కూడా ఇది నాకు, కూటమి ప్రభుత్వానికి చాలా సంతోషాన్ని కలిగించే విషయం. ఇక నెల్లూరు సిటీకి సంబంధించి కొన్ని ముఖ్యమైన పనులు పూర్తి చేయాలి. భూగర్భ డ్రైనేజీ, ఇంటింటికి శుద్ధి జలం పంపిణీ పనులు పూర్తి చేస్తాం. నగరంలోని పార్కులన్నీ అభివృద్ధి చేస్తాం. పేదల కోసం టిడ్కో ఇళ్ల నిర్మాణం. నెల్లూరు నగరంలో సొంత ఇల్లు లేని పేదలు ఉండకూడదు అనేది నా సంకల్పం. ఈ లక్ష్య సాధనలో 2025లో పెద్ద సంఖ్యలో పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలన్నది నా కోరిక.



- పొంగూరు నారాయణ, మున్సిపల్ శాఖ మంత్రి, నగర ఎమ్మెల్యే

సంక్షేమం, అభివృద్ధి... ఈ రెండు ఎన్డీఏ కూటమి లక్ష్యం. ఆ లక్ష్యసాధనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుండగా, అందుకు అనుగుణంగా తమ ప్రాంత అభివృద్ధి కోసం జిల్లా ప్రజాప్రతినిధులు కంకణబద్ధులయ్యారు. కాంగ్రెస్, ఆ తరువాత వైసీపీకి కంచుకోటలాంటి జిల్లాలో ఎన్డీఏ కూటమి తరఫున బరిలో నిలిచిన టీడీపీ అభ్యర్థులను ప్రజలు గెలిపించారు. పజల అభిమానాన్ని, తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ఎంపీ, ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల పరిధిలో అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. వైసీపీ హయాంలో చతికిలపడ్డ ప్రగతిని తిరిగి పట్టాలెక్కించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి.. జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు శ్రమిస్తామని ప్రతిన బూనుతున్నారు. 2025లో తమ లక్ష్యాలను 'ఆంధ్రజ్యోతి'తో అభిప్రాయాలను పంచుకున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం

2025 ప్రణాళిక.. ఆచరణ

- కొత్త ఏడాది లక్ష్యాలు వివరించిన ప్రజాప్రతినిధులు
- ప్రగతి పరుగు.. సంక్షేమానికి మెరుగు



వ్యవసాయం, రహదారులు, పరిశ్రమలే ప్రాధాన్యం

గతంలో ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఇక్కడ నేను చేసిన అభివృద్ధి పనులు అన్నీ అర్ధంతరంగా ఆగిపోయాయి. వాటిని పూర్తి చేయాలన్నది నా 2025 లక్ష్యం. ఆత్మకూరు రింగ్‌రోడ్డు పనులు నా హయాంలో 50శాతం పూర్తి అయ్యాయి. దీనిని పూర్తి చేయాలి. ఆత్మకూరు ఆసుపత్రి జిల్లా ఆసుపత్రిలో పడకల సంఖ్య 250కి పెంచాలి. ఆత్మకూరుకు తాగునీటి శాశ్వత పరిష్కారం కల్పించాలి. ఇప్పుడు నీరు అందిస్తున్నాము. కానీ అవి చాలడం లేదు. కెపాసిటీ పెంచాలి. సోమశిల హైలెవల్ కెనాల్ పనుల్లో వేగం పెంచాలి. ఆత్మకూరు టు అనంతసాగరం రహదారిని నేషనల్ హైవేగా మార్పు చేసి విస్తరించాలి. ఆత్మకూరులో ఇంజనీరింగ్ కాలేజీ లేదా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఈ రెండింటిలో ఏది ఎక్కువ ఉపయోగమో దానిని ఏర్పాటు చేయాలి. ఆత్మకూరు ఎంఎస్ఎంఈ పార్కులో మధ్య, చిన్న తరహా పరిశ్రమలు తీసుకొని రావాలి.



- ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి, ఆత్మకూరు ఎమ్మెల్యే

గిరిజనుల అభివృద్ధే లక్ష్యం

సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న గిరిజనుల అభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇస్తా. ఇప్పటికే వారికి ఆధార్, రేషన్ కార్డులు అందించాను. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా గిరిజనులకు అందేలా కృషి చేస్తా. నా నియోజకవర్గంలోని అన్ని ఆసుపత్రులలో సీఎస్ఆర్ ఫండ్స్‌తో అభివృద్ధి పనులు చేస్తున్నాం. దానిని కొనసాగిస్తా. బండేపల్లి-డేగపూడి కాలువను పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తాను. అసంపూర్తిగా ఆగిపోయి ఉన్న దక్షిణ కాలువ పనులను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటా. తిరుమలమ్మపాలెం వద్ద ఉప్పుటేరుపై బ్రిడ్జి నిర్మాణం మొదలుపెడతాం. సర్వేపల్లి రిజర్వాయర్‌ను ఆధునికీకరించి వ్యవసాయం, పరిశ్రమలకు మరింత సహకారం అందిస్తాం. కృష్ణపట్నం నోడ్‌లో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తాం. పల్లెల్లో సిమెంటు రోడ్లు వేసేలా ప్రణాళికలు రూపొందిస్తాం. పొదలకూరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయిస్తా. కోడూరు బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా. రెవెన్యూ సమస్యలను ఆన్‌లైన్ చేయడంతోపాటు నిర్ణీత గడువులోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా.



- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

రాబోయే ఏడాదిలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా. ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఉపాధి చూపేందుకు చర్యలు తీసుకుంటున్నా. ఇప్పటికే రెండు జాబ్‌మేళాలు నిర్వహించాము. కిసాన్ సెజ్‌లో ఫ్యాక్టరీల ఏర్పాటుకు ప్రయత్నిస్తా. వీపీఆర్ ఫౌండేషన్ సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాను. నాబార్డు నిధులతో కనిగిరి రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు కృషి చేస్తాను. పెన్నా డెల్టాలో కాలువలకు మరమ్మతులు చేసి రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తా. ముదివర్తి కాజ్‌వే నిర్మాణానికి శక్తివంచనలేకుండా కృషి చేస్తాను. తీరప్రాంత గ్రామాల్లోని మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. కేంద్ర ప్రభుత్వ నిధులతో బుచ్చిరెడ్డిపాళెం- ఊటుకూరు రోడ్డును ఆధునీకరించేందుకు అనుమతి పొందాము. రాబోయే ఏడాదిలో కార్యరూపం దాల్చేందుకు కృషి చేస్తాను. పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తవుతాయని భావిస్తున్నాను. కోవూరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా పని చేస్తా.



- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే

పొట్టేపాలెం వద్ద బ్రిడ్జికి కృషి

రూరల్ నియోజకవర్గంలో ముఖ్యమైన పొట్టేపాలెం కలుజు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తాను. కనుపూరు కాలువ డీప్‌కట్ సాధించేందుకు ప్రయత్నిస్తాను. రైతాంగానికి ఇబ్బందులు లేకుండా కాలువలన్నిటినీ బాగు చేయిస్తా. నరసింహకొండ క్షేత్రాన్ని ప్రసాదం పథకం ద్వారా విడుదలయ్యే నిధులతో ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటా. బారాషాహీద్ దర్గాను అభివృద్ధి చేస్తా. క్రిష్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి లక్ష్యంగా పెట్టుకున్నా. రూరల్ నియోజకవర్గంలో గుంతలు లేని రోడ్లు రూపుదిద్దుకోవడమే ప్రాధాన్యతగా పనిచేస్తా. అక్కచెరువుపాడులోని మైనార్టీ గురుకుల పాఠశాలను మరింతగా అభివృద్ధి చేసేందుకు చొరవ తీసుకుంటా. పొదలకూరు రోడ్డు మధ్యలో డివైడర్ పూర్తి చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తాం. తూర్పు వైపు రోడ్డును కూడా బాగు చేయిస్తా. జాతీయ రహదారిపై త్వరగా వంతెనల నిర్మాణం పూర్తయ్యేలా చొరవ తీసుకుంటా.



- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే

పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన

కందుకూరులో పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి కల్పనే లక్ష్యంగా నా ప్రయత్నాలు ఉంటాయి. బీపీసీఎల్, పెట్రో కెమికల్స్, చమురు శుద్ధి కర్మాగారం రామాయపట్నం పోర్టు పరిసరాల్లో ఏర్పాటు కానుంది. ఇండోసోల్, సోలార్ కంపెనీలకు అనుబంధంగా చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నా. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కూడా ఏర్పాటు చేయించేందుకు ఎంపీ వేమిరెడ్డి సహకారాన్ని కోరతా. వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా. మోపాడు ప్రత్యేక సప్లయ్ ఛానల్‌ను పూర్తి చేయించడంతోపాటు రాళ్లపాడు రిజర్వాయర్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. కందుకూరు పట్టణాన్ని మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దడం లక్ష్యంగా పలు అభివృద్ధి పనులకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశాను. పట్టణంలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఉత్తర బైపాస్ రోడ్డు నిర్మాణం అవస్యమని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించగా నిధుల మంజూరుకు ఆయన హామీ ఇచ్చారు.



- ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు ఎమ్మెల్యే

సాగు, తాగునీటి కష్టాలు తీరుస్తా

మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో సాగు, తాగు నీటి కష్టాలు తీర్చడంతోపాటు ఉదయగిరి దుర్గం, ఆనకట్ట, నర్రవాడ, ఘటికసిద్ధేశ్వరం ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తా. పరిశ్రమలు నెలకొల్పి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే నా లక్ష్యం. వెలుగొండలో అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్, సోమశిల ఉత్తర, హైలెవల్ కెనాల్ పనులు త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తా. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం, జలజీవన్ మిషన్ పనులను పూర్తి చేసి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాము. నియోజవకర్గంలో ఫుడ్‌ప్రాసెసింగ్, ఫార్మా, ఆగ్రో, రిలయన్స్, ఎనర్జీ సెక్టార్లను ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి వలసలు నివారిస్తా. ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి రూ.5 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి నివేదికలు పంపాము. మంజూరు కాగానే వైద్యశాల అభివృద్ధి చేస్తా. ఉదయగిరి దుర్గంపైకి రహదారి ఏర్పాటు, ఆనకట్ట సుందరీకరణ అనంతరం శ్రీకృష్ణదేవరాయులు, ఎన్టీఆర్ విగ్రహాలను ఏర్పాటు చేసి కృష్ణమందిరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.



- కాకర్ల సురేష్, ఎమ్మెల్యే, ఉదయగిరి

500 కి.మీ కొత్త రోడ్ల నిర్మాణమే లక్ష్యం

కావలి నియోజకవర్గంలో 500 కి.మీ పొడవున కొత్త రోడ్లను గుర్తించి తొలివిడతలో మట్టి రోడ్లుగా మార్చడమే నా లక్ష్యం. గ్రామాల మధ్య దూరం తగ్గేలా ఈ కొత్త రోడ్ల రూపకల్పన ఉంటుంది. అలాగే కావలిని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి 8వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నా. అలాగే కొండేపి డ్రైను, పిల్లికాలువ, చిప్పలేరు, పైడేరు, అల్లూరు కాలువలను అభివృద్ధి చేస్తాము. బోగోలు, కావలి, జలదంకి మండలాలను సోమశిల పరిధిలో డెల్టా ప్రాంతాలుగా గుర్తించేలా కృషి చేసా. గతంలో నెల్లూరులో డెల్టా ప్రాంతంగా ఉన్న ఆయకట్టు ఇళ్ల నిర్మాణాలకు వెళ్లాయి. వాటి స్థానంలో డెల్టా ప్రాంతాలుగా ఈ మండలాలను గుర్తించనున్నాము. నియోజకవర్గంలోని రైల్వే క్రాసింగ్ గేట్ల స్థానంలో రైల్వే ఓవర్ బ్రిడ్జీలు, అండర్‌పాస్ బ్రిడ్జీల నిర్మాణానికి కృషి చేస్తా. కావలి-ఉదయగిరి హైవేను కావలి హైవేలో కలిపేందుకు ముసునేరు పైభాగంగా బైపాస్ రోడ్డును తీసుకొచ్చి పట్టణంలో ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తాము.



- దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, కావలి ఎమ్మెల్యే

హద్దు... మీరద్దు!

'ఆంగ్ల సంవత్సరాది' వేడుకలకు అనుమతుల్లేవ్!

నేటి రాత్రి రోడ్లపైనే పోలీస్ యంత్రాంగం

నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు

నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి) : ఆంగ్ల సంవత్సరాదికి స్వాగతం పలికేందుకు జిల్లా ప్రజానీకం సన్నద్ధమవుతోంది. ముఖ్యంగా యువత వినూత్న రీతిలో ఆహ్వానం పలికేందుకు సిద్ధమవుతోంది. సరిగ్గా అర్ధరాత్రి 12 గంటల సమయంలో బాణాసంచా, ప్రధాన కూడళ్లలో కేక్‌ల కటింగ్, రహదారులపై ద్విచక్రవాహనాల్లో తిరుగుతూ కేరింతలు కొట్టడం వంటి చర్యలు ప్రతిసంవత్సరం జరుగుతుంటాయి. అయితే, జిల్లా పోలీసులు మాత్రం వేడుకలకు ఎలాంటి అనుమతులు లేవని, నిబంధనలు పాటించక పోతే చర్యలు తప్పవని గట్టిగానే హెచ్చరిస్తున్నారు.

● మంగళవారం రాత్రి పోలీసు యంత్రాంగం మొత్తం రోడ్లపై తిరుగుతూ ప్రజల రక్షణ, భద్రతపై దృష్టి సారిస్తూ పర్యవేక్షిస్తుంది. ● వేడుకలను ప్రశాంత వాతావరణంలో ఇళ్ల వద్ద, దేవాలయాల్లో కుటుంబసభ్యుల మధ్య జరుపుకోవాలి. ● అర్ధరాత్రి పూట ఆసుపత్రులు, హాస్టళ్లు, నివాస ప్రాంతాల వద్ద బాణసంచా కాల్చి ఇతరుల ప్రశాంతతకు భంగం కలిగించకూడదు. ● ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ కేకలు వేయడం, అధిక శబ్దాలతో హోరెత్తించడం వంటి చర్యలకూ పాల్పడకూడదు. అంతేగాక రోడ్లపై కేక్‌లు కట్ చూయకూడదని సూచించారు. ● వ్యాపార సంస్థలు, ఇతర షాపులు వారు నిర్ణీత సమయానికి దుకాణాలు మూసేయాలి. ● హాస్టల్స్, ఫంక్షన్ హాల్స్, ఇతర సంస్థలలో నూతన సంవత్సర వేడుకలకు ప్రత్యేక అనుమతులు లేవు. ● వైన్‌షాప్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లు ప్రభుత్వం నిర్దేశించిన సమయానికే మూసి వేయాలి. ● బార్లు, హోటళ్లలో అసాంఘిక, అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటారు. ● వేడుకల పేరుతో మహిళలను, యువతులను ఈవ్ టీజింగ్ చేయడం, ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా అనుమానకరంగా, అసభ్యంగా ప్రవర్తించే వారిని అదుపులోకి తీసుకోనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జరుపుకోండి!

జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ వేడుకలను ప్రశాంత వాతావరణంలో ఇళ్ల వద్దనే జరుపుకోవాలి. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకుంటూ జిల్లా పోలీసులకు సహకరించాలి.

- జి కృష్ణకాంత్, ఎస్పీ

ఫిట్ టెస్ట్

- కానిస్టేబుల్ నియామక దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం



పరుగు పరీక్షలో అభ్యర్థులు

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల్లో అభ్యర్థులకు దేహదారుఢ్య (ఫిట్‌నెస్) పరీక్షలను అధికారులు సోమవారం ప్రారంభించారు. నెల్లూరులోని పరేడ్ గ్రౌండ్‌లో తెల్లవారుజామున 4 గంటల నుంచే ఈ 'టెస్ట్' మొదలుపెట్టారు. జనవరి 9వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు తొలిరోజు 298 మంది హాజరయ్యారు. ఎత్తు, ఛాతీ కొలతల అనంతరం పరుగు, లాంగ్‌జంప్ వంటి ఈవెంట్స్ నిర్వహించి అర్హత పొందిన వారికి ఉత్తీర్ణత పత్రాలు జారీ చేశారు. జనవరి 3, 4 తేదీల్లో మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు జరుగుతాయని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు.

- 4వ పేజీలో

ఈ ఏడాది నేరాలు తగ్గాయ్!

- మెరుగైన పోలీసింగ్, సమర్థవంతమైన పనితీరే కారణం
- లోక్ అదాలత్‌లో జిల్లాకు ప్రథమ స్థానం
- వార్షిక నేర నివేదికను విడుదల చేసిన ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖలో సమర్థవంతమైన పనితీరు, మెరుగైన పోలీసింగ్‌తో 2024లో నేరాలు తగ్గాయని ఎస్పీ జి కృష్ణకాంత్ తెలిపారు. ఈ సంవత్సర పోలీస్ వార్షిక నేర నివేదికను సోమవారం ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణకాంత్ మాట్లాడుతూ 2023 సంవత్సరంతో పోలిస్తే 2024లో డెకాయిటీ కేసులు 71 శాతం, హత్యాయత్నం కేసులు 66శాతం, చీటింగ్ కేసులు 30.5శాతం, లైంగికదాడి కేసులు 25 శాతం, రోడ్డు ప్రమాదాలు 25 శాతం, దోపిడీ కేసులు 23 శాతం, ఎస్సీ, ఎస్టీ కేసులు 10.5 శాతం తగ్గాయని చెప్పుకొచ్చారు. ఈ సంవత్సరంలో 4 విడతల్లో జరిగిన లోక్ అదాలత్‌లో 34,065 కేసులను పరిష్కరించి రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు. చట్ట వ్యతిరేక, అసంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపామని, పలు సంచలనాత్మక కేసులు ఛేదించామని తెలిపారు. ప్రత్యేక బృందాల ద్వారా ఆధునిక సాంకేతికత ఆధారంగా మిస్సింగ్ కేసులను ఛేదించినట్లు పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా సామాన్య ప్రజలకు చేరువై దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరిచినట్లు చెప్పారు. మొబైల్ మిస్సింగ్ ఫిర్యాదులను వెంటనే స్వీకరించి ఏడు విడతల్లో రూ.8 కోట్ల విలువ గల 3వేల సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశామన్నారు. 34,780 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదు చేసి రూ.1,80,43,100 అపరాధ రుసుము విధించినట్లు చెప్పారు. అలాగే 6,334 డ్రంక్ అండ్ డ్రైవ్, 8652 బహిరంగ ప్రాంతాల్లో మద్యసేవ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. కాగా,జిల్లాలో వరకట్న మరణాల కేసులు ఈ సంవత్సరంలో నమోదు కాలేదన్నారు.



వార్షిక నేర నివేదిక వివరాలు తెలుపుతున్న ఎస్పీ కృష్ణకాంత్

● పోలీస్ సంక్షేమానికి కృషి

పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా జిల్లాలో పోలీసు సిబ్బంది, వారి కుటుంబసభ్యుల కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. నేర నియంత్రణకు ప్రతి గ్రామంలో, అన్ని కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. 2025లో సరికొత్త పోలీసింగ్‌తో జిల్లా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ డి శ్రీనివాసరెడ్డి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.








పోలీస్ పరీక్షలు

నెల్లూరు(క్రైం),డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా దేహధారుడ్య పరీక్షలు మంగళవారం నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో ప్రారంభమయ్యాయి. వేకువజామున 4 గంటల నుంచే ఈ పరీక్షలు మొదలుపెట్టారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఆధునిక సాంకేతిక పరికరాలను ఉపయోగించి ఎత్తు, ఛాతీ కొలతలు తీసుకున్నారు. అనంతరం 1600 మీటర్ల పరుగు పోటీ నిర్వహించారు. అందులో అర్హత పొందిన వారికి 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు జరిపారు. వీటన్నింటిలో విజయం సాధించిన వారికి ఉత్తీర్ణత సర్టిఫికెట్లు అందజేశారు. ఈ పరీక్షలకు తొలిరోజు 600 మంది అభ్యర్థులు హాజరుకావలసి ఉండగా 298 మంది హాజరయ్యారు, 302 మంది గైర్హాజరయ్యారు. దేహదారుడ్య పరీక్షల తీరును ఎస్పీ జీ కృష్ణకాంత్ పర్యవేక్షించారు. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిఫార్సులతో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. మహిళా అభ్యర్థులకు ప్రత్యేకంగా జనవరి 3, 4 తేదీలలో మహిళా సిబ్బందితో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. 9వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని ఎస్పీ తెలిపారు.



గుర్తుకొస్తున్నాయి!

● కనుమరుగైన గ్రీటింగ్ కార్డులు ● ఇప్పుడంతా ఫోన్లోనే! ● ఈ-గ్రీటింగ్‌లపై అందరిచూపు

ఒకప్పుడు పుట్టిన రోజు, పెళ్లి రోజు, ప్రేమికుల రోజు ఇలా ఏ సందర్భానికైనా తప్పనిసరిగా గ్రీటింగ్‌కార్డు ద్వారా శుభాకాంక్షలు తెలిపేవారు. ముఖ్యంగా ఆంగ్ల సంవత్సరాది వస్తోందంటే చాలు పల్లెలు మొదలు పట్టణాల వరకు ప్రతి దుకాణం ముందు వందలాది గ్రీటింగ్‌కార్డులు ప్రత్యక్షమయ్యేవి. ప్రతి డిసెంబరు నెలలో జిల్లావ్యాప్తంగా లక్షలాది రూపాయల వ్యాపారం జరిగేది. ఇప్పుడా పరిస్థితి లేదు. గ్రీటింగ్ కార్డు గత కాలపు తీపిజ్ఞాపకంగా మారిపోయింది.

- ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి)

"కత్తి వచ్చే కత్ర పోయే ఢాం... ఢాం...ఢాం..." అని పల్లెల్లో చిన్నతనంలో పాడుకునేవారు. కొత్త నీరు రాగానే పాత నీరు కొట్టుకుపోతుందనేది పెద్దల సామెత. నేడు గ్రీటింగ్‌కార్డుల పరిస్థితికి ఈ రెండు సామెతలు సరిగ్గా సరిపోతాయి. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో గ్రీటింగ్‌కార్డు చిన్నబోయింది. ఆత్మీయులకు, బంధువులకు, స్నేహితులకు శుభాకాంక్షలు తెలియజేయడానికి గ్రీటింగ్ కార్డు ద్వారా తమ ఆత్మీయతను తెలియజేయడం మానుకున్నారు. ఒక గ్రీటింగ్‌కార్డు కొని దాన్ని పోస్టు ద్వారా బంధువులకు, స్నేహితులకు పంపించాలంటే కనీసం రూ.20 నుంచి రూ.100 వరకు ఖర్చవుతుంది. అంతేగాక జనవరి 1 నూతన సంవత్సరం రోజుకు వాళ్ళకు అందాలంటే కనీసం నాలుగైదు రోజుల ముందు మనం గ్రీటింగ్‌కార్డు పంపాల్సి వచ్చేది. నవంబరు చివరి వారంలోపే వ్యాపారులు రకరకాల గ్రీటింగ్‌కార్డులను అమ్మకానికి పెట్టేవారు. డిసెంబరులో వేలాదిగా వెళ్ళే గ్రీటింగ్‌కార్డుల ద్వారా తపాలాశాఖకూ ఆదాయం గణనీయంగా పెరిగేది. అంతేగాక ప్రతి ఊరిలోనూ పోస్టుమన్ సైతం గ్రీటింగ్‌కార్డుల బట్వాడాతో ఎంతో హడావుడిగా కనిపించేవారు. అయితే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితి పూర్తిగా కనుమరుగైంది. ఒక వెలుగు వెలిగిన గ్రీటింగ్‌కార్డుల ప్రభావం నేడు దాదాపు కనుమరుగైపోయింది.

క్షణాల్లో విషెస్..

123 గ్రీటింగ్స్, అమెరికన్ గ్రీటింగ్స్, పేపర్‌లెస్‌పోస్ట్, ఆల్ మార్క్‌ఈకార్డ్సు, మొదలైన ఎన్నో వెబ్‌సైట్ల ద్వారా అందమైన గ్రీటింగ్‌కార్డులను చిటికెలో మన ఆత్మీయులకు ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా పంపించవచ్చు. ఇక జికార్డ్, జింక్‌గ్యాలరీ, వామ్‌లీగ్రీటింగ్‌కార్డ్సు, రెడ్‌స్టాంప్‌కార్డ్సు మొదలైన ఎన్నో యాప్స్ ద్వారా సైతం అందమైన గ్రీటింగ్‌కార్డులను సృష్టించి వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం తదితర సామాజిక మాధ్యమాల ద్వారా అవతలివారికి షేర్ చేయవచ్చు. ఇలా నూతన టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో గ్రీటింగ్‌కార్డులు కనుమరుగయ్యాయి. వాటి స్థానంలో ప్రింటెడ్ మగ్గులు, సెల్‌ఫోన్ పౌచ్‌లపై శుభాకాంక్షల సందేశాన్ని ముద్రించి బహూకరించడం వంటి వాటిపై యువత ఆసక్తి చూపుతోంది. సాధారణ గ్రీటింగ్‌కార్డును అడిగేవారే లేకపోవడంతో కనుమరుగయ్యాయి.

ఆకట్టుకునేలా ఈ-గ్రీటింగ్ కార్డ్సు



ఈ-గ్రీటింగ్‌కార్డ్సుగా పిలవబడే ఎలక్ట్రానిక్ గ్రీటింగ్‌కార్డులను అందించేందుకు ఎన్నో వెబ్‌సైట్లు, యాప్స్ నేడు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో మనకు నచ్చిన గ్రీటింగ్ కార్డును ఎంచుకునే సదుపాయం ఉంది. అంతేగాక పర్సనలైజ్ యాప్ ద్వారా ఎంచక్కా గ్రీటింగ్‌కార్డుపై మన ఫొటో, పేరు, అవతలి వారి పేరు, ఫొటో, మనకు నచ్చిన సందేశం కూడా జోడించి శుభాకాంక్షలను క్షణాల్లో అందించవచ్చు. ఇక కొన్ని వెబ్‌సైట్లు, యాప్స్ అయితే మ్యూజిక్ గ్రీటింగ్‌కార్డులను కూడా అందిస్తున్నాయి. కొన్నింటిలో మన గొంతుతోనే శుభాకాంక్షల సందేశాన్ని రికార్డు చేసి పంపించవచ్చు.



● బహుముఖ చిత్రకారుడు సుందర బాబు
● వందలాది బొమ్మలకు జీవం
● ఎన్నో పోటీల్లో ప్రతిభ
● ప్రముఖుల ప్రశంసలు, పురస్కారాలు
● 18న ఎన్టీఆర్ చిత్రాల ప్రదర్శన

సుందర చిత్రాలు

ఆధునిక చిత్రాలు గీయడంలో ఆయన దిట్ట. కుంచె కదిపితే సజీవ దృశ్యాలు కళ్లముందు సాక్షాత్కరిస్తాయి. ప్రకృతి రమణీయ అయినా, మగువల ముగ్ధ మనోహర రూపమైనా, దేవతా స్వరూ పాలైనా, అభిమాన నటులైనా, కళా కారులైనా... ఆ కళాకారుడి నైపుణ్యం అబ్బురపరుస్తుంది. ఆయనే మున్నెం సుందర బాబు సామాన్య రైతు కుటుంబంలో పుట్టి తండ్రి స్ఫూర్తితో చిత్రకళలో ప్రావీణ్యం సంపాదించి ఎన్నో పురస్కారాలు, ఎందరి నుంచో ప్రశంసలు అందుకుంటున్నారు.



నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సుందర బాబు స్వస్థలం విడవలూరు మండలం ముదివర్తి గ్రామం. తండ్రి కృష్ణమూర్తి మేకప్ ఆర్టిస్టు. పల్లె అందాలను అందంగా చిత్రీకరిస్తున్న సుందరబాబును తండ్రి ప్రోత్సహించి మెలకువలు నేర్పారి. పాఠశాలలో అతనిలోని చిత్రకళాకారుడ్ని గుర్తించిన ఉపాధ్యాయులు వెన్నుతట్టారు. దీంతో 10వ ఏటకే సుందరబాబు చిత్రకారుడిగా గుర్తింపు పొందారు. డిగ్రీ వరకు చదువుకున్న ఆయన చిత్రకళనే వృత్తిగా మలచుకున్నారు. చిన్నతనం నుంచి చిత్రాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని కుటుంబ అవసరాల కోసం వినియోగిస్తున్నారు. కమర్షియల్ ఆర్టిస్టుగా ఎదగాలని యాడ్ ఏజన్సీలలో పని చేశారు. కానీ ఫ్లెక్సీ ప్రింటింగ్ యుగం రావడంతో యాడ్ ఏజెన్సీలు ఫ్లెక్సీలవైపే మొగ్గు చూపడంతో చిత్ర కళాకారులకు ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి. అయితే సుందర బాబు వైవిధ్యమైన చిత్రాలు గీయడంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. సుందర్ ఆర్ట్స్ అనే సంస్థను నెలకొల్పి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే చిత్రకళా పరిషత్‌లలో తన చిత్రాలను ప్రదర్శిస్తున్నారు.


సుందర బాబు

హైదరాబాద్‌లోని మాదాపూర్ చిత్రమయి స్టేట్ గ్యాలరీలో చిత్రాలు ప్రదర్శించి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నాట్యకారిణి శోభానాయుడు నుంచి అవార్డులు అందుకున్నారు. జిల్లా కలెక్టర్ కోరిక మేరకు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను చిత్రాలుగా మలిచి అందజేశారు. అవి ఏనాటి కైనా మ్యూజియంలో ప్రదర్శనకు నోచుకుంటాయని ఆశిస్తున్నారు. 2007లో మైసూరు విశ్వవిద్యా లయం నుంచి దూర విద్య ద్వారా ఫైన్ ఆర్ట్స్ కోర్సు పూర్తి చేసిన సుందరబాబు, విఘ్నేశ్వరుడిని 99 రూపాల్లో చిత్రించి తన కళా నైపుణ్యాన్ని చాటారు. ఆ చిత్రాలను టౌనుహాలులో ప్రదర్శించి ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. సుందరబాబు ఇప్పటి వరకు 25కిపైగా జాతీయ అవార్డులు, 20కిపైగా రాష్ట్రస్థాయి అవార్డులు అందుకున్నారు. 150కి పైగా చిత్రకళా పోటీల్లో ప్రతిభ చాటారు. తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు దక్కించుకున్నారు. 2015లో ఒంగోలులో 100 మంది చిత్రకారులతో నిర్వహించిన 100 గంటలు, వంద చిత్రాల పోటీలో పాల్గొని మిరాకిల్ వరల్డ్ రికార్డు సాధించారు. గత అక్టోబరులో కలకత్తాలో చిత్ర కళా ప్రదర్శన నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. ముదివర్తి గ్రామంలోని కరి మాణిక్యస్వామి ఆలయాన్ని (విష్ణు ఆలయం) సజీవంగా చిత్రించి, చిత్ర ప్రపంచాన్ని అబ్బురపరిచారు. అలాగే ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ, కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వంటి ప్రముఖుల చిత్రాలను చిత్రించి వారికే బహుమతులుగా అందజేశారు.





18న ఎన్టీఆర్ చిత్ర ప్రదర్శన

సుందరబాబు చిత్రకళ ద్వారా ఎన్టీఆర్ అభిమానులకు కనువిందు చేయబోతున్నారు. ఎన్టీఆర్ శత జయంతి, సినీ రంగంలో అడుగిడి 75 వసంతాల ఉత్సవం సందర్భంగా విశ్వ విఖ్యాత నటసార్వభౌముని 30 చిత్రాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. జనవరి 18 నుంచి 21వతేదీ వరకు నెల్లూరు పురమందిరం వర్ధమాన సమాజంలో నెల్లూరు కలర్స్ పేరుతో నెల్లూరు చిత్రకారుల కళాప్రదర్శనలో ఈ చిత్రాలు ప్రదర్శించనున్నారు.

108 సిబ్బంది వేతనం రూ.4 వేలు పెంపు


రోగులకు వైద్యసేవలందిస్తున్న 108 సిబ్బంది

ఉదయగిరి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా చాలీచాలని జీతాలతో కాలం వెళ్లదీస్తున్న 108 వాహన సిబ్బందికి కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. పైలెట్లతోపాటు ఈఎంటీలకు రూ.4 వేలు చొప్పున వేతనం పెంచుతున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వేతనాలు పెంచాలని పలుమార్లు సిబ్బంది ఆందోళనలు చేపట్టినా పట్టించుకోలేదు. ఎన్నికల హామీ మేరకు వేత నాలు పెంచుతూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. జీతాల పెంపుతో జిల్లాలో ఉన్న 39 వాహనాల్లోని 96 పైలెట్లు, 88మంది ఈఎంటీలకు లబ్ధి చేకూర నుంది. 108 వాహనంలో పైలెట్లు, ఈపీఎంటీలు 12 గంటలపాటు డ్యూటీలో ఉంటారు. వీరికి జీతంతోపాటు అదనంగా గత టీడీపీ ప్రభుత్వంలో రూ.4 వేలు చెల్లించేశారు. అయితే వైసీపీ అధికా రంలోకి వచ్చాక ఆ చెల్లింపులను రద్దు చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గతంలోలా రూ.4 వేలు ఇస్తామని వెల్లడించింది.

వైసీపీ పాలనలో నష్టాల ఊబిలో నుడా

● చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి


అధికారులతో సమీక్షిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థను నష్టాల ఊబిలోకి నెట్టారని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ధ్వజమెత్తారు. నుడా పరిధిలో అభివృద్ధి పనులు, ఆర్థిక వనరులపై అధికారులతో ఆయన చాంబర్‌లో సోమవారం సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం నుడాకు ఆర్థిక వనరులు పెంచకుండా ఇష్టప్రకారం పనులు చేపట్టి సంస్థను నష్టాలపాలు చేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆర్థిక వనరులను సృష్టించుకునే కృషి చేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం ఎంఐజీ లేఔట్లు పెద్దఎత్తున ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. కావలి, కందుకూరులో గత ప్రభుత్వంలో వేసిన లేఔట్లలో కొంతమేర మాత్రమే ప్లాట్ల అమ్మకాలు జరిగాయని, అక్కడ మౌలిక వసతుల కల్పన పూర్తి చేయలేదన్నారు. కందుకూరు లేఔట్లో స్థలాల ధరలు తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని కోటంరెడ్డి పేర్కొన్నారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో ఎంఐజీ లేఔట్ల ఏర్పాటుతో మధ్య తరగతి ప్రజలకు, ఉద్యోగులకు తక్కువ ధరలకే ఇళ్ల స్థలాలు విక్రయిస్తామని తెలిపారు.


'సోమశిల'లో 71.919 టీఎంసీల నీరు

అనంతసాగరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 4,865 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 71.919 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1,550, కండలేరుకు 800, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువ 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

స్టాప్‌లాక్ గేటు బయటకు లాగివేత

3 వారాల సందిగ్ధతకు తెర

● మరమ్మతు చేసి మరలా బిగించనున్న అధికారులు ● నేటి నుంచి సర్వీసు గేటు నుంచే కుడి కాలువకు నీరు


రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము స్టాప్‌లాక్ గేటును పూర్తిగా పైకి లాగిన సిబ్బంది

లింగసముద్రం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత మూడు వారాలుగా రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము గేటు సమస్యకు సోమవారంతో తెరడింది. సాయంత్రానికి మెఘా ఇంజనీరింగ్ నిపుణులు, మరో మెకానిక్ నిపుణులు షేక్ షమీంబాషా, ప్రాజెక్టు అధికారులు సిబ్బంది తూము వద్ద నది లోపలి వైపు ఇసుక బస్తాలు వేసి చైన్ పుల్లీలతో గేటును పూర్తిగా పైకి లాగారు. అంతకుముందు గేటు రెండు అడుగులు మాత్రమే వచ్చిన వచ్చిన విషయం తెలిసిందే. దాని తూము నుంచి బయటకు తీయడంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ గేటు దెబ్బతిని మొరాయించడంతో సాగు నీటి కోసం రైతులు ధర్నాలు చేసిన విషయం తెలిసిందే. సమస్యను పరిష్కరించేందుకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నడుం బిగించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల ఇంజనీరింగ్ నిపుణులను రప్పించి గేటును తొలగింపజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డీఈ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడారు. 20 రోజుల కిందట స్టాప్‌లాక్ గేటు, స్క్రూ రాడ్డుకు మధ్యలో బోల్టు విరిగినందు వలన ఈ సమస్య నెలకొన్నట్లు చెప్పారు. ప్రస్తుతం పైకి లాగిన గేటు.. స్క్రూ రాడ్డుకు కొత్త బోల్టు బిగించి తిరిగి గేటును యథాస్థానంలో దించుతామన్నారు. మంగళవారం నుండి సర్వీసు గేటు ద్వారా కుడి కాలువకు నీరు విడుదల చేస్తామన్నారు.

ముగ్గురమ్మల తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు


పోలేరమ్మ ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

అల్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న ముగ్గురమ్మల తిరునాళ్లకు ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక పేటలోని పోలేరమ్మ ఆలయం, గ్రామంలోని కలుగోళమ్మ, గంగమ్మ ఆలయాల వద్ద విద్యుత్ దీపాలంకరణతో పాటు విలువైన రకరకాల పూలతో ప్రత్యేక అలంకరణలు చేపడతున్నారు. పారిశుధ్య సిబ్బందితో గ్రామమంతా పారిశుధ్య పనులు చేయించడం, గుంటలు, మిట్టలు చదును చేస్తున్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కాకుండా విద్యుత్ అధికారులు ముందస్తు జాగ్రత్తలను తీసుకుంటున్నారు. ఆర్డీవో వంశీకృష్ణ అల్లూరులో పర్యటించి సలహాలు ఇచ్చారు. తహసీల్దారు లక్ష్మీనారాయణ తమ సిబ్బందితో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

కావలి టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు సోమవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడారు. ఫిబ్రవరి 1,2,3తేదీల్లో నెల్లూరు జరుగనున్న మహాసభల్లో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు తరలిరావాలన్నారు. మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర పార్టీ ప్రముఖులు హాజరుకానున్నారని, ప్రజా సమస్యలపై ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటాల కార్యచరణ ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణమోహన్, కృష్ణయ్య, మధుసూధన్‌రావు, అమీర్‌బాష, బాబురావు, తిరుపాల్ పాల్గొన్నారు.

దాతల సహకారంతో విద్యార్థులకు అల్పాహారం

ఉదయగిరి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు దాతల సహకారంతో అల్పాహారం అందించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు షేక్ నాయబ్ సోమవారం తెలిపారు. మాట్లాడుతూ కొత్తపల్లికి చెందిన పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మూలె నేహారెడ్డి తండ్రి నాగసుబ్బారెడ్డి ప్రతిరోజు అల్పాహారం అందజేసేందుకు ముందుకొచ్చారన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో చోరీ

అనంతసాగరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మవరంలోని ముత్యాలమ్మ ఆలయంలో హుండీ చోరీకి గురైనట్లు స్థానికులు తెలిపారు. సోమవారం ఉదయం హుండీని తస్కరించిన్నట్లు ఆలయ పూజారి గుర్తించారు. అందులో 8 నెలల నుంచి భక్తులు వేసిన కానుకలు ఉన్నాయని, ఈవిషయంపై అనంతసాగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాల నృత్యకారులకు అభినందనలు



చిన్నరులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బాల నృత్యకారులను సోమవారం ముసునూరులోని కార్యాలయంలో ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి అభినందించారు. కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామంలో 29న హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో 2వేల మంది కూచిపూడి కళాకారులతో నిర్వహించిన మహాబృంద నాట్యంలో సంయుక్త నృత్య కళా నిలయంకు చెందిన చిన్నారులు పాల్గొని ప్రతిభ చూపడం హర్షనీయం అన్నారు. ఈ సందర్భంగా నాట్యగురువు లిఖిత, చిన్నారులు మోక్షశ్రీ, హసీన, సాయినిహారిక, యషశ్రీవిద్య, అర్షియ, లక్ష్మీపల్లవి, రిషిత, రక్షిత, కృష్ణప్రియ, మనస్వి, ఇందుప్రియ, రిత్వికలను సర్టిఫికెట్లతో పాటు జ్ఞాపికలు అందజేశారు. ప్రాచీన కళలు అంతరించిపోకుండా చిన్నారులకు శిక్షణ ఇస్తున్న నాట్యగురువు లిఖితను అభినందించారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు ఎంతో మేలు

కొండాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం సభ్యత్వంతో కార్యకర్తలకు మేలు జరుగుతుందని టీడీపీ కన్వీనర్ ఎమ్.ఓంకారం, నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య తెలిపారు. గరిమెనపెంట పంచాయతీ ఎస్సీ కాలనీలో సోమవారం జరిగిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో మండలంలో 13వేలకుపైగా సభ్యత్వాలు చేపట్టామన్నారు. నమోదుకు ఒక్కరోజు గడువు ఉందని, ఇప్పటివరకు నమోదుకాని కార్యకర్తలను గుర్తించి ఆయా గ్రామాల నాయకులు వెంటనే సభ్యత్వాలు చేయించాలని కోరారు. కార్యక్రమంలో మండల రైతు అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీనివాసులు, మండల మాజీ ఎస్సీసెల్ అధ్యక్షుడు మాచర్ల తదితరులు పాల్గొన్నారు.

రాళ్లపాడు ప్రాజెక్టు పాపం వైసీసీదే : మాజీ ఎమ్మెల్యే దివి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

కందుకూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు ఆయ కట్టు రైతులకు సాగునీటి ఇబ్బందులు వచ్చేందుకు ప్రధాన కారణం వైసీసీ ప్రభుత్వమే అని ఐదేళ్ల కాలంలో ఏ ఒక్కరోజు గేట్లుకు గ్రీసు పూసిన పాపాన పోలేదని కందుకూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దివి శివరాం విమర్శించారు. సోమవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రాజెక్టు నిర్వాహణకు 20 శాతం నిధులు కేటాయించేలా ఎమ్మెల్యే ఇంటూరి చొరవ తీసుకోవాలన్నారు.

ఎక్సైజ్ అధికారుల ముమ్మర గాలింపు

బిట్రగుంట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం, సంక్రాంతిని పురస్కరించుకుని నాటుసారా తయారు చేసే స్థావరాలను గుర్తించేందుకు సోమవారం జిల్లా ఎక్సైజ్ ఏఈ జే.రమేష్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా కప్పరాళ్లతిప్ప, బోగోలు, గంగతిప్ప, చెంచులక్ష్మీపురం, నాగులవరం, సోమేశ్వరపురం గ్రామాల పరిధిలోని అటవీప్రాంతాల్లో తిరిగారు.

ప్రకటన

నా క్లయింటు అయిన యిరిగినేని రవీంద్రబాబు తండ్రి తిరుపతి నాయుడు, కెల్లిగుంటపేట, నెల్లూరుసిటీ, ప్రస్తుత నివాసం: No.9-15, Myans Luxury, East Coast Road, Villas 34, VTC: Kannathur Reddy Kuppam, PO: Muttukadu, District: Kancheepuram, State: Tamilnadu, PIN Code: 603112. ఆనువారు ఇచ్చిన వివరముల మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా:- నా క్లయింట్ పడుగుపాడు పంచాయితీలో చేరిన పడుగుపాడు గ్రామ పొలంలోని సెం.98కు పట్టా దాఖలా సర్వే నెం.131-1 రు య: 1-98ట్లులో య 1-00ట్లు భూమిని పచ్చవ పెద వెంగయ్య గారి భార్య లక్ష్మమ్మ గారి వద్ద నుండి రిజిష్టర్డు విక్రయపత్రం తేది: 10-09-1986 డాక్యుమెంటు నెం.765/1986 (SRO, Kovur) ద్వారా కొనుగోలు చేసినారు. మరియు మరియొక ఆస్తిని నా క్లయింట్ పడుగుపాడు పంచాయితీలో చేరిన పడుగుపాడు గ్రామంలోని సర్వే నెం.131/1 రు. య 0-49 1/2 సెంట్లు భూమిని శ్రీవిగుంటి భాజావి భర్త భాజాసాహెబ్ గారి వద్ద నుండి రిజిష్టర్డు విక్రయపత్రం తేది: 10-12-1990 డాక్యుమెంటు నెం.956/1990 (SRO, Kovur) ద్వారా కొనుగోలు చేసినారు. నా క్లయింట్ పై తెలిపిన ఒరిజినల్ డాక్యుమెంట్లను కవరులో పెట్టుకొని తే.15-12-2024దిన తన నివాసం నుండి ఐస్సపల్లికి వెళ్లి అక్కడ పనులు చూసుకొని ఒరిజినల్ డాక్యు మెంట్లను జెరాక్స్ తీసుకొను నిమిత్తం ఐస్సపల్లి నుండి అల్లూరుకు పోవుచుండగా మధ్యంలో పోయినవి. సదరు ఒరిజినల్ డాక్యుమెంట్లు నెం.765/1986& 956/ 1990ట్లు ఎవ్వరికైనను దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెల్పి ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును. సదరు ఒరిజినల్ డాక్యుమెంట్లను ఉపయోగించి ఎవ్వరైనా ఎట్టి లావాదేవీలు జరిపిన అవి చెల్లనేరవు. అవి నా క్లయింటుకు బద్ధగించవు.

పెనుబాక గంగాధరరెడ్డి, B.Com., B.L.,
అడ్వకేట్, రమేష్‌రెడ్డినగర్, నెల్లూరు-3. సెల్:9849340333

అసంపూర్తిగా ముగిసిన వాహనాల రుసుం వసూళ్ల వేలం

ఉదయగిరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ పావులూరి సామ్రాజ్యం అధ్యక్షతన నిర్వహించిన బస్టాండ్‌లో వాహనాల రుసుం వసూళ్ల వేలంపాట అసంపూర్తిగా ముగిసింది. ఎంపీడీవో అప్పాజీ, పంచాయతీ ఈవో కరీముల్లాలు వేలంపాట నిర్వహించారు. ఇద్దరు వ్యక్తులు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. ఈ వేలంపాటలో యాస్మిన్ రూ.2 లక్షలకు పాట దక్కించుకున్నారు. అయితే ఉప సర్పంచ్ షేక్ ముర్తుజాహుస్సేన్ తాను ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొంటాననడంతో అధికారులు సమయం ముగిసిందని నిరాకరించారు. అలాగే సర్పంచ్ సామ్రాజ్యం కూడా పాట రద్దు చేస్తున్నట్లు తెలిపి అక్కడ నుంచి వెళ్లిపోయారు. దీంతో అధికారులు విషయాన్ని ఆత్మకూరు డీఎల్‌పీవో దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పంచాయతీ పాలకవర్గ అత్యవసర సమావేశాన్ని మంగళవారం నిర్వహించి తుది నిర్ణయం తీసుకోవాలని సూచించినట్లు అధికారులు తెలిపారు.

శిథిలావస్థలో పంచాయతీ భవనం

- పొంచి ఉన్న ప్రమాదం
- భయాందోళనలో గ్రామస్థులు



అన్నారెడ్డిపాళెంలో శిథిలమైన పంచాయతీ భవనం

సంగం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామం నడిబొడ్డున ఉన్న శిథిలమైన పంచాయతీ భవనం ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. నాలుగు దశాబ్దాల కిందట ఈ పంచాయతీ భవనం నిర్మించారు. ఇది పెచ్చులూడి శ్లాబు కమ్ములు బయటకు దర్శనమిస్తున్నాయి. దీన్ని పదేళ్ల కిందట నిరుపయోగంగా వదిలేశారు. అయితే ఇళ్ల మధ్య ఈ భవనం ఉంది. గదులకు తాళం వేసినా వరండాలో పిల్లలు ఆడుకుంటూ అటువైపు వెళ్తున్నారు. గోడలు, శ్లాబు శిథిలాస్థితిలో ఉండడంతో ఎప్పుడు కూలుతుందో.. ఎటువంటి చెడువార్త వినాల్సి వస్తుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు.

రూ. 10 లక్షలతో నూతన భవనం

పంచాయతీ భవనం శిథిలాస్థితికి చేరడంతో ఉపాధి నిధుల నుంచి పంచాయతీ భవన నిర్మాణానికి రూ. 10 లక్షలు నిధులు మంజూరయ్యాయి. పాత భవనం తొలగించి కొత్త భవనం నిర్మించాల్సి ఉన్నా పాత భవనం తొలగించడానికి నిధులు మంజూరు కాకపోవడంతో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో వేరే చోట పంచాయతీ భవనం నిర్మించారు. పాత భవనాన్ని వదిలేశారు. ఈ భవనం వల్ల ప్రమాదం పొంచి ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై వామపక్ష పార్టీల నిరసన



కావలి: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

కావలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను కించపరుస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వామపక్షపార్టీలు సోమవారం సాయంత్రం స్థానిక బ్రిడ్జి సెంటర్ లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నేతలు పెంచలయ్య, నాగరాజు, లక్ష్మిరెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కరువది భాస్కర్‌లు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తూ ప్రజల హక్కులను కాలరాస్తుందని ఆరోపించారు. రాబోయే రోజులలో వామపక్షాలు చేసే పోరాటాలలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు నాయకులు కృష్ణమోహన్, పీ.తిరిపాలు, బీ. కృష్ణయ్య, దర్గాబాబు, బోసు, శ్యామల పాల్గొన్నారు.

●కందుకూరు: అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీల నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ముప్పరాజు కోటయ్య, సురేష్‌బాబు, మోహన్‌రావులు, గౌస్ బాషా, ఆనందమోహన్, నత్తా రామారావు, దుర్గా ప్రసాద్, బాల బ్రహ్మచారి, ఉప్పు టూరి మాధవరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

● ఉదయగిరి : పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల చేసిన వ్యాఖ్యలపై స్థానిక మసీదు కాంప్లెక్స్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య, బండగానిపల్లి ఎంపీటీసీ కాకు విజయమ్మ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● జలదంకి : కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కేంద్రమంత్రి వర్గం నుంచి భర్తరఫ్ చేయాలని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం వారు స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన చేస్తూ అమిత్‌షాకు వ్యాఖ్యలకు, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారు ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు మాల్యాద్రి, రావి మాల్యాద్రి, మేలంగి ఆంథోనీబాబు, సిపిఐ నాయకుడు దమ్ము దర్గాబాబు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలి

- యూటీఎఫ్ నేతల ర్యాలీ



ఉదయగిరి: ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఉదయగిరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5, 6, 7, 8వ తేదీల్లో కాకినాడలో నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శేషు, చలపతి కోరారు. స్వర్ణోత్సవ మహాసభల సందర్భంగా ప్రచార జాత సోమవారం రాత్రి ఉదయగిరికి చేరుకొంది. ఈ సందర్భంగా వైఎస్ఆర్ సర్కిల్ నుంచి జూనియర్ కళాశాల వరకు నినాదాలతో కూడిన ర్యాలీ నిర్వహించి అనంతరం స్థానిక కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య, సుబ్బారెడ్డి, ఫణిరాజ్, దస్తగిరిఅహ్మద్, రామిరెడ్డి, హనీఫ్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు: పట్టణంలో సోమవారం నిర్వహించిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల ప్రచార జాతాకు ఆత్మకూరు డివిజన్ ఉపాధ్యాయులు, స్థానిక యూటిఎఫ్, సీఐటీయు, అనుబంధ సంఘాల నేతలు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద స్వాగతం పలికారు. అనంతరం ప్రచార జాత పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు కొనసాగింది. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చలపతిశర్మ, వివి శేషు పాల్గొన్నారు.

● వింజమూరు : పట్టణంలో సోమవారం యూటీఎఫ్ వింజమూరు శాఖ ఆధ్వర్యంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చెంచలబాబు యాదవ్ మాట్లాడుతూ జనవరి 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో జరిగే సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేసుకుందాం

●కావలి టౌన్ : ఉపాధ్యాయులందరూ ఐక్యంగా ప్రభుత్వంపై పోరాడి జీవో నెంబర్ 117ను రద్దు చేసుకుని ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందామని యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు పిలుపునిచ్చారు. కాకినాడలో జనవరి 5,6,7 తేదీలలో స్వర్ణోత్సవాలు జరుగుతాయని, ఈసందర్భంగా పట్టణంలో చేపట్టిన ప్రచారజాతలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బెల్లంకొండ మాధవ, శ్రీదేవి, కిలారి వెంకటేశ్వర్లు, ప్రసాద్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

సైన్స్ పట్ల విద్యార్థులు మక్కువ పెంచుకోవాలి



ఉదయగిరి: విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంఈవో

ఉదయగిరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్ పట్ల మక్కువ పెంచుకోవాలని ఎంఈవో-2 శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్స్ ఫేర్ నిర్వహించారు. ఈ సైన్స్ ఫేర్‌లో ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని 15 ప్రదర్శనలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మధుకిరణ్, అధ్యాపకులు రమేష్, కౌసల్యలు ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేశారు. ఎంపికైనన వారిని జిల్లాస్థాయికి సిఫార్సు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలకేశవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●ఏఎస్ పేట: స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను సోమవారం నిర్వహించారు. మండలంలోని ఏడు జడ్పీ హైస్కూల్స్, మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు. గుంపర్లపాడు, చిరమన విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు జ్యోతి, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

● సీతారామపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంఈవో మస్తాన్‌వలి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలు నిర్వహించారు. మండలంలోని ఒగురువాండ్లపల్లి, సీతారామపురం , అయ్యావారిపల్లి, బసినేనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఈ పోటీ పాల్గొనగా వ్యక్తిగత విభాగంలో సీతారామపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గ్రూప్ కేటగిరి, టీచర్ కేటగిరిలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారని స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ తోట ఏడుకొండలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● వింజమూరు : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం మూడు విభాగాల్లో సైన్స్‌ఫెయిర్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను 8, 9, 10 తరగతి విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులు జనవరి 3వ తేదీన నెల్లూరులో జరిగే జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్ పోటీలలో పాల్గొంటారని ఎంఈవో ఎం.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు మాల్యాద్రి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ ఉత్పత్తులపై శిక్షణ

బిట్రగుంట, (దగదర్తి) డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):గాడ్ ఫ్రే వ్యవసాయ అనుబంధ ఉత్పత్తిదారుల సహకార సంఘ సభ్యులకు సోమవారం మండలకేంద్రంలో జిల్లా సహకార శాఖ అధికారి బి.గురప్ప శిక్షణ ఇచ్చారు. నిర్వహించారు. ఆరానిక్, ప్రకృతి వ్యవసాయం పద్ధతులను రైతులకు అలవాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీఓ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రారు ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నిందితులపై చర్య తీసుకోవాలి

కందుకూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడులో యాదవ కులస్థులపై దాడిచేసిన వ్యక్తులను చట్టపరంగా శిక్షించాలని యాదవ జేఏసీ నాయకులు మిరియం శ్రీనివాసులు, చిరుమామిళ్ల గోపీకృష్ణ, అమ్మనబ్రోలు మాధవ, నాగేశ్వరరావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఘర్షణలో గాయపడిన వ్యక్తులను కందుకూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పరామర్శించారు.

కులగణనలో ఎస్సీలకు అన్యాయం

- అంబేడ్కర్ యువజన సంఘం ఆందోళన



అల్లూరు : తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న ఎస్సీ నేతలు

అల్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం హయాంలో పనిచేసిన వాలంటీర్లు చేపట్టిన కులగణనలో ఇతర కులాలను ఎస్సీలోకి చేర్చి అసలైన ఎస్సీలకు తీరని అన్యాయం చేశారంటూ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సోమవారం వారు తహసీల్దారు, ఎంపీడీఓలకు వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఇష్టారీతిలో సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించడంతో వారు అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారని వాపోయారు. ఎస్సీల్లోకి చేర్చిన వారి పేర్ల వివరాలు పంచాయతీల్లోని నోటీసు బోర్డులపై అతికిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్లు సాల్మన్‌రాజు, పొంగులూరు శ్రీనివాసులు, గంగపట్నం శ్రీనివాసులు, ముసలి నరేంద్ర, పొంగులూరు సుధాకర్, గాలి వేణుగోపాల్ పాల్గొన్నారు.

●కందుకూరు : పట్టణంలోని పలు వార్డుల్లో ఎస్సీ కులగణన జాబితా అనేక తప్పుల తడకలగా ఉందని అంబేడ్కర్ మాల సంఘాల జేఏసీ పాలేటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సభ్యులతో కలిసి సబ్ కలెక్టర్ శ్రీపూజకు సోమవారం వినతిపత్రం అందచేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

●ఉలవపాడు: ఎస్సీ వర్గీకరణ దిశలో భాగంగా ప్రభుత్వం ఆయా పంచాయతీలు, సచివాలయాలకు పంపిన జాబితాలో అవకతవకలు ఉన్నాయని మండల ఎస్సీ మాలల సంఘం నాయకులు సోమవారం సచివాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అఅనంతరం ఎంపీడీవో విజయ, తహసీల్దారు లావణ్యను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో చాకిచర్ల, భీమవరం, బద్ధిపూడి, వీరేపల్లి గ్రామాల మాల సంఘం నాయకులు ఉన్నారు.

పోలీసు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

- సీఐ జి గంగాధర్, ఆత్మకూరు



ఆత్మకూరు, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ డిసెంబరు 31వ తేదీ రాత్రి నిర్వహించే వేడుకల్లో పోలీసు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ జి గంగాధర్ సోమవారం హెచ్చరించారు.

? నూతన సంవత్సర వేడుకలపై ఎలాంటి ఆంక్షలు విధించారు

! అర్ధరాత్రి రోడ్లపై వేడుకలకు అనుమతులు లేవు. మద్యం సేవించి వాహనాలు నడపరాదు. ద్విచక్ర వాహనాలతో విన్యాసాలు చేసినా, బాణాసంచా పేల్చినా చర్యలు తీసుకుంటాం.

? డ్రగ్స్ నియంత్రణకు ఏం చేస్తున్నారు.

! గంజాయి వినియోగం, రవాణా కేసుల్లో పట్టుబడుతున్న వారిలో యువత ఎక్కువగా ఉంటున్నారు. వీరి ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు రాబడుతూ మూలాలకు కారణమైన వారిని పట్టుకుంటున్నాం.

? శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టారు.

! ప్రత్యేక నిఘా ద్వారా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలతో మమేకమవుతూ ఎలాంటి గొడవలు జరగకుండా ప్రణాళికతో వ్యవహరిస్తున్నాం.

న్యూస్ బాక్స్

ఆర్వో సిస్టం ప్రారంభం

దుత్తలూరు (ఉదయగిరి), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సీడ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి రామిరెడ్డి చంద్రమౌళీశ్వరరెడ్డి, ఆయన సతీమణి సబితారెడ్డి ఆర్వోసిస్టంను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యశాలకు వచ్చే రోగులు, సిబ్బందికి శుద్ధి జలం అందించేందుకు తమ సంస్థ ద్వారా ఆర్వోసిస్టం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఏఏఎస్ అధికారి డబ్ల్యూ ఆర్ రెడ్డి, వైద్యాధికారి అయూబ్‌అప్సర్, సీడ్స్, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతదేహం గుర్తింపు

కావలి రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై మృతి చెందిన జలదంకి రమణయ్య(51) మృతదేహాన్ని సోమవారం దిగా పోలీసులు సోమవారం స్థానిక క్రిష్టియన్ పేటలో గుర్తించారు. గుడ్లూరు మండలం రాళ్ల పాడుకు చెందిన రమణయ్య ఆరోగ్యం సరి లేక పట్టణంలోని తన సోదరుడు ప్రకాశం ఇంట్లో ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం నుంచి కనిపించక పోవడంతో వెతుకులాట ప్రారంభించారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

బహిరంగ వేలం

బిట్రగుంట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి 2025లో జరగనున్న బ్రహ్మోత్సవాల వేలం సోమవారం ఆలయ ఈవో రాధకృష్ణ ఆధ్వర్యంలో కోవూరు టెంపుల్స్ గ్రూప్స్ ఈవో సీహెచ్ కృష్ణప్రసాద్ చేపట్టారు. కొబ్బరికాయలు, పూజాద్రవ్యాలు, చెరుకు అమ్ముకునే హక్కులకు పొందేందుకు వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. అలాగే తలనీలాల సేకరణ, తాత్కాలిక షాపుల వేలం నిర్వహించారు. పాదరక్షల సేకరణ, రంగుల రాట్నం వేలం వాయిదా పడినట్లు తెలిపారు.

2013 చట్టం అమలు చేయాలి

కందుకూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు పరిధిలోని అనుబంధ పరిశ్రమల కోసం జరిగే భూసేకరణలో భూములను వర్గీకరణ చేసి 2013 చట్టాన్ని అమలుచేయాలని సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, నూతల పాటి వెంకటేశ్వర్లు సోమవారం కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై గ్రామ సభలో ఏకగ్రీవ తీర్మానాన్ని ధిక్కరిస్తు ఏక పక్షంగా ధర నిర్ణయించడం సరైనది కాదని పేర్కొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశం

కొండాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏపీటీఎఫ్ 1938లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.సురేంద్రరెడ్డి, ఎమ్.పిచ్చి బాబులు హాజరై ఉపాధ్యాయులు, విద్యా సమస్యలపై చర్చించారు. సమావేశంలో మాధవ రెడ్డి, ఎమ్.శ్రీనివాసులురెడ్డి ఉపాధ్యాయులు సంఘం సభ్య త్వాన్ని స్వీకరించారు.

ఫుట్‌బాల్ విజేత జయరాజ్ జట్టు

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): రైల్వే ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో రెండురోజుల పాటు జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు జరిగా యి. అందులో భాగంగా సోమవారం జరిగిన ఫైనల్ పోటీలో ఎన్‌డీఎఫ్ఏ నెల్లూరు జట్టుపై కెఎస్ జయరాజ్ జట్టు విజేత నిలిచినట్లు నిర్వాహకులు స్టీవెన్‌కుమార్, నైనిల్ తెలిపారు. పోటీలో 14 జట్లు పాల్గొన్నట్లు చెప్పారు. విజేతలకు ట్రోఫీలను సీనియర్ క్రీడాకారుడు ఎస్ఎనవీద్, గనిపినేని నాగరాజు, బోగిరి ప్రభాకర్‌లు అందజేశారు.